మంగళవారం
30-12-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 10, సంచిక : 99
పేజీలు : 8, వెల: రూ.5.00

Simultaneously published from
Hyderabad, Vijayawada, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

బంగ్లా చొరబాటుదారులను పంపిస్తాం: అమిత్ షా

గువహతి:
బంగ్లాదేశ్ చొరబాటుదారులు అసోంలోనే కాకుండా... దేశంలో ఎక్కడున్నా పంపించేస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా చెప్పారు. అసోంలో నిర్వహించిన బహిరంగ ర్యాలీలో పాల్గొన్న అమిత్‌షా మాట్లాడుతూ పొరుగు దేశం నుంచి రాష్ట్రంలోకి చొరబడిన బంగ్లాదేశీయులు ఇక్కడి ప్రజల సంస్కృతి, గుర్తింపులపై బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. అటువంటి వారిని కాంగ్రెస్ ఓటు బ్యాంకుగా భావిస్తోందన్నారు. ఆ ఓటుబ్యాంకును రక్షించుకునేందుకే ప్రతిపక్ష కూటమి ఓటరు జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ(ఎస్ఐఆర్)ను వ్యతిరేకిస్తోందని ఆరోపించారు.

విరాళాల నివేదికలు గడువులోపే సమర్పించాలి

విశాలాంధ్ర-హైదరాబాద్:
రాష్ట్రంలో గుర్తింపు పొందిన, గుర్తింపు పొందని అన్ని రాజకీయ పార్టీలు... విరాళాలు, ఎన్నికల ఖర్చుకు సంబంధించిన చట్టబద్ధ పత్రాలను నిర్ణయించిన గడువులోపే సమర్పించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సి. సుదర్శన్ రెడ్డి సోమవారం ఆదేశాలు జారీ చేశారు. "గడువు పూర్తయ్యాక అందే ఏ విరాళాల నివేదికనైనా చట్ట ఉల్లంఘనగా పరిగణించి, రికార్డులోకి తీసుకోమని స్పష్టం చేశారు. ప్రతినిధుల చట్టం, 1951లోని సెక్షన్లు 29బీ, 29సీ ప్రకారం విరాళాల నివేదికలు, ఆడిట్

- మిగతా 2 లో

విశాఖ పోర్టు డిప్యూటీ చైర్‌పర్సన్‌గా తొలి మహిళా ఐఏఎస్

విశాలాంధ్ర బ్యూరో-విశాఖ:
విశాఖపట్నం పోర్టు అథారిటీ డిప్యూటీ చైర్‌పర్సన్‌గా మహిళా ఐఏఎస్ అధికారి రోష్నీ అపరాంజి కోరాటి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. విశాఖ పోర్టులో ఈ పదవి చేపట్టిన తొలి మహిళా ఐఏఎస్ అధికారి కావడం విశేషం. అసోం-మేఘాలయ కేడర్‌కు చెందిన ఆమె తన విద్యాభ్యాసమంతా విశాఖలోనే పూర్తి చేశారు. ఆమె తండ్రి విశాఖపట్నం పోర్టు హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయుడిగా సేవలందించారు. తండ్రి సేవలు అందించిన సంస్థకు కుమార్తె డిప్యూటీ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు

- మిగతా 2 లో

అమెరికాలో రోడ్డు ప్రమాదం.. ఇద్దరు తెలుగు యువతుల మృతి

హైదరాబాద్:
అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తెలుగు యువతులు మృతిచెందారు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం తెలంగాణలోని మహబూబాబాద్ జిల్లా గార్లకు చెందిన పులఖండం మేఘనారాణి (25), ముల్కనూరుకు చెందిన కడియాల భావన (24) మూడేళ్ల క్రితం అమెరికా వెళ్లారు. అక్కడ ఎమ్మెస్ పూర్తిచేసి ఉద్యోగాన్వేషణలో ఉన్నారు. మేఘన, భావన సహా మొత్తం 8 మంది స్నేహితులు రెండు కార్లలో కాలిఫోర్నియాలో విహారయాత్రకు బయల్దేరారు. ఈ క్రమంలో అలబామా హిల్స్ రోడ్డులో మలుపు వద్ద మేఘన, భావన ప్రయాణిస్తున్న కారు లోయలో

- మిగతా 2 లో

సెంగర్‌ను విడుదల చేయొద్దు

ఉన్నావో అత్యాచారం కేసుపై సుప్రీం కోర్టు

న్యూఢిల్లీ:
ఉన్నావ్ అత్యాచార కేసులో బీజేపీ మాజీ ఎమ్మెల్యే కుల్దీప్ సెంగర్‌కు పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. ఆయన జీవిత ఖైదును సస్పెండ్ చేస్తూ ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన బెయిల్‌పై సుప్రీం కోర్టు స్టే విధించింది. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ సీబీఐ సర్వోన్నత న్యాయస్థానంలో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. ఈ పిటిషన్‌ను సోమవారం జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం విచారణ చేపట్టి కీలక ఆదేశాలు జారీ చేసింది. బాధితురాలి భద్రతకు సంబంధించిన అంశాలతో సీబీఐ ప్రస్తావించిన అభ్యంతరాలను పరిశీలించిన ధర్మాసనం... ఢిల్లీ హైకోర్టు తీర్పుపై స్టే విధించడంతో పాటు నిందితుడు కుల్దీప్‌కు నోటీసులు జారీ చేసింది. బెయిల్ రద్దు కోరుతూ దాఖలైన పిటిషన్‌పై నాలుగు వారాల్లో సమాధానం ఇవ్వాలని సెంగర్‌ను కోర్టు ఆదేశించింది. 'ఈ కేసులో జీవిత ఖైదు పడ్డ సెంగార్‌ను జైలు నుంచి విడుదల చేయొద్దు. ఓ కానిస్టేబుల్ పబ్లిక సర్వెంట్ అయినప్పుడు... ఓ ఎమ్మెల్యే మాత్రం కాదా? ఈ కేసులో బెయిల్ ఇచ్చింది కూడా ఉత్తమ జడ్జీలే. మేం కూడా అప్పుడప్పుడు తప్పులు చేస్తుంటాం. ఇంతకీ ఎవరు పబ్లిక్ సర్వెంట్లు' అంటూ సెంగర్ తరపు

- మిగతా 2 లో

ఆరావళి మైనింగ్‌పై సుప్రీం స్టే

న్యూఢిల్లీ:
ఆరావళి పర్వతాల నిర్వచనానికి సంబంధించి గతంలో ఇచ్చిన ఆదేశాలు, నిపుణుల కమిటీ నివేదిక అమలుపై సుప్రీంకోర్టు సోమవారం స్టే విధించింది. ఏదైనా నివేదిక లేదా కోర్టు ఆదేశాలు అమలు చేయడానికి ముందు న్యాయమైన, నిష్పాక్షికమైన, స్వతంత్ర నిపుణుల అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకోవాలని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ ఏజీ మసిహ్‌తో కూడిన ధర్మాసనం పేర్కొంది. 100 మీటర్లు లేదా అంతకంటే ఎక్కువ భూభాగాలకు ఆరావళిని పరిమితం చేయడం క్రమబద్ధీకరించలేని మైనింగ్‌కు దారితీస్తుందా అనే అంశాన్ని పున:సమీక్షిస్తామని, వివరణలు కోరతామని ధర్మాసనం తెలిపింది. ఆరావళి పర్వతాల పరిధి నిర్వచనాన్ని పరిశీలించేందుకు ఉన్నతస్థాయి నిపుణులతో కమిటీ నియమించాలని ప్రతిపాదిస్తున్నట్లు ధర్మాసనం పేర్కొంది. కమిటీ నియామకంపై కోర్టుకు సహకరించాలని అటార్నీ జనరల్, సీనియర్ న్యాయవాది పి.పరమేశ్వర్ అభ్యర్థించడంతో పిటిషన్‌దారులకు నోటీసులు జారీ చేసింది. కొత్త కమిటీ నియమించే వరకు కమిటీ సిఫారసులు, గతంలో ఇచ్చిన ఆదేశాలను నిలిపివేస్తున్నట్లు పేర్కొంది. ఈ కేసు తదుపరి విచారణను జనవరి 21కి వాయిదా వేసింది. ఆరావళి పర్వతాలపై సవరించిన నిర్వచనాన్ని తప్పుగా అర్థం చేసుకోవచ్చని, వందమీటర్ల కంటే తక్కువ ఎత్తున్న చోట మైనింగ్‌కు అనుమతిస్తే పెద్ద ఎత్తున తవ్వకాలు జరిగే ప్రమాదం ఉందని

- మిగతా 2 లో



సింగరేణి సంస్థను

కాపాడుకోవాలి

సీపీఐ శాసనసభాపక్ష నేత కూనంనేని సాంబశివరావు

విశాలాంధ్ర-హైదరాబాద్:
రాష్ట్రంలో అతి పెద్ద ప్రభుత్వ రంగ సంస్థ అయిన సింగరేణిని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని సీపీఐ శాసన సభాపక్ష నేత కూనంనేని సాంబశివరావు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. సోమవారం ప్రారంభం అయిన అసెంబ్లీ సమావేశాల్లో కూనంనేని మాట్లాడుతూ సింగరేణి కార్మికులలో తీవ్ర అసంతృప్తి ఉందని తెలిపారు. వాటిని సరిదిద్దడానికి సంబంధిత మంత్రులుగానీ, సింగరేణి కార్మికులతో సంబంధం ఉన్న నియోజక వర్గాల ప్రతినిధులందరితో కలిసి ముఖ్యమంత్రి స్వయంగా సమావేశం ఏర్పాటు చేస్తే సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. సింగరేణి కూడా కొద్ది రోజుల్లోనే కనుమరుగై మొత్తం ప్రైవేటు పరమయ్యే పరిస్థితులు కనపడుతున్నాయని చెప్పారు. వైద్య సదుపాయాల కల్పన సరిగా లేకపోవడంతో కార్మికుల్లో అసంతృప్తి నెలకొందని అన్నారు. కారుణ్య నియామకాల కోసం వయస్సు 30 నుంచి 40 సంవత్సరాలు పెంచారని, అనేక కారణాలతో దానిని అమలు పర్చడం లేదన్నారు. మెడికల్ బోర్డు ద్వారా కార్మికుల పిల్లలకు అవకాశం కల్పించడం తెలిపారు. అలాగే సొంత ఇంటి పథకం లేదని అన్నారు. చిన్న చిన్న పరిశ్రమలే సొంత ఇల్లు కట్టిస్తున్నాయన్నారు. మారు పేర్లతో ఆ రోజుల్లో అవకాశం కల్పించిన ఫలితంగా వాళ్ల పిల్లలు ఈ రోజు అన్యాయమవుతున్నారని, వారికి అవకాశం కల్పించాలన్నారు. నూతన గనులకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన చట్టం వల్ల సింగరేణికి వచ్చే మైన్స్ ప్రైవేట్ వారికి వెళుతున్నాయన్నారు. సాధ్యమైనంత వరకు సింగరేణి వారు వాటిని సంపాదించుకోవాలన్నారు. బొగ్గు ప్రైవేటు వారికి కాకుండా సింగరేణి కార్మికులే చేయాలనే నిబంధన ఉందని, అయితే ఆ నిబంధనను

- మిగతా 2 లో

మాటల యుద్ధం

- సాగునీటి జలాలపై అధికార, ప్రతిపక్షాల నడుమ వాగ్వాదం
- దుమారం రేపిన కౌశిక్‌రెడ్డి వ్యాఖ్యలు
- రికార్డుల నుంచి తొలగించాలని కాంగ్రెస్ డిమాండ్
- తొలిరోజు అసెంబ్లీకి అలా వచ్చి... ఇలా వెళ్లిన కేసీఆర్

విశాలాంధ్ర - హైదరాబాద్:
తెలంగాణలో శీతాకాల శాసనసభ, శాసనమండలి సమావేశాలు ప్రారంభం అయ్యాయి. ఉభయ సభలు ప్రారంభమైన కొద్దిసేపటికే అధికార కాంగ్రెస్ ... ప్రతిపక్ష బీఆర్ఎస్‌ల మధ్య మాటల యుద్ధం మొదలైంది. ముందుగా ఊహించిన విధంగానే సాగునీటి జలాలపై ఇరు పక్షాల మధ్య మాటల యుద్ధం కొనసాగింది. అనంతరం జీరో అవర్ ఉద్దేశించి హుజురాబాద్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి చేసిన వ్యాఖ్యల దుమారం రేపాయి. మేడిగడ్డను బాంబులు పెట్టి పేల్చారని కౌశిక్ రెడ్డి ఆరోపించారు. చెక్‌డ్యాంనూ, తనుగుల చెక్‌డ్యాంను బాంబు పెట్టి పేల్చేశారని కౌశిక్ రెడ్డి అనడంతో సభలో గందరగోళం నెలకొంది. కౌశిక్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ సభ్యుల తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. మెడిగడ్డను, చెక్ డ్యాంను బాంబులు పెట్టి పేల్చారని అనడం ఏంటని ధ్వజమెత్తారు. రికార్డుల నుంచి కౌశిక్‌రెడ్డి వ్యాఖ్యలను తొలగించాలని డిమాండ్ చేశారు.

రాతపూర్వకంగా సమాధానం ఇవ్వాలి: హరీశ్‌రావు

మాజీ మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ జీరో అవర్‌లో సభ్యులు అడిగిన ప్రశ్నలకు రాతపూర్వకమైన సమాధానాన్ని మళ్లీ వచ్చే సెషన్ లోపు సభ్యులకు అందించాలన్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం సభ్యులు అడిగిన ప్రశ్నలకు రాతపూర్వక సమాధానాలు పంపించిందని గుర్తు చేశారు. కొత్త సభ్యులు మాట్లాడుతుంటే జీరో అవర్ కాస్తా అరణ్యరోదనగా మారుతోందని, అలా మార్చకండని సూచించారు. ప్రభుత్వ ఉద్యోగులు ... ప్రభుత్వానికి రథచక్రాల వంటి వారు. వాళ్లు సంతోషంగా ఉంటేనే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు సజావుగా చేరుతాయని పేర్కొన్నారు. కానీ నేడు రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులందరూ తీవ్రమైన మనోవేదనలో ఉన్నారని, దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగులకు ఆరు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి రెండేళ్లు అవుతున్నా ఇంతవరకు పీఆర్సీ ఇవ్వలేదని... వెంటనే విడుదల చేయాలని కోరారు. గతంలో కేసీఆర్ 43 శాతం, 39 శాతం పీఆర్సీ అందించారని, ఉద్యోగులకు ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ జీవోను కూడా ఇచ్చామన్నారు. కాంగ్రెస్ పార్టీ ఈహెచ్‌ఎస్ అమలు చేస్తామని మేనిఫెస్టోలో పెట్టి ఇప్పటికీ అమలు చేయలేదని విమర్శించారు. రిటైర్డ్ ఉద్యోగులు 39 మంది ప్రభుత్వ బెనిఫిట్స్ అందక మనోవేదనతో మరణించారని ఆవేదన వ్యక్తంచేశారు. తమ హయాంలో పదవీవిరమణ చేసిన 17 వేల మంది ఉద్యోగులకు సమయానికి డబ్బులు అందించామని చెప్పారు. తాను అసెంబ్లీకి వస్తుంటే సిద్దిపేటకు చెందిన విశ్రాంత జేడీ... వెటర్నరీ డాక్టర్ జగత్ కుమార్ రెడ్డి కలిశారని, అక్టోబరు, 2024లో పదవీ విరమణ చేస్తే ఇప్పటివరకు ఒక్క రూపాయి రాలేదని ఆవేదన వ్యక్తం చేశారని సభ దృష్టికి తీసుకువచ్చారు. హైకోర్టులో కేసు వేసినా రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వడం లేదు. 35 ఏళ్లు సేవ చేసిన మమ్మల్ని ఇలా ఇబ్బంది పెట్టడం సరికాదని ఆయన కన్నీరు

- మిగతా 2 లో

కేసీఆర్‌కు రేవంత్ కరచాలనం

శాసనసభ ప్రారంభం కాగానే సభ్యులందరికంటే ముందుగానే వెళ్లి తన చైర్‌లో ప్రతిపక్ష నేత కేసీఆర్ కూర్చున్నారు. సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీ హాల్లోకి రాగానే కేసీఆర్ దగ్గరికి వెళ్లి కరచాలనం చేశారు. అనంతరం మంత్రులు, ఎమ్మెల్యేలు కేసీఆర్‌కు కరచాలనం చేశారు. కేసీఆర్ ను కలిసిన వారిలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు, కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, సీతక్క వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్‌లు బీర్ల ఐలయ్య, ఆది శ్రీనివాస్, సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తదితరులు ఉన్నారు. నూతన ఎమ్మెల్యే నవీన్ యాదవ్ కేసీఆర్ ఆశీర్వాదం తీసుకున్నారు. చాలా కాలం తర్వాత అసెంబ్లీ సమావేశాలకు హాజరైన కేసీఆర్... సభకు అలా వచ్చి ఇలా వెళ్లిపోయారు. అసెంబ్లీ అటెండెన్స్ రిజిస్టర్ లో సంతకం చేసి సభలో జాతీయగీతం ఆలాపన అయిపోగానే బయటకు వెళ్లిపోయారు. కేవలం మూడే నిమిషాలు ఉన్నారు . కనీసం దివంగత సభ్యుల సంతాప తీర్మానం కూడా వినలేదు.

అందుబాటులో యూరియా

- 5.70 లక్షల మెట్రిక్ టన్నులు రాష్ట్రానికి చేరిక
- యాప్ ద్వారా 2,01,789 బస్తాలు కొనుగోలు
- కలెక్టర్ల వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి తుమ్మల

విశాలాంధ్ర - హైదరాబాద్:
రబీ సీజన్‌లో రైతులకు అవసరమైనంత యూరియా అందుబాటులో ఉందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఫెర్టిలైజర్ (యూరియా) యాప్, యూరియా పంపిణీలపై సీఎస్, స్పెషల్ సీఎస్‌లతో కలిసి మంత్రి జిల్లా కలెక్టర్లతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. తుమ్మల మాట్లాడుతూ కేంద్రం 10.40 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కేటాయించగా, 5.70 లక్షల మెట్రిక్ టన్నులు ఇప్పటికే రాష్ట్రానికి చేరుకున్నాయని వివరించారు. గతేడాది ఇదే సమయానికి 2.81 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అమ్మకాలు జరగగా, ఈ సీజన్‌లో ఇప్పటి వరకు 3.72 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా రైతులు కొనుగోలు చేశారని వివరించారు. ఇది గత సీజన్ కంటే 92 వేల మెట్రిక్ టన్నులు అధికం అని పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 2.15 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా నిల్వ ఉన్నట్లు తెలిపారు. ఫెర్టిలైజర్ (యూరియా) యాప్ ను ఆదిలాబాద్, మహబూబ్ నగర్, జనగామ, నల్లగొండ, పెద్దపల్లి జిల్లాల్లో అమలు చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటి వరకు ఈ ఐదు జిల్లాల్లో 82,059 మంది రైతులు యాప్ ద్వారా 2,01,789 యూరియా బస్తాలు కొనుగోలు చేశారన్నారు. యాప్ అమలులో ఉన్న జిల్లాల కలెక్టర్లతో మంత్రి మాట్లాడి వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. కొన్ని సాంకేతిక సమస్యలు తలెత్తినా వెంటనే పరిష్కరిస్తున్నారని, రైతులు కూడా యూరియా యాప్ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారని బదులిచ్చారు. యూరియా అమ్మకాలు పారదర్శకంగా జరుగుతున్నాయని మంత్రి తెలిపారు. ఇప్పటికే కపాస్ కిసాన్ యాప్ ద్వారా రైతులు పత్తి అమ్మకాలు సులభంగా చేసుకోగలుగుతున్నారని, అదే దిశలో ఈ యాప్ ని తీసుకురావడం జరిగిందని వివరించారు. యాప్ అమలులో లేని జిల్లాలలో యూరియా సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు రాకుండా చూడాలని మంత్రి ఆదేశించారు. జిల్లాల వారీగా యూరియా నిల్వలు, డిమాండ్, పంపిణీపై కలెక్టర్లు నిశితంగా పర్యవేక్షించాలని, అవసరమైతే అదనపు అమ్మకపు కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. యూరియా పంపిణీపై మండల, డివిజన్, జిల్లా స్థాయిలో ప్రత్యేక పర్యవేక్షణ బృందాలను నియమించాలని సూచించారు. ఎలాంటి సమస్యలు తలెత్తినా వెంటనే పరిష్కరించాలని, పర్యవేక్షణలో ఎటువంటి అలసత్వం ఉండకూడదన్నారు. యూరియా లభ్యతపై రైతులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. రైతుల సౌకర్యార్థం వ్యవసాయ కమిషనరేట్‌లో టోల్ ఫ్రీ నెం. 18005995779 ఏర్పాటు చేసినట్టు చెప్పారు. అనంతరం సీఎస్ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలు ఉదయాన్నే తెరిచేలా చర్యలు తీసుకోవాలని, స్టాక్ వివరాలు ఎప్పటికప్పుడు తెప్పించుకొని, సాయంత్రం జిల్లా అధికారులతో సమీక్షించాలన్నారు. స్పెషల్ సీఎస్ సవ్యసాచి ఘోష్ మాట్లాడుతూ... ప్రతి సొసైటీలో

- మిగతా 2 లో

'ఉపాధి' కి ఇబ్బందులే!

- కొత్త, పాత చట్టాలపై పార్లమెంటరీ ప్యానెల్ చర్చ
- లబ్ధిదారులకు చెల్లింపులు, అదనపు బడ్జెట్ ఏర్పాటుపై సభ్యుల ఆందోళన

న్యూఢిల్లీ:
మహాత్మాగాంధీ ఉపాధి హామీ చట్టానికి తూట్లు పొడుస్తూ కేంద్రంలోని మోదీ సర్కార్ తీసుకువచ్చిన వీబీ-జీ రామ్‌జీ చట్టం అమలు క్షేత్ర స్థాయిలో అనేక ఇబ్బందులకు తెరతీస్తుందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఎన్డీయే ప్రభుత్వం ఏకపక్షంగా బిల్లును రూపొందించి... ఆమోదింపజేసుకున్న ఈ చట్టంలోని నిబంధనలు, షరతులపై వామపక్షాలు సహా ఇతర ప్రతిపక్ష పార్టీలు తీవ్రంగా తప్పుపడుతున్నాయి. కూలీల కడుపు కొట్టే ఈ చట్టాన్ని తక్షణం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఉద్యమిస్తున్నాయి. ఈ నేపథ్యంలో పార్లమెంటరీ ప్యానెల్ ఒకటి యూపీఏ హయాంలో తీసుకొచ్చిన గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజీఎన్ఆర్ఈజీఏ) లోని వివిధ అంశాలను, అలాగే మోదీ సర్కారు తీసుకొచ్చిన వీబీ-జీ రామ్ జీ చట్టాన్ని సజావుగా రాబోయే ఆరు నెలల్లో ఎలా ముందుకు వెళ్లాలనే దానిపై చర్చించింది. కాగా, గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్ పార్లమెంటరీ స్థాయీ సంఘంలోని మెజారిటీ సభ్యులు ఎంజీఎన్ఆర్ఈజీఏ నుంచి వీబీ-జీ రామ్ జీ చట్టానికి పరివర్తన ఎలా జరుగుతుందనే దానిపై మాట్లాడినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ కాలంలో లబ్ధిదారులకు చెల్లింపులు ఎలా చేస్తారు, అదనపు బడ్జెట్ మద్దతును ఎలా ఏర్పాటు చేస్తారనే దానిపై ఆందోళన వ్యక్తం చేశారని పేర్కొన్నాయి. అయితే ఈ సమావేశంలో ఏ సభ్యుడూ వీబీ-జీ రామ్ జీ చట్టాన్ని

- మిగతా 2 లో

కేసీఆర్‌కు పేరు వస్తుందనే

పాలమూరును పండబెట్టారు

- మాజీ సీఎం నిబద్ధతకు 'కాళేశ్వరం' నిదర్శనం
- కృష్ణానది ఏ బేసిన్‌లో ఉందో సీఎంకి తెలియని దుస్థితి
- కాంగ్రెస్‌కు పాలన చేతగాదని సర్పంచ్ ఎన్నికల్లో తేటతెల్లం: కేటీఆర్

విశాలాంధ్ర-హైదరాబాద్:
కరువు జిల్లా పాలమూరును సశ్యశ్యామలం చేసేందుకు చేపట్టిన పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తయితే కేసీఆర్‌కు పేరు వస్తుందన్న భయంతోనే ఆ ప్రాజెక్టును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పక్కనపెట్టారని కేటీఆర్ ఆరోపించారు. కాళేశ్వరం కేసీఆర్ నిబద్ధతకు నిదర్శనమని, ప్రాజెక్టులపై అవగాహన లేని పాలకులు కేసీఆర్‌తో చర్చలు కోరుతున్నారని ఎద్దేవా చేశారు. అసెంబ్లీలో సోమవారం ఆయన మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడుతూ... ఏ ప్రభుత్వం అయినా ముందుగా తాగునీటి అవసరాల పేరుతోనే ప్రాజెక్టులను ప్రారంభిస్తుందని, అనంతరం అన్ని అనుమతులు తెచ్చుకోవడం పరిపాటేనని కేటీఆర్ తెలిపారు. దీన్ని ఎవరూ బయటకు చెప్పరని వ్యాఖ్యానించారు. పోలవరం ప్రాజెక్టు గురించి 70 ఏళ్ల నుంచి వింటున్నామని, కానీ ఇప్పటికీ అది పూర్తి కాలేదని గుర్తుచేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు మాత్రం తమ నాయకుడు కేసీఆర్ హయాంలోనే పూర్తయిందని, దీనికి కారణం కేసీఆర్ నిబద్ధతే అని స్పష్టం చేశారు. కాళేశ్వరంలో రంధ్రాన్వేషణ చేస్తే రాష్ట్రానికి నష్టం జరుగుతుందే తప్ప రాజకీయంగా తమకు నష్టం జరగదని అన్నారు. ప్రజలకు నీళ్లు ఇచ్చింది ఎవరో ప్రజలకు బాగా తెలుసని చెప్పారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు విషయంలో 45 టీఎంసీలకు ఒప్పుకుంటే అది నష్టమే అవుతుందని, 299 టీఎంసీలకు ఒప్పుకున్నది అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వమేనని గుర్తుచేశారు. దాని ఆధారంగానే తమ ప్రభుత్వం మరిన్ని నీటి

- మిగతా 2 లో

ఉత్తమ్‌కు రేవంత్ సహవాస దోషం

పాలమూరు ప్రాజక్టు కోసం నేల మీద పడుకుని పనిచేశా

కాంగ్రెస్ హయాంలో 3 డీపీఆర్‌లు వాపస్: హరీశ్‌రావు

2 లో

ఇదీ లోకం!

వీళ్ల జిమ్మడ! పండక్కి కనీసం ప్రశాంతంగా ఊరుకూడా వెళ్లనివ్వలేని ప్రభుత్వాలు!

ఉక్రెయిన్-రష్యా శాంతి ఒప్పందం కొలిక్కి: ట్రంప్

వాషింగ్టన్: సుమారు నాలుగేళ్లుగా సాగుతున్న రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలికేలా శాంతి ఒప్పందం తుది దశకు చేరుకున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. మరోపక్క ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ కూడా చర్చల్లో 90శాతం అంగీకారం కుదిరినట్లు చెప్పారు. ఆదివారం ఫ్లోరిడాలోని మార్-ఎ-లాగో క్లబ్‌లో శాంతి ఒప్పందంపై చర్చించేందుకు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో ట్రంప్ భేటీ అయ్యారు. ఈ చారిత్రక సమావేశం తర్వాత ఇరువురు దేశాధినేతలు మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ట్రంప్ శాంతి ఒప్పందంపై కీలక కామెంట్స్ చేశారు. చర్చలు ఫలప్రదంగా జరిగాయని పేర్కొన్నారు. జెలెన్‌స్కీతో సమావేశానికి ముందే తాను పుతిన్ తో మాట్లాడినట్లు చెప్పారు. అలాగే, యూరోపియన్ నేతలతో కూడా తాను మాట్లాడినట్లు తెలిపారు. "మా మధ్య అద్భుతమైన సమావేశం జరిగింది. చాలా విషయాలపై చర్చించాము. మీటింగ్‌కు ముందు నేను రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో మాట్లాడాను. జెలెన్‌స్కీతో సమావేశం రెండు గంటలకు పైగా కొనసాగింది. శాంతి ఒప్పందానికి చాలా దగ్గర్లో ఉన్నాం. బహుశా చాలా చేరువలో ఉన్నామని నేను భావిస్తున్నాను. జెలెన్‌స్కీ, నేను ఇప్పుడే యూరోపియన్ నేతలతో మాట్లాడాం. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత అత్యంత భయంకరమైన ఈ యుద్ధాన్ని ముగించే దిశగా చాలా పురోగతి సాధించాం" అని ట్రంప్ పేర్కొన్నారు. డాన్‌బాస్ భూభాగ వివాదంపై విలేకరులు అడిగిన ప్రశ్నపై ట్రంప్ స్పందిస్తూ... శాంతి ఒప్పందం ఓ కొలిక్కి వచ్చింది. అయితే ఇంకా కొన్ని అంశాలు మిగిలి ఉన్నాయని ట్రంప్ అంగీకరించారు. అందులో ప్రధానమైనది తూర్పు ఉక్రెయిన్ భూభాగమైన డాన్‌బాస్ సంబంధించిన అంశమని తెలిపారు. చివరికి దీనికి పరిష్కారం దొరుకుతుందని భావిస్తున్నట్లు ట్రంప్ తెలిపారు. యుద్ధం ఇప్పుడు ముగియాలని లేకపోతే ఇంకా చాలాకాలం కొనసాగుతుందని ట్రంప్ పేర్కొన్నారు. దీనివల్ల ప్రజలు అధిక సంఖ్యలో మరణిస్తూనే ఉంటారని ఆందోళన వ్యక్తం చేశారు. అలా జరగడం పుతిన్‌కు, జెలెన్‌స్కీకి, తనకు ఇష్టం లేదన్నారు. ఇదే సమయంలో ఒప్పందం ఎంత శాతం పూర్తయిందో చెప్పడానికి నిరాకరించిన ట్రంప్, చర్చలు తుది దశకు చేరుతున్నా యని తెలిపారు. ఇక శాంతి చర్చల్లో భాగంగా ఉక్రెయిన్ ప్రతిపాదించిన 20 పాయింట్ల ప్రణాళికపై ప్రధానంగా దృష్టి సారించినట్లు జెలెన్‌స్కీ పేర్కొన్నారు. శాంతి ప్రణాళికలోని 90 శాతం అంశాలపై ఇరు పక్షాల మధ్య అంగీకారం కుదిరిందని తెలిపారు. అమెరికా-ఉక్రెయిన్ మధ్య రక్షణ పరమైన హామీలపై 100 శాతం స్పష్టత వచ్చిందన్నారు. ఐరోపా దేశాలు కూడా ఇందులో భాగస్వాములు కానున్నట్లు తెలిపారు. యుద్ధం ముగిసిన తర్వాత ఉక్రెయిన్ సైన్యం స్థాయి, ఆయుధ సంపత్తిపై పూర్తి స్థాయి అంగీకారం లభించినట్లు తెలిపారు. ఉక్రెయిన్ ఆర్థిక వ్యవస్థను తిరిగి పుంజుకునేలా చేసే ప్లాన్ తుది దశకు చేరుకుందని ఆయన ప్రకటించారు. కాగా, ఒకవైపు శాంతి చర్చలు జరుగుతుండగా ఉక్రెయిన్‌లోని స్లోవియన్స్ నగరంలో రష్యా జరిపిన దాడుల్లో పలువురు మరణించారు. ఈ ఘటనను జెలెన్‌స్కీ తీవ్రంగా ఖండించారు. గతవారం రోజుల్లోనే రష్యా 2,100 డ్రోన్లు, 94 మిసైళ్లతో ఉక్రెయిన్‌పై భారీ దాడులు చేసింది.

బంగ్లా ఎన్నికల్లో తారిఖ్ పోటీ

ఢాకా: బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) యాక్టింగ్ చైర్మన్ తారిఖ్ రెహ్మాన్ సార్వత్రిక ఎన్నికల బరిలో నిలిచారు. సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. ఢాకా-17, బోగ్రా-6 నియోజకవర్గాల నుంచి ఆయన పోటీ చేయనున్నారని పార్టీ వర్గాలు వెల్లడించాయి. బంగ్లాదేశ్‌లో ఫిబ్రవరి 12న సార్వత్రిక ఎన్నికలు జరగనున్నాయి. నామినేషన్ల గడువు సోమవారంతో ముగియగా... తారిఖ్ తరఫున బీఎన్‌పీ నేతలు ఈ నామినేషన్లను సమర్పించారు. కొన్నివారాల్లో ఎన్నికలు ఉండగా.. ఆయన్ను ఓటర్ల జాబితాలో చేర్చేందుకు ఆదివారం బంగ్లాదేశ్ ఎన్నికల కమిషన్ ఆమోదం తెలిపింది. కాగా.. మాజీ ప్రధాని హసీనాకు చెందిన అవామీ లీగ్ కార్యకలాపాలపై నిషేధం ఉన్న కారణంగా వచ్చే ఎన్నికల్లో ఆ పార్టీ పోటీచేయడం కుదరదని తాత్కాలిక ప్రభుత్వం ఇప్పటికే స్పష్టంచేసిన నేపథ్యంలో బీఎన్‌పీపైనే అందరి దృష్టి నెలకొంది.

నేపాల్‌లో జేఎస్పీ, ఎల్ఎస్పీ విలీనం

ఖాట్మండు: నేపాల్‌లో మార్చి 5న జరగనున్న నేపాల్ సార్వత్రిక ఎన్నికలకు ముందు రెండు ప్రధాన రాజకీయ పార్టీలు విలీనం అవుతున్నట్లు ప్రకటించాయి. మహంత ఠాకూర్ నేతృత్వంలోని జనతా సమాజ్ వాదీ పార్టీ (జెఎస్పీ), ఉపేంద్ర యాదవ్ నేతృత్వంలోని లోక్ తాంత్రిక్ సమాజ్ వాదీ పార్టీ (ఎల్ఎస్పీ) విలీనం అవుతున్నట్లు సంయుక్త ప్రకటన విడుదల చేశాయి. దేశంలోని ప్రస్తుత రాజకీయ పరిస్థితిని విశ్లేషించి, నేపాల్‌లో సమాఖ్య ప్రజాస్వామ్య గణతంత్ర వ్యవస్థను బలోపేతం చేయవలసిన అవసరాన్ని గ్రహించిన తర్వాత ఈ రెండు పార్టీలను విలీనం చేయాలనే నిర్ణయం తీసుకున్నట్లు ఆ పార్టీల నాయకులు వెల్లడించారు. విలీనం అయిన రెండు పార్టీల అధ్యక్షులు సంతకం చేసిన సంయుక్త ప్రకటనలో "సమాఖ్యవాదం, గుర్తింపు, సామాజిక న్యాయం వంటి ప్రగతిశీల మార్పుకు సంబంధించిన అంశాలను బలోపేతం చేయడం ద్వారా న్యాయమైన సమాజాన్ని నిర్మించే లక్ష్యంతో రెండు పార్టీలను ఏకం చేయాలనే నిర్ణయం తీసుకున్నాం. అవసరమైన చర్చలు, విధానపరమైన విషయాలు తరువాత వెల్లడిస్తాం " అని పేర్కొన్నారు. కాగా, ఖాట్మండు మెట్రోపాలిటన్ మునిసిపాలిటీ మేయర్ బాలేంద్ర షా (బాలెన్) రాష్ట్రీయ స్వతంత్ర పార్టీ (ఆర్ఎస్పీ) తరుపున మార్చి 5న జరిగే నేపాల్ ఎన్నికల్లో పోటీ చేయడానికి ఒక ఒప్పందంపై సంతకం చేశారు. దీంతో ఆదివారం ఆయనను రాష్ట్రీయ స్వతంత్ర పార్టీ (ఆర్ఎస్పీ) తరుపున ప్రధాన మంత్రి అభ్యర్థిగా ప్రకటించారు. బాలెన్, ఆయన పార్టీ అభ్యర్థులు ఈ ఎన్నికల్లో ఎన్నికల సంఘం కేటాయించిన ఆర్ఎస్‌పీ ఎన్నికల చిహ్నం "గంట" గుర్తుపై పోటీ చేయనున్నారు.

ఆరావళి మైనింగ్‌పై సుప్రీం స్టే

(మొదటిపేజీ తరువాయి)

పర్యావరణ వేత్తలు ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలోనే అతిపురాతన పర్వతశ్రేణి ఆరావళి. ఇక్కడ అక్రమంగా పొందిన అనుమతులతో అడ్డగోలుగా మైనింగ్ జరుగుతోందని చాలాకాలంగా ఆందోళన ఉంది. ఇలాంటి సమయంలో 100 మీటర్లు కంటే ఎక్కువ ఎత్తున్నవి మాత్రమే పర్వతాలంటూ కేంద్రం కొత్త నిర్వచనం చెప్పింది. 100 మీటర్ల కంటే తక్కువ ఎత్తులో ఉన్న కొండల్లో మైనింగ్‌కు అనుమతించింది. దీనివల్ల హర్యానా, రాజస్థాన్, గుజరాత్, ఢిల్లీకి ముప్పు తప్పదని పర్యావరణవేత్తలు హెచ్చరించారు. ఈ నేపథ్యంలో ఆరావళి పర్వత శ్రేణులు ఉన్న రాష్ట్రాలు కొత్తగా మైనింగ్ లీజులేవీ ఇవ్వకుండా కేంద్ర ప్రభుత్వం ఇటీవల నిషేధం విధించింది. గుజరాత్ నుంచి జాతీయ రాజధాని ప్రాంతం (ఎన్‌సీఆర్) వరకూ విస్తరించి ఉన్న ఆరావళి పర్వత శ్రేణుల సమగ్రతను పరిరక్షించేందుకు, గనుల అక్రమ తవ్వకాలను అడ్డుకునేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నది.

సెంగర్‌ను విడుదల చేయొద్దు

(మొదటిపేజీ తరువాయి)

లాయర్లు సిద్ధార్థ దవే, హరిహరన్‌ను జస్టిస్ సూర్యకాంత్ ప్రశ్నించారు. ఉత్తరప్రదేశ్‌లోని ఉన్నావ్ జిల్లాలో 2017లో 17 ఏళ్ల బాలికపై సామూహిక అత్యాచారం జరిగింది. నాలుగు సార్లు ఎమ్మెల్యేగా పనిచేసిన అప్పటి బీజేపీ నేత కుల్దీప్ సెంగర్ ఈ కేసులో ప్రధాన నిందితుడుగా తేలాడు. అయితే ఈ కేసు విచారణలో నాటకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి. పోలీసులను ఆశ్రయించినా... నిందితుడిని అరెస్ట్ చేయకపోవడంతో బాధితురాలు సీఎం యోగి ఆదిత్యానాథ్ ఇంటి ముందు ఆత్మహత్యకు ప్రయత్నించడంతో ఇది హైప్రొఫైల్ కేసుగా గుర్తింపు దక్కించుకుంది. కేసు దర్యాప్తులో ఉండగానే బాధితురాలి తండ్రి సెంగర్ మనుషుల చేతిలో దారుణ హత్యకు గురయ్యాడు. ఆపై ఆమె అనూహ్యంగా ప్రమాదానికి గురికాగా... సురక్షితంగా బయటపడింది. ఆమె ఇద్దరి బంధువులు మాత్రం ప్రమాదంలో మరణించారు. ఈ ప్రమాదం సెంగర్ జరిపించాడనే అభియోగాలు నమోదయ్యాయి. 2018లో ఈ కేసు సీబీఐ చేతికి వెళ్లింది. కేసు విచారణ యూపీ ట్రయల్ కోర్టు నుంచి ఢిల్లీ కోర్టుకు మారింది. 2019 డిసెంబర్‌లో దోషిగా తేలడంతో కోర్టు జీవితఖైదు విధించింది. తాజాగా ఈ కేసులో అనూహ్య పరిణామలు చోటుచేసుకున్నాయి. సెంగర్‌కు పోక్సో చట్టం వర్తించదని చెబుతూ ఢిల్లీ హైకోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. కుల్దీప్ సింగ్ సెంగర్ జైలు శిక్షను సస్పెండు చేయడంపై దేశవ్యాప్తంగా ఆగ్రహావేశాలు ఊపందుకున్నాయి. బాధిత కుటుంబం దేశరాజధానిలో ఆందోళనకు దిగడంతో పరిస్థితి మరింత తీవ్రంగా మారింది. అదే సమయంలో యూపీ ఎన్నికల నేపథ్యంలో సెంగర్ కమ్యూనిటీ ఓట్ల కోసమే ఆయన్ని విడిపించే ప్రయత్నం జరుగుతోందని రాజకీయ విమర్శలు వెల్లువెత్తాయి. ఈ పరిణామాల నడుమ సీబీఐతో పాటు బాధితురాలి తరఫు న్యాయవాదులు సుప్రీం కోర్టులో అప్పీల్ చేశారు.

మరణశిక్ష పడేవరకు పోరాటం: బాధితురాలు

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఉన్నావ్ అత్యాచార కేసులో కుల్దీప్ సింగ్ సెంగర్ జైలు శిక్షను సస్పెండు చేస్తూ ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై సుప్రీంకోర్టు స్టే విధించింది. దీనిపై బాధితురాలు మీడియాతో మాట్లాడుతూ సెంగర్‌కు ఉరిశిక్ష పడేవరకు తన పోరాటం ఆగదని వెల్లడించారు. అప్పుడే తన తండ్రికి, తనకు న్యాయం జరుగుతుందన్నారు. దేశ అత్యున్నత న్యాయస్థానంపై అపార విశ్వాసం ఉందని వ్యాఖ్యానించారు. మరోవైపు.. తన తండ్రికి న్యాయం కావాలని కోరుతూ సెంగర్ కుమార్తె ఇషిత ఎక్స్ వేదికగా బహిరంగ లేఖ విడుదల చేశారు. తన తండ్రి ఎదుర్కొంటోన్న విచారణ కారణంగా తన కుటుంబానికి బెదిరింపులు వస్తున్నాయని పేర్కొన్నారు. ఒక కూతురిగా ఎంతో అలసిపోయానని, ఇంకా చిన్న ఆశ ఏదో మిగిలి ఉందని రాసుకొచ్చారు.

ఇద్దరు తెలుగు యువతుల మృతి

(మొదటిపేజీ తరువాయి)

పడింది. దీంతో వారిద్దరూ మృతిచెందారు. అమెరికా కాలమానం ప్రకారం ఆదివారం సాయంత్రం 4 గంటలకు ఈ ప్రమాదం చోటుచేసుకుంది. యువతుల మృతితో వారి కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది.

విశాఖ పోర్టు డిప్యూటీ చైర్‌పర్సన్‌గా తొలి మహిళా ఐఏఎస్

(మొదటిపేజీ తరువాయి)

స్వీకరించారు. ఏప్రిల్ 3, 1984లో జన్మించిన రోష్ని... ఆంధ్రా విశ్వవిద్యాలయం నుంచి జర్నలిజం, మాస్ కమ్యూనికేషన్స్‌లో మాస్టర్స్‌లో గోల్డ్ మెడల్ సాధించారు. జిల్లా, రాష్ట్ర, కేంద్ర స్థాయిల్లో ఆమెకు విస్తృత పరిపాలనా అనుభవం ఉంది. అసోంలోని జోర్హాట్ జిల్లాకు అదనపు ఉప కమిషనర్‌గా, అదే జిల్లాకు కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్‌గా సేవలందించారు. విశాఖ పోర్టు అథారిటీకి డిప్యూటీ చైర్‌పర్సన్‌గా నియమితులవడానికి ముందు డిప్యుటేషన్‌పై విశాఖ స్పెషల్ ఎకనామిక్ జోన్‌లో జాయింట్ డెవలప్‌మెంట్ కమిషనర్‌గా విధులు నిర్వర్తించారు. 2018లో ప్రజా పరిపాలనలో విశిష్ట సేవలకుగాను ప్రధాని అవార్డు సహా అనేక పురస్కారాలు అందుకున్నారు.

రాజకీయ కోణంలో...
అడ్డగోలుగా జిల్లాల పునర్విభజన

- మంత్రి మండిపల్లి మాటకు విలువేది?
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కూటమి ప్రభుత్వం జిల్లాల పునర్విభజన ప్రక్రియను రాజకీయ కోణంలో ఇష్టానుసారం చేపట్టడం సరికాదని... ఇది ఆయా ప్రాంతాల స్థానిక ప్రజల మనోభావాల్ని కించపర్చడమేనని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య తప్పుబట్టారు. ఈ మేరకు సోమవారం ఈశ్వరయ్య ఓ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలోని అనేక జిల్లాలను పునర్విభజన గావిస్తూ కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ ప్రక్రియలో కొన్ని జిల్లాలకు సంబంధించి రాజకీయ దురుద్దేశం కన్పిస్తోంది. మదనపల్లె జిల్లా కేంద్రంగా అన్నమయ్య జిల్లా ఏర్పాటు, రాజంపేటను కడప జిల్లాకు, రైల్వే కోడూరును తిరుపతి జిల్లాకు, గూడూరును తిరుపతి జిల్లా నుంచి నెల్లూరులో కలుపుతూ మంత్రివర్గం నిర్ణయించింది. దీనిపై ఈశ్వరయ్య స్పందిస్తూ... కేవలం సీఎం చంద్రబాబు, ఆయన తనయుడు మంత్రి నారా లోకేశ్ ఇద్దరూ కలిసి రాజకీయ కోణంలోనే ఆయా జిల్లాలను ముక్కలుగా చేసి పునర్విభజించినట్లు స్పష్టమవుతోందని పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల ప్రజలు, విద్యార్థి, యువజన సంఘాలు, వర్తక, వాణిజ్య వర్గాల నుంచి అనేక అభ్యంతరాలు ప్రభుత్వానికి వచ్చినప్పటికీ ఖాతరు చేయలేదు. వాటిని పట్టించుకోకుండా ఏకపక్షంగా జిల్లాల పేర్లు మార్చడం, అటూ, ఇటూ సర్దుబాటు చేయడం సరికాదు. దీనిపై సాక్షాత్తూ కేబినెట్ మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి పదేపదే సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోవడంతో మంత్రి ఆవేదనకు గురై సమావేశంలో కన్నీళ్లు పెట్టుకున్న సంఘటన దురదృష్టకరం. దీనినిబట్టి మంత్రులు కేవలం అలంకారప్రాయమనేది స్పష్టమవుతోంది. సాంస్కృతికంగా, చారిత్రకంగా మదనపల్లికి ఒక చరిత్ర ఉండడంతోపాటు విద్యాపరంగా మంచి గుర్తింపు ఉంది. అక్కడి నుంచి దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో అనేక మంది పాల్గొన్నారు. మదనపల్లి పట్టణానికి ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన తత్వవేత్త జిడ్డు కృష్ణమూర్తి, ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు, విద్యావేత్త, మానవతావాది అనీబిసెంట్‌లతో ఎంతో అనుబంధం ఉంది. ఇలాంటి మదనపల్లెకి ఉన్న చారిత్రక పేరును తొలగించరాదు. మరోవైపు పదకవితా పితామహుడు అన్నమయ్య కు రాజంపేటకు అవినాభావ సంబంధం ఉంది. అలాంటి ప్రాంతంలో అన్నమయ్య జిల్లా కేంద్రంగా మదనపల్లెను మార్చడం అర్థరహితమే. దీన్నిబట్టి చూస్తే ఎంతో భక్తి శ్రద్ధలతో కవితలు రాసిన అన్నమయ్యను, ఆయన భక్తిని కూటమి ప్రభుత్వం అవమానించడమే. అద్దంకి నియోజకవర్గాన్ని బాపట్ల నుంచి ప్రకాశం జిల్లాకు, రాజంపేటను కడప జిల్లాలోకి, రైల్వేకోడూరును తిరుపతి జిల్లాలోకి ఇష్టానుసారంగా మార్చారు. స్థానిక ప్రజల మనోభావాలను ఏ మాత్రం ఖాతరు చేయకుండా ఇష్టానుసారంగా అన్నమయ్య, కడప, తిరుపతి జిల్లాలను పునర్విభజన చేయడం తగదు. ఇప్పటికైనా ఆయా ప్రాంతాల్లో కొనసాగుతున్న నిరసనలు, ఉద్యమాలను దృష్టిలో ఉంచుకుని కూటమి ప్రభుత్వం జిల్లాల పునర్విభజనపై పున:పరిశీలన చేయాలని సీపీఐ తరఫున డిమాండ్ చేస్తున్నామని ఈశ్వరయ్య పేర్కొన్నారు.

'ఉపాధి' కి ఇబ్బందులే!

(మొదటిపేజీ తరువాయి)

వ్యతిరేకించలేదని, పాత చట్టం కింద అనేక రాష్ట్రాల్లో నమోదు కేవలం 50 శాతంగా మాత్రమే ఉందని అనేక మంది ఆందోళన వ్యక్తం చేశారని ఆ వర్గాలు వెల్లడించాయి. సోమవారం జరిగిన పార్లమెంటరీ ప్యానెల్ సమావేశంలో కొత్త వ్యవస్థ, దాని స్వరూపం ఎలా ఉంటుందనే దానిపై కూడా చర్చించారు. ఎంజీఎన్ఆర్ఈజీఏ లో కొన్ని లోపాలు ఉన్నాయని, వాటిపై కమిటీ గతంలో కొన్ని సిఫార్సులు చేసిందని కొంతమంది ప్రతిపక్ష సభ్యులు అంగీకరించారు. పని దినాల సంఖ్యను 100 నుంచి 150కి పెంచాలని తాము గతంలో సూచించామని కొంతమంది ప్రతిపక్ష సభ్యులు చెప్పారని ఆ వర్గాలు వివరించాయి. వీబీ-జీ రామ్ చట్టానికి నిబంధనలు రూపొందించేటప్పుడు కమిటీ గతంలో చేసిన సిఫార్సులను పరిగణనలోకి తీసుకోవాలని కూడా వారు డిమాండ్ చేశారు. అయితే గ్రామాల ప్రస్తుత సమస్యలను, గ్రామీణ ప్రాంతాలలో మౌలిక సదుపాయాల అభివృద్ధిని ప్రస్తుత చట్టం పరిష్కరించలేకపోవడం వల్ల కొత్త చట్టం అవసరం అయిందని బీజేపీ ఎంపీలు సమర్థించుకునే ప్రయత్నం చేశారు. లక్ష్యాలు నెరవేరని కారణంగానే ప్రభుత్వం గ్రామీణ ఉపాధి కల్పన, గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధి అనే రెండు లక్ష్యాలతో వీబీ-జీ రామ్ తీసుకురావడం జరిగిందని అభిప్రాయపడ్డారని ఆ వర్గాలు తెలిపాయి. అనేక రాష్ట్రాలలో అక్కడి ప్రభుత్వాలు ఎంజీఎన్ఆర్ఈజీఏ నిధులలో 50 శాతాన్ని కూడా వినియోగించుకోలేకపోయిన సందర్భాలు ఉన్నాయని బీజేపీ సభ్యులు లేవనెత్తారు.

బడ్జెట్ సమావేశాల్లోనూ చర్చించాల్సి ఉంది: ప్యానెల్ చైర్మన్ సప్తగిరి ఉలక

ప్యానెల్ చైర్మన్, కాంగ్రెస్ నాయకుడు సప్తగిరి ఉలక మాట్లాడుతూ సభ్యులు ఎంజీఎన్ఆర్ఈజీఏకు సంబంధించిన వివిధ అంశాలపై సమగ్రంగా చర్చించారని ప్యానెల్ చైర్మన్ సప్తగిరి ఉలక పేర్కొన్నారు. నిబంధనలు రూపొందించిన తర్వాతే కొత్త చట్టం అమలు చేయబడుతుంది కనుక రాబోయే ఆరు నెలల్లో ఎలా ముందుకు వెళ్లాలనే దానిపై చర్చించారని తెలిపారు. బడ్జెట్ సమావేశాల్లో కూడా ఎంజీఎన్ఆర్ఈజీఏపై చర్చించాలని సభ్యులు భావిస్తున్నారని, వీటన్నింటి కోసం గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ నుంచి ఒక సమావేశం జరిగిందని చెప్పారు. 'మేము మంచి చర్చ జరిపాం. కొత్త చట్టం ఆమోదం పొందింది. కానీ కొత్త నిబంధనలు జారీ చేయాల్సి ఉంది. అన్ని రాష్ట్రాలు కూడా దీనికి అంగీకరించాల్సి ఉంటుంది. వీబీ-జీ రామ్ జీ చట్ట రూపంలోకి సజావుగా మారడం ఎలా అనే దానిపైనే నేటి సమావేశం జరిగింది. కొంతమంది సభ్యులు కొన్ని సూచనలు కూడా ఇచ్చారు. మేము ఒక నివేదికను ఇస్తాము. అప్పుడు మీ ముందు అంతా స్పష్టమవుతుంది' అని సమావేశం తర్వాత ఆయన విలేకరులతో అన్నారు. కాగా ప్యానెల్ సమావేశంలో గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ కార్యదర్శి ఎంజీఎన్ఆర్ఈజీఏపై ఒక ప్రజెంటేషన్ ఇచ్చారు. దీని ప్రకారం... ఢిల్లీ, చండీగఢ్ మినహా ఎంజీఎన్ఆర్ఈజీఏ 741 జిల్లాల్లో అమలు జరుగుతుంది. దీని కింద 2.69 లక్షల గ్రామ పంచాయతీలు, 12.15 కోట్ల క్రియాశీల కార్మికులు ఉన్నారు. వీరిలో మహిళలు 57 శాతం, ఎస్సీ, ఎస్టీ కార్మికులు 36 శాతం ఉన్నారు. 4.81 లక్షల మంది దివ్యాంగులకు కూడా ఉపాధి కల్పించబడింది. ప్రస్తుతం ఈ పథకం క్రింద 15 కోట్లకు పైగా కుటుంబాలు, 26 కోట్ల మంది లబ్ధిదారులు ఉన్నారని ఆ వర్గాలు తెలిపాయి.

పాలమూరును పండబెట్టారు

(మొదటిపేజీ తరువాయి)

కేటాయింపుల కోసం కేంద్రాన్ని కోరిందన్నారు. అయినప్పటికీ పాలమూరు ప్రాజెక్టును రేవంత్ రెడ్డి కావాలనే పండబెట్టాడని ఆరోపించారు. ప్రాజెక్టు పూర్తయితే కేసీఆర్‌కు పేరు వస్తుందన్న భయంతోనే, తన పాత బాస్ చంద్రబాబు నాయుడికి కోపం వస్తుందన్న ఉద్దేశంతో రేవంత్ రెడ్డి ఈ ప్రాజెక్టును అడ్డుకుంటున్నాడని కేటీఆర్ విమర్శించారు. రేవంత్ రెడ్డి అవినీతి, అక్రమాలు బయటపడుతున్నాయనే కారణంతోనే ఆయన బూతులు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. తనపై వ్యాఖ్యలు చేస్తే తాను స్పందించనని, కానీ తన తండ్రి కేసీఆర్‌పై మాట్లాడితే మాత్రం ఊరుకునేది లేదని హెచ్చరించారు. నీళ్ల గురించి ప్రశ్నిస్తే నికృష్టమైన మాటలు మాట్లాడుతున్నారని అన్నారు. మీడియా ముందు కేసీఆర్ లేవనెత్తిన ప్రశ్నలకు కాంగ్రెస్ సమాధానం చెప్పలేక బూతులు మాట్లాడుతున్నదని అన్నారు. అలాంటప్పుడు కేసీఆర్‌ను అసెంబ్లీకి రావాలని డిమాండ్ చేయడం హాస్యాస్పదమన్నారు. ముఖ్యమంత్రి... కృష్ణానది ఏ బేసిన్‌లో ... ఎక్కడ ఉందో కూడా అడిగిన పరిస్థితి ఉందని ఎద్దేవా చేశారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును అడ్డుకున్న వ్యక్తే ఈరోజు నీటిపారుదల శాఖ సలహాదారుడిగా ఉన్నారని అన్నారు. ఇలాంటి వారు నీటిపారుదల శాఖపై చర్చ కోరుతున్నారని, అసలు దేనిపై ఎందుకు చర్చ పెడుతున్నారో కూడా తెలియదన్నారు. నీటిపారుదలపై కనీస అవగాహన లేని వారు కేసీఆర్‌ను చర్చకు రావాలని అంటున్నారని విమర్శించారు. కౌశిక్ రెడ్డి సభలో ... మేడిగడ్డను ఎవరో బాంబులు పెట్టి పేల్చారని స్పష్టంగా చెప్పారని గుర్తు చేశారు. సబ్జెక్ట్ లేనప్పుడు సభను ఎక్కువ రోజులు నడపలేరని వ్యాఖ్యానించారు. చెక్ డ్యాం పేల్చివేత కేసులో రాఘవ కన్‌స్ట్రక్షన్ కంపెనీ ఉన్నదని, మేడిగడ్డ పేల్చారని ఇంజినీర్లు ఆనాడే ఫిర్యాదు చేశారని చెప్పారు. అయినా ఎందుకు విచారణ చేపట్టడం లేదని ప్రశ్నించారు. జీహెచ్ఎంసీని మూడు భాగాలుగా విభజిస్తారన్న ప్రచారం జరుగుతోందని, ఫోర్త్ సిటీని కూడా కార్పొరేషన్ చేస్తారేమోనని అన్నారు. జీహెచ్ఎంసీలో కాంగ్రెస్, ఎంఐఎం ఏం చేసుకుంటారో, ఎవరికీ లాభం చేకూర్చేలా చేసుకుంటారో వారి ఇష్టమని వ్యాఖ్యానించారు. ప్రతిపక్ష నాయకుల ఫోన్లు ట్యాప్ చేయడం లేదని ముఖ్యమంత్రి చెప్పగలరా అని ప్రశ్నించారు. ట్యాపింగ్ నిజం కాకపోతే అధికారులు ఎందుకు ప్రెస్‌మీట్ పెట్టడం లేదని నిలదీశారు. ప్రస్తుత డీజీపీ కూడా నిఘా వ్యవస్థ గురించి పూర్తి అవగాహన ఉందని తెలిపారు. నిఘా వ్యవస్థ ఎలా పనిచేస్తుందో అధికారులు ముఖ్యమంత్రికి వివరించరని, ఉన్న నిబంధనల మేరకు సమాచారం ఎలా వస్తుందో ముఖ్యమంత్రి అడగరని చెప్పారు. ఎస్ఐటీ వంటి డ్రామాలతో ప్రజల దృష్టిని ఎంతకాలం మళ్లిస్తారని ప్రశ్నించారు. ఎస్ఐటీలు, విచారణలు, కేసుల పేరుతో సాధించింది ఏమిటని అన్నారు. కాంగ్రెస్‌కు పరిపాలన రాదని సర్పంచ్ ఎన్నికల్లో ప్రజలు తేల్చిచెప్పారని, కాంగ్రెస్ అప్పుల ప్రచారాన్ని కూడా ప్రజలు నమ్మడం లేదన్నారు. 24 నెలల పాలనలో చేసిన రూ. రెండున్నర లక్షల కోట్ల అప్పుతో కాంగ్రెస్ ప్రభుత్వం ఏమి చేసిందని ప్రశ్నించారు. కేసీఆర్ అంటే గౌరవం ఉంటే చాలని, తెలంగాణ తెచ్చిన నాయకుడిగా ఆయనపై తెలంగాణలో ఉన్న ప్రతి ఒక్కరికీ గౌరవం ఉంటుందని చెప్పారు. ముఖ్యమంత్రి హోదాలో శాసన సభలో కేసీఆర్‌ను కలిసేంత సంస్కారం ఉంటే చాలని వ్యాఖ్యానించారు. ఇదే సంస్కారం బయట మాటల్లో కూడా ఉంటే బాగుంటుందని అన్నారు. గడ్డం పెంచిన ప్రతి ఒక్కరూ గబ్బర్ సింగ్ కాదని కేటీఆర్ స్పష్టం చేశారు. గడ్డాలు పెంచడం చాలా తేలిక... పాలన చేయడమే కష్టమని వ్యాఖ్యానించారు. తాను ఆంధ్రాలో చదివితే తప్పు అంటారని, కానీ అల్లుడిని మాత్రం ఆంధ్ర నుంచి తెచ్చుకున్నారని ఎద్దేవా చేశారు. సర్పంచ్ ఎన్నికల్లో తమ పార్టీ గొప్ప ఫలితాలు సాధించిందని, రెండేళ్లలోనే కాంగ్రెస్ ప్రభుత్వానికి తీవ్ర వ్యతిరేకత వచ్చిందన్నారు. అడ్డగోలు హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసినందునే కేవలం రెండు సంవత్సరాల్లోనే ప్రజలు కాంగ్రెస్ పట్ల ఆగ్రహంగా ఉన్నారన్నారు.

ఉత్తమ్‌కు రేవంత్ సహవాస దోషం

విశాలాంధ్ర - హైదరాబాద్: మంత్రి ఉత్తమ్.. ఉత్త మాటలు మాట్లాడుతున్నారని, ఆయనకు సీఎం రేవంత్ రెడ్డి గాలి సోకినట్లుందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. ఉత్తమ్‌కు రేవంత్ సహవాస దోషం పట్టుకుందన్నారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పాలమూరు ప్రాజక్టు కోసం నేల మీద పడుకుని పనిచేశానని, ఆరున్నర లక్షల ఎకరాలకు నీళ్లిచ్చామన్నారు. 90 టీఎంసీలను 45 టీఎంసీలకు తగ్గించారా లేదా... ఉత్తమ్ చెప్పాలన్నారు. డీపీఆర్ వాపస్ వచ్చి ఏడాది అయినా... మౌనం ఎందుకు వహిస్తున్నారని నిలదీశారు. పాలమూరు ద్రోహులు కాంగ్రెస్ నేతలని, గ్రీన్ ట్రిబ్యునల్‌లో కోర్టులో కేసు వేసి అడ్డుకున్న ద్రోహి ఉత్తమ్ అంటూ ధ్వజమెత్తారు. రెండు టన్నెల్స్ బీఆర్ఎస్ హయాంలోనే పూర్తి అయ్యాయని, ఉత్తమ్ ... తన చేతకాని తనాన్ని మాపై రుద్దుతున్నారని మండిపడ్డారు. కొడంగల్ నారాయణపేట లిఫ్ట్ కు రెండేళ్ల క్రితం కొబ్బరికాయ కొట్టి డీపీఆర్ ఎందుకు పంపలేదని అడిగారు. ఎస్ఎల్బీసీపై బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.1,900కోట్లు ఖర్చు పెట్టిందని, ఏడు ప్రాజెక్టులకు ఢిల్లీ నుంచి అనుమతులు తెచ్చామన్నారు. కాంగ్రెస్ హయాంలో మూడు డీపీఆర్ లు తిరిగి వచ్చాయని, రెండేళ్లల్లో ఉత్తమ్ ఒక్క అనుమతి కూడా తేలేదన్నారు

మాటల యుద్ధం

(మొదటిపేజీ తరువాయి)

పెట్టుకున్నారని చెప్పారు. ఓల్డ్ పెన్షన్ స్కీమ్ అమలు చేస్తామని చెప్పి రెండేళ్లు దాటినా అతీగతీ లేదని, సీపీఎస్ కింద ప్రభుత్వం కట్టాల్సిన కంట్రిబ్యూషన్ డబ్బులను రెండేళ్ల నుంచి దారి మళ్లిస్తున్నారని ధ్వజమెత్తారు. పోలీస్ శాఖలో టీఏ, డీఏలు, స్టేషన్ అలవెన్సులు రావడం లేదన్నారు. లక్ష మంది పోలీసులు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. పోలీసులకు ఆరోగ్య భద్రత స్కీంను బంద్ చేసి, కేవలం రూ.లక్షకే పరిమితం చేశారని దుయ్యబట్టారు. కానిస్టేబుళ్లు చాలా ఇబ్బంది పడుతున్నారని, ఆరోగ్య భద్రత పథకాన్ని పునరుద్ధరించి కార్పొరేట్ హాస్పిటల్స్‌లో వైద్యం అందేలా చూడాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో తక్షణమే పీఆర్సీ ఇస్తామని, పెండింగ్ డీఏలు, బకాయిలు ఇస్తామని, ఓపీఎస్ తెస్తామని మాట ఇచ్చారని, కానీ రెండేళ్లయినా అమలు చేయకుండా ఉద్యోగులను మోసం చేస్తున్నారన్నారు. తక్షణమే హామీ ప్రకారం బకాయిలు విడుదల చేయాలని ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్కని కోరారు.

2వ తేదీకి ఉభయసభలు వాయిదా

తొలిరోజు సమావేశాల అనంతరం ఉభయ సభలు జనవరి రెండో తేదీకి వాయిదా పడ్డాయి. ఈ నెల 30న వైకుంఠ ఏకాదశి, 31న ఏడాది ఆఖరు, జనవరి ఒకటి నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో మూడు రోజుల పాటు సభకు విరామం ప్రకటించారు. తొలుత శాసనసభ ప్రారంభం కాగానే మాజీ ఎమ్మెల్యేలు దివంగత రాంరెడ్డి దామోదర్ రెడ్డి, కొండా లక్ష్మారెడ్డిలకు సభ సంతాపం తెలిపింది.

సింగరేణి సంస్థను కాపాడుకోవాలి

(మొదటిపేజీ తరువాయి)

ఉల్లంఘిస్తున్నారని కూనంనేని తెలిపారు. సింగరేణికి జెన్‌కో సంస్థ దాదాపు రూ.43 వేల కోట్ల బకాయిలు ఉందని, దీనిని పరిష్కరించే విధంగా చూడాలన్నారు. సింగరేణిలో రాజకీయ జోక్యం తరచూ ఎక్కువ అవుతుందనే విమర్శ కార్మికుల నుంచి వ్యక్తమవుతుందని తెలిపారు. ఈ అంశాలను నోటు ద్వారా అందజేస్తానని, దానిపై ప్రభుత్వం సీరియస్‌గా ఆలోచన చేసి... సమస్య పరిష్కరిస్తే మనకున్న ఏకైక ప్రభుత్వ రంగ సంస్థను కాపాడుకోవచ్చని కూనంనేని సాంబశివరావు అన్నారు.

అందుబాటులో యూరియా

(మొదటిపేజీ తరువాయి)

మూడు నాలుగు కౌంటర్లు ఏర్పాటు చేయాలని అన్నారు. వ్యవసాయశాఖ సెక్రటరీ సురేంద్ర మోహన్, వ్యవసాయశాఖ డైరెక్టర్ గోపి, మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి, మార్క్ ఫెడ్ ఎండీ శ్రీనివాస్ రెడ్డి, కోఆపరేటీవ్ అడిషనల్ రిజిస్ట్రార్ చంద్రమోహన్ రెడ్డి పాల్గొన్నారు.

అర్ధరాత్రి వరకు మద్యం విక్రయాలు

విశాలాంధ్ర-సచివాలయం: నూతన సంవత్సరం వేడుకల సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా మద్యం విక్రయాలు, రెస్టారెంట్ సమయాలను పొడిగించేందుకు ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి అనుమతి మంజూరు చేశారు. ఈ మేరకు ఎక్సైజ్, ప్రొహి బిషన్ డైరెక్టర్ సమర్పించిన నివేది కను అనుసరించి నిర్ణయం తీసుకు న్నారు. ఈ ప్రత్యేక అనుమతులను అనుసరించి ఏ4 మద్యం దుకాణాలు డిసెంబర్ 31, 2025, జనవరి 1, 2026 రాత్రుల్లో అర్ధరాత్రి 12.00 గంటల వరకు మద్యం విక్రయించవచ్చు. అలాగే 2బి (బార్లు), సి 1 (ఇన్-హౌస్), ఈపీఐ(ఈవెంట్ పర్మిట్), టీడీ1 (ఇన్-హౌస్) లైసెన్సులు కలిగిన ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సంస్థలు అర్ధరాత్రి ఒంటి గంట వరకు మద్యం విక్రయించడానికి, రెస్టారెంట్ సర్వీస్ లకు అనుమతి పొందాయి. గత ఏడాది నూతన సంవత్సరం సందర్భంగా అమలులో ఉన్న విధానానికి అనుగుణంగా ఈ సడలింపు ఇచ్చారని ప్రభుత్వం తెలిపింది.

విరాళాల నివేదికలు గడువులోపే సమర్పించాలి

(మొదటిపేజీ తరువాయి)

వార్షిక ఖాతాలు, ఎన్నికల ఖర్చుల ప్రకటనలను ఆయా పార్టీలు సీఈఓ కార్యాలయానికి సమయానికి సమర్పించాల్సి ఉంటుందని సూచించారు. గడువు దాటిన తర్వాత వచ్చే పత్రాలను ఎట్టి పరిస్థితుల్లోనూ స్వీకరించబోమని పునరుద్ఘాటించారు. 1951లోని సెక్షన్ 29సీ(3)... ఎన్నికల నిర్వహణ నియమాలు, 1961లోని రూల్ 85బీ ప్రకారం గడువు దాటిన సమర్పణలు చట్ట ఉల్లంఘనగా పరిగణించబడతాయని పేర్కొన్నారు. రాజకీయ నిధుల వ్యవహారంలో పారదర్శకత, బాధ్యతను పెంచడమే లక్ష్యమని సీఈఓ తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక కొరత లేదు: కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో నిర్మల్ జిల్లా : జిల్లాలో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి సంబంధించి ఇసుక, ఇటుక, ఇతర ముడి సామగ్రి కొరత లేదని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ సోమవారం స్పష్టం చేశారు. ఇండ్ల నిర్మాణానికి అవసరమైన సామగ్రి తగినంత నిల్వ ఉందని, ఈ విషయంలో లబ్ధిదారులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆమె ఒక ప్రకటనలో తెలిపారు.ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి వినియోగించే ఇసుక, ఇటుకల విషయంలో ఎవరైనా ఉద్దేశపూర్వకంగా కృత్రిమ కొరత సృష్టించినా, అక్రమాలకు పాల్పడినా వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. లబ్ధిదారులు ఇసుక, ఇటుక కొరతకు సంబంధించి వస్తున్న తప్పుడు వార్తలను నమ్మవద్దని సూచించారు. ఎటువంటి సందేహాలకు తావు లేకుండా తమ ఇండ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేసుకోవాలని కలెక్టర్ లబ్ధిదారులను కోరారు.

యూరియాపై రైతులు ఆందోళన చెందవద్దు:లి

జిల్లాలో యూరియా కొరత ఏమాత్రం లేదని, రైతులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ స్పష్టం చేశారు. యూరియా నిల్వలు, సరఫరా తీరుపై అధికారులతో సమీక్షించిన అనంతరం సోమవారం కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ప్రస్తుతం రైతుల అవసరాలకు అనుగుణంగా 8 వేల మెట్రిక్ టన్నుల (MT) యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కొందరు వ్యాపారులు, దళారులు కృత్రిమ కొరత సృష్టించి, అధిక ధరలకు విక్రయిస్తూ రైతులను భయాందోళనకు గురిచేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని కలెక్టర్ తెలిపారు. ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై, బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. ఎక్కడైనా కృత్రిమ కొరత సృష్టించినా లేదా అధిక ధరలకు విక్రయించినా వెంటనే వ్యవసాయ శాఖ అధికారులకు లేదా కలెక్టరేట్ కార్యాలయానికి ఫిర్యాదు చేయాలని కలెక్టర్ ఆ ప్రకటనలో కోరారు.

ప్రజావాణి దరఖాస్తులు పరిష్కరించాలి

విశాలాంధ్ర జిల్లా బ్యూరో మహబూబాబాద్ : ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి తమ పరిధిలో ఉంటే సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో అన్నారు. సోమవారం రెవెన్యూ అదనపు కలెక్టర్ కె.అనిల్ కుమార్, అన్ని విభాగాల జిల్లా అధికారులతో కలిసి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా వివిధ సమస్యల పరిష్కారం నిమిత్తం ప్రజలు చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి తమ పరిధిలో ఉంటే వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో సంబంధిత విభాగాలకు పంపి చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. వివిధ విభాగాలకు చెందిన మొత్తం (86) ప్రజావాణి దరఖాస్తులు వచ్చాయన్నారు.ఈ ప్రజావాణి కార్యక్రమంలో జెడ్పి సీఈవో పురుషోత్తం, జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ కిరణ్ కుమార్, సహకార శాఖ అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి జి.మరియన్న,ఎస్సీ, ఎస్టీ, బీసీ,మైనారిటీ సంక్షేమ శాఖ అధికారులు, దేశి రామ్ నాయక్, శ్రీనివాసరావు, శ్రీనివాస్, డిపిఓ హరిప్రసాద్, ఎల్డిఎం యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

సమ్మక్క సారలమ్మ జాతరకు ప్రభుత్వం సహకరిలించాలి

విశాలాంధ్ర గూడూరు:గూడూరు మండలంలోని జగన్నాయకుల గూడెం శివారు వట్టివాగు శ్రీ సమ్మక్క సారాలమ్మల జాతరకు ప్రభుత్వం సంహకరించాలని ఆదివాసీ పూజారుల సంఘ అధ్యక్షులు ధారం సిద్దు తెలిపారు.ఎన్నో సంవత్సరాలుగా ఆనాది వస్తున్న ఆచార సంప్రదాయాలు ఆదివాసుల నృత్యాలు పగిడిద్దరాజు, గోవిందరాజు, నాగులమ్మ, జంపన్న వనదేవతలను గద్దెపైకి తీసుకువస్తూ జాతర చిన్న చిన్నగా అభివృద్ధి చేసి నేటికీ ఎన్నో సంవత్సరాలు గడుస్తున్నాయి. కాలం మారిన ప్రభుత్వాలు మారిన వట్టివాగు జాతర పరిస్థితి ఏమాత్రం మారలేదు.ఈ ప్రభుత్వాలు ఆదుకోలేదని ఆదివాసులే తమ వంతు చందాలు వేసుకొని ఆదివాసి జన జాతరను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు.జాతరకు వచ్చే భక్తులకు త్రాగడానికి నీటి సదుపాయాన్ని, అమ్మవారి దేవస్థానం ఎంట్రీ గేట్‌ను దాతలుగా ముందుకు వచ్చిన మహబూబాబాద్ టౌన్ ఎస్ఐ జితేందర్, తెలంగాణ టూరిజం వైస్ ప్రెసిడెంట్ కృష్ణ ప్రసాద్ తమ సొంత డబ్బులతో 70 వేల రూపాయలతో వేచించి కట్టించడం జరిగింది. వారి ఇరువురికి అధ్యక్షులు సిద్దు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. జనవరి 28 న సారలమ్మ పగిడిద్దరాజు గోవిందరాజు నాగులమ్మ జంపన్నలను, జనవరి 29 న సమ్మక్క లను గద్దె పైకి తీసుకువచ్చుట, జనవరి 31న తిరిగి వనదేవతలు వన ప్రవేశం చేయడం జరుగుతుందని తెలుపుతూ ఇంకా జాతరకు సహకరించే వారు జన జాతరకు సహాయ సహకారాలు అందించవలసిందిగా పూజల సంఘం అధ్యక్షులు దారం సిద్దు తెలిపారు.

లైఫ్ సర్టిఫికేట్లు అందజేయాలి

విశాలాంధ్ర ప్రతినిధి–పెద్దపల్లి,సింగరేణి: నవంబర్ నెల్లో రిటైర్డ్ కార్మికులు పెన్షన్ రినీవల్ కోసం లైఫ్ సర్టిఫికేట్ సమర్పించాల్సి ఉండగా సింగరేణి వ్యాప్తంగా దాదాపు 11,000 మంది సమర్పించలేదని జనవరి మొదటి వారంలోగా సమర్పించాలని సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆళవందార్ వేణు మాధవ్ సోమవారం ఒకప్రకటనలో తెలిపారు. సమర్పించని వారికి ఫిబ్రవరి నుంచి పెన్షన్ నిలుపుదల చేస్తామని సిఎంపిఎఫ్ అధికారులు తెలిపినట్లు ఆయన వివరించారు. ప్రతి సంవత్సరం చాలామంది ఆలస్యం చేసి సిఎంపిఎఫ్ కార్యాలయం అధికారులను కలుస్తూ కష్టపడుతున్నారని,ఈ సారి అలాంటి పరిస్థితి తచెచ్చుకోవద్దని ఆయన కోరారు. పెన్షన్ ఆగకుండా ఉండేందుకు తమ డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ లను మొబైల్ యాప్ ద్వారా,సీఎంపిఎఫ్ ఆఫీసులలో, లేదా ఇంటర్ నెట్ కేంద్రాల ద్వారా సమర్పించాలని పేర్కొన్నారు.

ట్రైనింగ్‌కు బయలుదేరిన జిల్లా యువత

విశాలాంధ్ర – కొత్తగూడెం అర్బన్ : జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచనలు ప్రోత్సాహంతో 100% ఉద్యోగ ప్లేస్మెంట్ నేపథ్యంలో శిక్షణ కోసం జిల్లా యువత 26 హైదరాబాద్‌కు బయలుదేరారు. జిల్లాలో యువతీ, యువకులకు నైపుణ్య శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ఈ శిక్షణ నిర్వహించనున్నారు. లాజిస్టిక్స్ స్కిల్ కౌన్సిల్, రీడింగ్టన్ ఫౌండేషన్ సంస్థల సహకారంతో స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ అండ్ వంద శాతం ప్లేస్ మెంట్ సపోర్ట్ ప్రోగ్రాంకు సెలెక్ట్ ఐన యువతి యువకుల సోమవారం కలెక్టరేట్ నుండి వారికోసం ప్రత్యేకంగా బస్ ఏర్పాటు చేసి హైదరాబాద్ ట్రైనింగ్స్‌కు పంపించడం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడుతూ జిల్లాలోని పేద కుటుంబాలకు చెందిన యువతకు ఎంపిక చేసి పంపిస్తున్నామన్నారు. ఈ లాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని వేగంగా వృత్తి నైపుణ్యాన్ని సాధించి అభివృద్ధి చెందుతూ ఎక్కువ ఉపాధి అవకాశాలను పొందాలన్నారు. వంద శాతం ఉద్యోగానికి లాజిస్టిక్స్, ఎక్సపోర్ట్ అండ్ ఇంపోర్ట్ రంగాలు మంచి వేదికలన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్నాక ఈ రంగంల్లో ప్రతిఒక్కరు ఉద్యోగం పొందే అవకాశం ఉందన్నారు. ఈ అవకాశాల సద్వినియోగంతో యువత కుటుంబాలు గర్వ పడేలా, జిల్లాకు ఆదర్శవంతంగా ఉండాలని జిల్లా కలెక్టర్ చూచించారు.

సమష్టి కృషితో నేరాల నియంత్రణ : ఎస్పీ

విశాలాంధ్ర బ్యూరో ఖమ్మం : పోలీస్ యంత్రాంగం సమిష్టి కృషితో ఖమ్మం పోలీస్ కమిషనరేట్ పరిధిలో నేరాలు నియంత్రణలో వున్నాయని పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ తెలిపారు. సోమవారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఖమ్మం పోలీస్ కమిషనరేట్ వార్షిక నివేదిక – 2025 ను వెల్లడించారు. సమర్థవంతమైన పోలీసింగ్‌తో ఈ ఏడాది దోపిడీలు, ఇంటి దొంగతనాలు, చైన్ స్నాచింగ్, హత్యలు, హత్యాయత్నాలు వంటి ప్రధాన నేరాలు గణనీయంగా తగ్గాయన్నారు. గత ఏడాదితో పోలిస్తే చోరీ సొత్తు రికవరీ 9 శాతం, నేరాలను ఛేదించడం 11 శాతం పెరిగిందన్నారు. సైబర్ నెరగాళ్లు దోచుకున్న సుమారు 4.5 కోట్ల నగదును భాదితుల అకౌంట్లలోకి తిరిగి జమా అయ్యేలా చేయడంతో పాటు మరో 1.5 కోట్ల రూపాయలు హెూల్డ్ చేశామని తెలిపారు. లోక్ ఆధాలత్ ద్వారా 36,709 కేసుల పరిష్కారం లభించిందన్నారు. ఈ ఏడాది జరిగిన 928 రోడ్డు ప్రమాదాలలో 332 మంది మృతి చెందారని, మరో 809 మంది గాయపడ్డారని తెలిపారు. గంజాయి సరఫరా కట్టడి చేశామన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో నేరాల నియంత్రణకు విజుబుల్ పోలీసింగ్ విధానాన్ని అమలు చేస్తున్నామని, నేరాలు జరిగే చోటుకు ఉన్నతాధికారులు పరిశీలనకు వెళ్లడం ద్వారా వాటి పరిష్కారంతో పాటు నేరాల కట్టడికి చర్యలు చేపట్టామన్నారు. సాంకేతిక పరిజ్ఞానం వినియోగంలో అధికారులు, సిబ్బందికి శిక్షణ నిప్పించడం , ఫింగర్ ప్రింట్స్, ఇతర ఆధారాల సేకరణ ద్వారా చోరీ సొత్తును రికవరీ చేయడంలో గణనీయమైన పురోగతిని సాధించామన్నారు. చోరీ కేసుల్లో నిందితులను త్వరగా గుర్తించడం, వారి కదలికలపై నిఘా పెట్టడం, జైలు నుంచి విడుదలైన నేరస్థులపై నిఘా వేయడం ద్వారా ఘటనలను కట్టడి చేశామన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటులో ప్రజల భాగస్వామ్యం ముఖ్యమని, ప్రతి కాలనీలో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజలు ముందుకు రావాలన్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణలో భాగంగా బ్లాక్ స్పాట్ గా గుర్తించిన ప్రదేశాల్లో లోపాలను సరిదిద్ది సిగ్నల్ లైట్లు, బారికేడ్ల వినియోగం, రేడియం స్టిక్కర్లతో సైన్ బోర్డులు, స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో అడిషనల్ డీసీపీలు ప్రసాద్ రావు, రామానుజం, ఏసీపీలు వసుంధర యాదవ్, రమణమూర్తి, తిరుపతిరెడ్డి, మహేష్, సర్వర్, సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులు పరిష్కరించాలి : కలెక్టర్

విశాలాంధ్ర-సూర్యాపేట బ్యూరో : ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులను అధికారులు సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. అధికారులు తప్పనిసరిగా ప్రజావాణికి హాజరుకావాలని, వివిధ శాఖల్లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. అలాగే రాష్ట్రస్థాయి ప్రజావాణి పెండింగ్ దరఖాస్తులను కూడా వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రైవేట్ భవనాల్లో కొనసాగుతున్న ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థల వివరాలు సమర్పించాలని, వాటిని ప్రభుత్వ భవనాలకు తరలించాలని తెలిపారు. జనవరి 1, 2026 నుంచి ప్రైవేట్ భవనాల్లో ఉన్న కార్యాలయాలకు అద్దె చెల్లింపులు నిలిపివేస్తామని హెచ్చరించారు. ఈ ప్రజావాణిలో మొత్తం 54 దరఖాస్తులు వచ్చాయని, వాటిని సంబంధిత శాఖలకు పంపించినట్లు కలెక్టర్ తెలిపారు.

గురుకులాల ప్రవేశ పరీక్ష నోటిఫికేషన్ విడుదల

2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ గురుకులాల్లో 5వ తరగతి ప్రవేశాలు, 6 నుంచి 9వ తరగతి బ్యాక్‌లాగ్ ఖాళీలకు నోటిఫికేషన్ విడుదలైందని కలెక్టర్ తెలిపారు. దరఖాస్తుల చివరి తేదీ జనవరి 21, 2026 కాగా, పరీక్ష ఫిబ్రవరి 22, 2026న నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కే. సీతారామారావు, ఆర్డీఓ వేణు మాధవ్ తదితర అధికారులు పాల్గొన్నారు.

సీపీఐ శతాబ్ది ఉత్సవ పోస్టర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర-ఖమ్మం : భారత కమ్యూనిస్టు పార్టీ వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా జనవరి 18న జరిగే శతాబ్ది ఉత్సవ పోస్టర్‌ను సోమవారం స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు మాట్లాడుతూ వందేళ్ల సంబురాన్ని ఖమ్మం జిల్లాలో నిర్వహిస్తున్నామని ఈ సభకు ఐదు లక్షల మందిని సమీకరిస్తున్నట్లు తెలిపారు. దేశం నలు మూలల నుంచి భారత కమ్యూనిస్టు పార్టీకి ప్రాతినిథ్యం వహిస్తూ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరు కానున్నట్లు తెలిపారు. 40 దేశాల నుంచి సౌహార్ద ప్రతినిధులు సైతం హాజరు కానున్నారని ఆయన తెలిపారు. జనవరి 18న ఖమ్మం నగరానికి నలు వైపులా నుంచి ప్రదర్శనలు ప్రారంభమై సాయంత్రం నాలుగు గంటలకు ఎస్ఆర్అండ్బిజిఎన్ఆర్ కళాశాల మైదానంకు చేరుకుంటాయన్నారు. పార్టీ ప్రజా సంఘాలకు ప్రాతినిథ్యం వహిస్తూ ప్రత్యేక ఆకర్షణగా కళాకారులు ప్రదర్శనలో పాల్గొననున్నట్లు హేమంతరావు తెలిపారు. ఈ సందర్భంగా 19 నుంచి 20 వరకు సిపిఐ జాతీయ కౌన్సిల్ సమావేశాలు ఖమ్మంలో నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. శతాబ్ది ఉత్సవాల ముగింపు సందర్భంగా గ్రామ గ్రామానికి పార్టీ సందేశాన్ని చేరవేస్తున్నామని సభలు, సమావేశాల ద్వారా నేటి తరానికి పార్టీ చరిత్రను తెలియజేస్తున్నామని ఆయన తెలిపారు. పార్టీ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు యానాలి సాంబశివరెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు చెరుకుపల్లి భాస్కర్, యాకన్న, ఆరెంపుల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో, మెదక్: అక్రమ ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతామని కలెక్టర్ రాహుల్ రాజ్ హెచ్చరించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో ఇరిగేషన్, పంచాయతీరాజ్ ఆర్ అండ్ బి , ఇంజనీరింగ్, పోలీస్, ఫారెస్ట్, తెలంగాణ స్టేట్ మినరల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ... అధికారులు తప్పనిసరిగా ఇసుక కొనుగోలు నిబంధనలు ఖచ్చితంగా పాటించాలన్నారు. ప్రభుత్వ నిర్మాణాల కోసం అవసరమైన ఇసుకను సాండ్ బజార్లో నిలవ చేస్తాం అన్నారు. ఇప్పటికే నర్సాపురంలో సాండ్ బజార్ ప్రారంభించడం జరిగిందని, మెదక్ లో తొందరలో ప్రారంభించుకోబోతున్నామని ఎక్కడ కూడా ఇసుక అక్రమ రవాణాకు తావు లేకుండా, యంత్రాలు ఉపయోగించి సాండ్ ను రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇసుక అవసరం ఉంటుందో టీజీఎండిసి ద్వారా ద్వారానే కొనుగోలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పి సీఈఓ ఎల్లయ్య, డిఆర్ఓ భుజంగరావు, ఆర్డిఓలు రమాదేవి, మహిపాల్ రెడ్డి, డిఆర్డిఓ శ్రీనివాసరావు, ఈడి మైన్స్ సంజయ్ కుమార్, డీఎస్పీపీ ప్రసన్నకుమార్, ఆర్ఐ లక్ష్మీనారాయణ, మున్సిపల్ కమిషనర్లు, రెవెన్యూ పోలీస్, పోలీస్,అధికారులు పాల్గొన్నారు.

పరిష్కారానికోసం ప్రజావాణి..

ప్రతి సోమవారం జరిగే ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కలెక్టర్ రాహుల్ రాజ్ సూచించారు. కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి పిర్యాదులు స్వీకరించారు.

పెరికవర్గం సంక్షేమాభివృద్ధికి పోరాడుదాం : ముత్తయ్య

విశాలాంధ్ర, కరకగూడెం : అన్ని రంగాల్లో వెనుకబడిన పెరిక కుల ప్రజల సంక్షేమం అభివృద్ధి కోసం ఎవరో వస్తారని ఏదో చేస్తారని ఎదురు చూడకుండా ఐక్యంగా కృషి చేస్తే ఫలితాలు ఉంటాయని రాష్ట్ర పెరిక సంఘం అధ్యక్షులు యర్రంశెట్టి ముత్తయ్య పిలుపునిచ్చారు. జిల్లా పురగిరి క్షత్రియ (పెరిక) సంఘం ముఖ్య కార్యవర్గ సమావేశం సోమవారం జరిగింది. నూతన కమిటీ ఎన్నిక సమావేశం జనవరి 4న పాల్వంచ పెద్దమ్మ తల్లి ఆలయం వద్ద భవానీ ఫంక్షన్ హాల్‌లో జరగనున్నట్లు అందరూ హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన తోపాటు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి రంగారావు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కన్వీనర్ అంకతి ఉమామహేశ్వరరావు , జిల్లా కార్యదర్శి పూజారి వెంకటేశ్వర్లు, రాష్ట్ర నాయకులు తిప్పని శ్రీనివాసరావులు కోరారు. ఈ సందర్భంగా నాయకులు కరకగూడెం మండలంలోని అనంతారం, కరకగూడెం, భట్టుపల్లి గ్రామాలలో పెరిక సంఘం కర పత్రాలను ఆవిష్కరించారు. కుల ఐక్యతగా వున్నపుడే మనకు గుర్తింపు ఉంటుందని సంక్షేమ అభివ ృద్ధి కూడా అప్పుడే జరుగుతుందని నాయకులు తెలిపారు. ఈ సందతరేగా జిల్లాలోని సంఘంలోని 41 గ్రామాల పేద కుటుంబంలోని వారికి 41 కుట్టు మిషన్లు హైద్రాబాద్ సంఘీయులు కానుగంటి శ్రీనివాస్ అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు అంకతి మల్లికార్జున్‌రావు, చిట్టి వెంకటేశ్వర్లు, అత్తె నాగేశ్వరరావు, కొమ్మ ప్రసాద్, అత్తె సత్యం, బాలరాజు, నాగేశ్వరరావు, సారయ్య, కటకం నరసింహారావు, బుడగం రాము, ముద్దం సాంబయ్య, బుస్సీ శ్రీను, యగ్గడి శ్రీరాం, సత్యం తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి : కలెక్టర్

విశాలాంధ్ర ప్రతినిధి – మంచిర్యాల జిల్లా: ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీక ృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో అర్జీదారాల నుండి దరఖాస్తులు స్వీకరించారు. నెన్నెల మండలం మైలారం గ్రామానికి చెందిన దండ నాయకుల విజయలక్ష్మి తన భర్త చనిపోయారని, మరణ ధ్రువీకరణ పత్రం ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. కోటపల్లి మండలం పారుపల్లి గ్రామానికి చెందిన భోగే రాజేశ్వరి తన భర్త మరణించినందున సంబంధిత కుటుంబ సభ్యుల ద ృవపత్రాన్ని ఇప్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. జన్నారం మండలం మురిమడుగు గ్రామానికి చెందిన సంధ్యవేణి నడిపి రాజం తాను కొనుగోలు చేసిన భూమి నిషేధిత జాబితాలో ఉందని, తొలగించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. జిల్లాలోని పోచంపాడు గ్రామస్తులు తమ గ్రామ శివారులోని హద్దుల సమస్యలు, విచారణ చేసి పరిష్క రించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. నస్పూర్ మండల కేంద్రంలోని హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన మంద ఇసయ్య తనను, తన భార్యను ఇంటి నుండి వెళ్లగొట్టిన తన చిన్న కొడుకు, కోడలు వేధింపుల నుండి కాపాడి తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. మంచిర్యాల పట్టణంలోని దొరగారిపల్లె ప్రాంతానికి చెందిన కొడిపే పోశవ్వ తనకు ఒంటరి మహిళ పింఛన్ ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. మందమర్రి మండల కేంద్రానికి చెందిన ఆడెపు రాయమల్లు తన స్వార్జిత ఆస్తిని తన కుమారులకు పంచి ఇచ్చానని, ప్రస్తుతం తన పోషణ పట్టించుకోవడం లేదని, ఈ విషయమై తనకు న్యాయం చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ దరఖాస్తులు క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

క్యాలెండర్ ఆవిష్కరణకే ప్రాధాన్యతా?

పిల్లల చదువులపై ప్రశ్నిస్తున్న తల్లిదండ్రులు

విశాలాంధ్ర బ్యూరో, సంగారెడ్డి : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతోందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం స్కూల్ పని వేళల్లోనే టీచర్లు పాఠశాలలను విడిచి యూనియన్ కార్యక్రమాల పేరుతో జిల్లా కేంద్రానికి చేరుకుని, కలెక్టర్ చేత క్యాలెండర్ ఆవిష్కరణలో పాల్గొనడం తీవ్ర విమర్శలకు దారితీసింది. పిల్లలకు చదువు చెప్పాల్సిన ఉపాధ్యాయులు, క్లాస్‌లను వదిలేసి యూనియన్ కార్యక్రమాల్లో పాల్గొనడం సరైనదేనా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. పిల్లలు స్కూల్‌కు వెళ్లి ఉపాధ్యాయుల కోసం ఎదురు చూస్తుంటే, టీచర్లు మాత్రం యూనియన్ పనుల్లో బిజీగా ఉండటం బాధాకరం అని పలువురు తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇప్పటికే బోధనా లోపాలు, విద్యార్థుల సంఖ్య తగ్గడం వంటి సమస్యలు ఉన్న సమయంలో, ఇలాంటి నిర్లక్ష్య వైఖరి విద్యా వ్యవస్థను మరింత దెబ్బతీస్తోందని విమర్శలు వినిపిస్తున్నాయి. యూనియన్ కార్యక్రమాలు అవసరమే అయినా, అవి పాఠశాల సమయాల్లో కాకుండా సెలవు రోజుల్లో లేదా స్కూల్ అనంతరం నిర్వహించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనని విద్యావేత్తలు అభిప్రాయ పడుతున్నారు. పిల్లల భవిష్యత్తే దేశ భవిష్యత్తు. ఆ భవిష్యత్తుతో ఆటలాడే హక్కు ఎవరికీ లేదు అని పలువురు విద్యాభిమానులు హెచ్చరిస్తున్నారు. ఈ ఘటనపై కలెక్టర్, విద్య ఉన్నతాధికారులు స్పందించి, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజావాణి' దరఖాస్తులు పరిష్కరించాలి : కలెక్టర్

విశాలాంధ్రములుగు జిల్లా బ్యూరో: ప్రజావాణి దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్జీలు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజావాణి నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., అదనపు కలెక్టర్లు రెవెన్యూ సి హెచ్ మహేందర్ జి, స్థానిక సంస్థలు సంపత్ రావు, ఆర్డీవో వెంకటేష్ లతో కలిసి దరఖాస్తులు స్వీకరించారు. కొన్ని దరఖాస్తులను అక్కడికక్కడే పరిష్కరించారు. మొత్తం 59 దరఖాస్తులు వచ్చాయి. భూ సమస్యలు 12, గృహ నిర్మాణశాఖకు 08, పెన్షన్ 09, ఉపాధి కల్పనకు 05, ఇతర ఇతర శాఖలకు సంబంధించినవి 25 దరఖాస్తుల స్వీకరించగా వాటిని వెంటనే సంబంధిత అధికారులకు బదిలీ చేసి పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్ పరిపాలన అధికారి, పర్యవేక్షకులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ కమిషనర్‌కు శుభాకాంక్షలు తెలిపిన జక్కా

విశాలాంధ్ర–బోడుప్పల్ : గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బోడుప్పల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఏ. శైలజని సోమవారం ఉదయం సర్కిల్ కార్యాలయంలో మాజీ మేయర్ జక్కా వెంకట్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పీర్జాదిగూడ, మేడిపల్లి పరిధిలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా సమయం కేటాయించాలని నాయకులు విజ్ఞప్తి చేశారు. దీనిపై డిప్యూటీ కమిషనర్ ఏ. శైలజ సానుకూలంగా స్పందిస్తూ, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు మేడిపల్లి కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఏడవల్లి రఘు వర్ధన్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్లు కొల్తూరి మహేష్, దొంతిరి హరిశంకర్ రెడ్డి, మాధుసూదన్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలు నిర్మల, యూత్ అధ్యక్షులు ప్రభు, నాయకులు మల్లం వెంకటేష్ గౌడ్, యాసారం శ్రీనివాస్, పాశం నరేందర్ రెడ్డి, బుల్లెట్ శంకర్, కోనేటి వెంకట్, అమర్ పటేల్, కిరణ్ నాయక్, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

అర్జీలను త్వరగా పరిష్కరించాలి

విశాలాంధ్ర–వనపర్తి :ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి స్వీకరించిన ఫిర్యాదులు, అర్జీలను వేగంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు యాదయ్య, అదనపు కలెక్టర్ రెవెన్యూ ఖీమ్యా నాయక్, ఆర్డీవో సుబ్రహ్మణ్యంతో కలిసి హాజరై ప్రజల నుంచి అర్జీలు, వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యలకు పరిష్కారం చూపే బాధ్యత అధికారులపై ఉందన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో 30 దరఖాస్తులు వచ్చాయని కలెక్టర్ తెలిపారు. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులు, అర్జీలను పరిశీలించి, సత్వర పరిష్కారం చూపేలా సంబంధితశాఖల జిల్లా స్థాయి అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పెండింగ్‌లోవున్న దరఖాస్తులను పరిశీలించి, వెంటనే పరిష్కరించేలా తగు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. సీఎం, జిల్లా మంత్రి ప్రజావాణి నుంచి వచ్చిన, పెండింగ్ లో ఉన్న అర్జీలను సైతం వారంలో పరిష్కరించాలని అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



దరఖాస్తులు పరిష్కరించాలి: పీవో

విశాలాంధ్ర –ములుగుజిల్లా బ్యూరో : గిరిజన దర్బార్‌లో సమర్పించిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని ఏటూరునాగారం ఐటిడి ఏ ప్రాజెక్టు అధికారి చిత్ర మిశ్రా తెలిపారు. సోమవారం ఐటిడిఏలో గిరిజన దర్బార్ నిర్వహించి,గిరిజనులను దరఖాస్తులు పిఓ స్వయంగా స్వీకరించి,మాట్లాడుతూ దర్బార్లో వచ్చిన దరఖాస్తులకు సత్వరమే పరిష్కరించాలని సంబంధిత సెక్టర్ అధికారులను పిఓ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏపిఓ జనరల్ జె. వసంత రావు,డిప్యూటీ డైరెక్టర్ డి. జనర్దన్, ఏఓయం. రాజ్ కుమార్, ఎస్ఓ. (ఓడి) సురేష్ బాబు, పిసా చట్టం కో ఆర్డినేటర్ కొమురం ప్రభాకర్,ఐటిఐ ప్రిన్సిపాల్ జగన్ మోహన్ రెడ్డి, అనిల్,మహేందర్, తదితరులు, గిరిజనులు పాల్గొన్నారు.

యూరియా కొరత లేకుండా చర్యలు : కలెక్టర్

విశాలాంధ్ర, కొమరం భీం : జిల్లాలో వ్యవసాయ సాగుకు అవసరమైన యూరియా కొరత లేకుండా పూర్తి స్థాయిలో చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025- 26 యాసంగి సీజన్‌లో 50 వేల 216 ఎకరాల సాగు విస్తీర్ణంకు 88 వేల 120 బస్తాలలో 3 వేల 965 మెట్రిక్ టన్నుల యూరియా కావలసి ఉండగా 90 వేల 968 బస్తాలలో 4 వేల 94 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని . జిల్లాలోని డీలర్లు, సహకార సంఘాలు, మార్క్ ఫెడ్ గోదాములలో యూరియా నిల్వ ఉందని, జిల్లాలో సాగుకు అనుగుణంగా ప్రతిరోజు రైతులకు యూరియా పంపిణీ కేంద్రాల ద్వారా అందించడం జరుగుతుందని, ప్రతిరోజు ఉదయం 6 గంటల నుంచి యూరియా పంపిణీ ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. రైతుల సౌకర్యం కోసం విక్రయ కేంద్రాల వద్ద షామియానా, తాగునీటి సౌకర్యాలను కల్పించాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రతి విక్రయ కేంద్రంలో కనీసం 3 కౌంటర్లు ఏర్పాటు చేసే విధంగా అధికారుల సమన్వ యంతో చర్యలు తీసుకుంటున్నామన్నారు.

సంపాదకీయం

సెంగర్‌కు జైలే గతి

ఉన్నావ్ అత్యాచార కేసులో దోషిగా తేలిన బీజేపీ నాయకుడు కుల్దీప్ సెంగర్‌కు ఇక జైలే గతి. ఉన్నావ్‌లో 2017 నాటి అత్యాచార కేసులో జైలులో ఉన్న బీజేపీ మాజీ ఎమ్మెల్యే కుల్దీప్ సింగ్ సెంగర్‌కు విధించిన యావజ్జీవ కారగార శిక్ష నుంచి మినహాయింపు ఇస్తూ దిల్లీ హైకోర్టు జారీ చేసిన ఉత్తర్వును సుప్రీంకోర్టు రద్దు చేసింది. సెంగర్‌ను కాపాడడానికి బీజేపీ ప్రభుత్వం చేసిన అన్ని ప్రయత్నాలూ విఫలం కావడంతో సీబీఐ స్వయంగా దిల్లీ హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ సుప్రీంకోర్టుకు ఎక్కాల్సి వచ్చింది. దిల్లీ హైకోర్టు "ప్రజా సేవకుడు" ఎవరు అన్న నిర్వచనానికి వక్రభాష్యం చెప్పి సెంగర్‌ను కాపాడడంలో బీజేపీకి సహకరించాలని దిల్లీ హైకోర్టు న్యాయమూర్తులు సుబ్రహ్మణ్యం ప్రసాద్, హరీశ్ వైద్యనాథన్ శంకర్‌ను యావజ్జీవ కారాగార శిక్ష నుంచి తప్పించారు. ఇది అన్యాయమైన తీర్పు అని దేశ వ్యాప్తంగా గగ్గోలు మొదలైంది. దేశంలోని వివిధ ప్రాంతాలలో భారీ ఎత్తున నిరసన ప్రదర్శనలు జరిగాయి. దీనితో సీబీఐ దిల్లీ హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టులో వ్యతిరేకించడం మినహా మరో మార్గం లేక పోయింది. దిల్లీ హైకోర్టు తీర్పును వ్యతిరేకిస్తూ సీబీఐతో పాటు కొంతమంది న్యాయవాదులు కూడా సుప్రీంకోర్టును ఆశ్రయించారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, న్యాయమూర్తులు జె.కె.మహేశ్వరి, అగస్టీన్ గార్జ్ మసీహ్‌తో కూడిన బెంచి దిల్లీ హైకోర్టు తీర్పును కొట్టేసింది. దిల్లీ హైకోర్టు తీర్పు ప్రకారం కూడా సెంగర్ వెంటనే జైలు నుంచి విడుదలయ్యే అవకాశం లేదు. ఆయన మీద ఉన్నావ్ బాధితురాలి తండ్రిని హత్య చేసిన కేసు కూడా ఉంది. సుప్రీంకోర్టులో దాఖలైన రెండు పిటిషన్లను విచారించడానికి సుప్రీంకోర్టు అంగీకరించడమే కాక సెంగర్‌ను జైలులోనే ఉంచాలని స్పష్టంగా చెప్పడం విశేషం. న్యాయ వ్యవస్థ ప్రతిష్ట మసకబారుతున్న సమయంలో సుప్రీంకోర్టు తీర్పు కొత్త ఆశలు కల్పిస్తోంది. సెంగర్ ప్రజా సేవకుడు కాదని చెప్పడానికి దిల్లీ హైకోర్టులోని ఇద్దరు న్యాయమూర్తులు ఈ పదాన్ని నిర్వచించడానికి అడ్డదారులు వెతుక్కున్నారు. ప్రజా సేవకులు ఎవరు అన్న విషయంలో పోక్సో చట్టంలో కూడా ప్రత్యేకంగా నిర్వచించకపోవడం ఈ ఇద్దరు న్యాయమూర్తుల తప్పుడు నిర్ణయానికి తోడ్పడింది. ప్రజా సేవకుడు అన్న నిర్వచనాన్ని తమకు అనుకూలంగా మలుచుకోవడానికి ఐ.పి.సి. చట్టంలోని 21 వ సెక్షన్ స్ఫూర్తిని అసలేమాత్రం పరిగణనలోకి తీసుకోలేదు. సోలిసిటర్ జనరల్ సాధారణంగా సుప్రీంకోర్టులో ప్రభుత్వాన్ని సమర్థించవలసి ఉంటుంది. కానీ ఈ కేసులో మాత్రం దిల్లీ హైకోర్టు న్యాయమూర్తుల తీర్పులోని లోపాలను ఎత్తి చూపక తప్పలేదు. సోలిసిటర్ జనరల్ సీబీఐ తరఫున వాదిస్తున్నారు. దిల్లీ హైకోర్టు తీర్పును నిశితంగా పరిశీలిస్తామని సుప్రీంకోర్టు బెంచి హామీ ఇచ్చింది. సెంగర్‌కు అనుకూలంగా దిల్లి హైకోర్టు గత 23 వ తేదీన ఇచ్చిన తీర్పు అమలును సుప్రీంకోర్టు నిలిపి వేసింది. ఈ వ్యవహారంలో నిర్దిష్టమైన అంశాలు ఉన్నట్టు సుప్రీంకోర్టు బెంచి భావించింది. దిల్లీ హైకోర్టు ఉత్తర్వు విచిత్రంగా ఉందని కూడా వ్యాఖ్యానించింది. ఉన్నావ్ బాధితురాలికి అవసరమైతే ఉచిత న్యాయ సహాయం అందించాలని కూడా సుప్రీంకోర్టు ఆదేశించింది. తనకు న్యాయం జరగడానికి సకల ప్రయత్నాలూ చేసే హక్కు బాధితురాలికి ఉందని కూడా సుప్రీంకోర్టు భావించింది. బాధితురాలు కావాలనుకుంటే స్వతంత్రంగా తన న్యాయవాదుల ద్వారా సుప్రీంకోర్టులో అర్జీ పెట్టుకోవచ్చు అని కూడా సుప్రీంకోర్టు బెంచి తెలియజేసింది. మామూలు పరిస్థితిలో అయితే ఎదుటి వ్యక్తి వాదన వినకుండా కింది కోర్టు, హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సుప్రీంకోర్టు నిలిపివేయదు. కానీ ఈ కేసులో సెంగర్ మరో హత్య కేసులో కూడా నిందితుడిగా ఉన్నారు. దిల్లీ హైకోర్టు న్యాయమూర్తులు ఇద్దరూ సెంగర్‌ను రక్షించే ప్రయత్నం చేయడానికి మార్గాలు వెతుక్కున్నారు. 2019 లో కింది కోర్టు సెంగర్‌కు యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. అందువల్ల దిల్లీ హైకోర్టు కరుణించినా సెంగర్ విడుదలయ్యే అవకాశం ఉండేది కాదు.

సెంగర్ విడుదల అవుతారా లేదా అన్న అంశం కన్నా హైకోర్టు సవ్యంగా వ్యవహరించిందా లేదా అన్నది నిశితంగా పరిశీలించవలసిన విషయం. సుప్రీంకోర్టు విచారణా క్రమంలో ప్రజా సేవకులు ఎవరు అన్న విషయంపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది. అప్పుడు దిల్లీ హైకోర్టు ఇద్దరు న్యాయమూర్తులలాగా చట్టాల్లోని అస్పష్టతను, లొసుగులను వినియోగించుకుని నేరాలకు పాల్పడే వారి తరఫున న్యాయస్థానాలు నిలబడే అవకాశం లేకుండా పోతుంది. పోక్సో చట్టం ప్రకారం అత్యాచార కేసుల్లో మామూలు వ్యక్తులకు అత్యధికంగా ఏడేళ్ల శిక్ష పడుతుంది. అదే ఉన్నత స్థానాల్లో ఉన్నవారు, ప్రజా సేవకులు ఇదే అఘాయిత్యానికి పాల్పడితే మరింత ఎక్కువ శిక్ష విధించడానికి అవకాశం ఉంది. అందుకే దిల్లీ హైకోర్టు న్యాయమూర్తులు సెంగర్ అసలు ప్రజా సేవకుడు కాదని చెప్పగలిగారు. ప్రజాసేవకుడు ఎవరు అని నిర్ధారించడంలో అస్పష్టత ఉందని సుప్రీంకోర్టు భావించింది. ఓ పట్వారీ, పోలీసు అధికారి కూడా ప్రజా సేవకుడు నిర్వచనం కిందకు వస్తే ఎమ్మెల్యే ఎలా రాకుండా పోతారు అని ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ వ్యాఖ్యానించారు. ఇలాంటి దృక్కోణాలవల్ల విస్తృతమైన ప్రభావం ఉంటుందని ఆయన అన్నారు. పోక్సో చట్టంలో ప్రజా సేవకుడు అన్న పదాన్ని నిర్వచించక పోయినప్పటికీ సందర్భానుసారం ఈ పదాన్ని చూడాల్సి వస్తుందని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా చెప్పక తప్పలేదు. సెంగర్ ఆధిపత్యం చెలాయించగల స్థితిలో ఉన్నారని, ఆయన శక్తిమంతమైన ఎమ్మెల్యే అని కూడా తుషార్ మెహతా అభిప్రాయపడ్డారు. పైగా సెంగర్ మీద బాధితురాలి తండ్రిని హతమార్చారన్న అంశం కూడా వాస్తవమేనని తేలిపోయింది. పోక్సో చట్టంలో ప్రజా సేవకుడు అన్న పదానికి నిర్వచనం ఉందా లేదా అన్న దానికన్నా అత్యాచారానికి గురైన 15 ఏళ్ల దళిత బాలికకు మనం సమాధానం చెప్పాల్సిందేనని తుషార్ మెహతా అన్నారు. రాజ్యవ్యవస్థకు మూలాధారాలైన చట్టసభలు, కార్యనిర్వాహక వర్గం, రాజ్యవ్యవస్థ నాలుగో స్తంభంలాంటి పత్రికా రంగం కూడా భ్రష్టుపట్టిపోయి ఉన్న పరిస్థితిలో ప్రజలకు న్యాయం చేయాల్సిన వ్యవస్థ న్యాయవ్యవస్థ మాత్రమే. కానీ ఇటీవలి కాలంలో అంటే మోదీ అధికారంలోకి వచ్చిన తరవాత న్యాయవ్యవస్థలో కొంతభాగం స్వతంత్రంగా వ్యవహరించడం, ప్రజల మౌలిక హక్కుల్ని కాపాడడం, రాజ్యాంగాన్ని పరిరక్షించడంలో రాజీపడుతున్న సందర్భాలు చూస్తూనే ఉన్నాం. దీనివల్ల ప్రజలు ఆధారపడే వ్యవస్థే లేని దుస్థితి ఏర్పడుతోంది. ఈ దశలో సుప్రీంకోర్టు నిటారుగా నిలబడుతుందా లేదా అన్నది అసలు ప్రశ్న.

అభివృద్ధి పేరుతో పర్యావరణ దోపిడీ


డా. కె.నారాయణ

ఆరావళి పర్వత శ్రేణి కేవలం భౌగోళిక నిర్మాణం మాత్రమే కాదు. ఇది ఉత్తర భారతదేశ పర్యావరణ సమతుల్యతకు మౌన రక్షకుడు. ఒక బిలియన్ సంవత్సరాల కంటే పురాతనమైన ఈ పర్వత శ్రేణి, ఎడారీకరణను అడ్డుకోవడం, భూగర్భ జలాలను కాపాడటం, పర్యావరణ పతనాన్ని నివారించడం వంటి కీలక పాత్ర పోషిస్తోంది. అయితే నేడు, తవ్వకాల పేరుతో జరుగుతున్న 'అభివృద్ధి' వల్ల ఈ ప్రాచీన సహజ రక్షణ గోడ తీవ్ర ప్రమాదంలో పడింది. ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులో ఆరావళి పర్వత శ్రేణిని ప్రధానంగా ఎత్తు ఆధారంగా నిర్వచించడం తీవ్రమైన పర్యావరణ ఆందోళనలకు దారితీసింది. ఈ పరిమిత నిర్వచనంతో, పర్యావరణ పరంగా అత్యంత కీలకమైన విస్తీర్ణాలు రక్షణ పరిధి నుంచి తప్పిపోవచ్చు. దీని వల్ల గనుల తవ్వకాలు, వాణిజ్య దోపిడీకి తలుపులు తెరుచుకుంటాయి.

జీవం దాని స్వభావం:

నిజానికి ఆరావళి ప్రాధాన్యతను కేవలం ఎత్తుతో కొలవలేం. 100 మీటర్ల కంటే తక్కువ ఎత్తులో ఉన్న ప్రాంతాలు కూడా పర్యావరణ పరిరక్షణ బాధ్యతలను పోషిస్తున్నాయని చెప్పాలి. ఉదాహరణకు, భూగర్భ జలాలను రీచార్జి చేయడంలో వీటి పాత్ర అమోఘం. అలాగే, మట్టి సంరక్షణ, జీవ వైవిధ్య పరిరక్షణ, ఎడారి గాలులు, దుమ్ము తుఫాన్ల నుంచి ఇవన్నీ సహజ అడ్డుగోడగా నిలిచి అత్యంత కీలక పర్యావరణ విధులను నిర్వహిస్తున్నాయి. అందుకే ఆరావళి జీవవంతమైన పర్యావరణ వ్యవస్థగా పర్యావరణవేత్తలు చెపుతుంటారు.

గనుల తవ్వకాలు- తిరిగిరాని నష్టం:

ఆరావళి ప్రాంతంలో ఇప్పటికే జరిగిన గనుల తవ్వకాలు ఈ పర్వతశ్రేణుల హననానికి దారితీశాయి. ముఖ్యంగా ఈ తవ్వకాల వల్ల ప్రాచీన రాతి నిర్మాణాల శాశ్వత విధ్వంసం జరిగింది. ఇది తీరని నష్టం. దాంతోపాటు భూగర్భ జల ప్రవాహాలకు ఎనలేని భంగం వాటిల్లింది. ఇది పైకి కన్పించని నష్టం. ఈ తవ్వకాలతో ఆరావళి వ్యాప్తంగా ఉన్న ఎన్నో అడవుల వినాశనం జరిగిపోయింది. దీన్ని పునరుద్ధరించలేని నష్టంగా పరిగణించవచ్చు. ఇవిగాక, వన్యప్రాణుల నివాసాల అంతరాయం వంటి తీవ్రమైన నష్టాలను కలిగించాయి. ఈ పర్యావరణ వ్యవస్థలు ఒకసారి ధ్వంసమైతే, మానవ జీవిత కాలంలో పునరుద్ధరించడం అసాధ్యం. అయినప్పటికీ, కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం తమ స్వార్థ ప్రయోజనాల కోసం ఈ ఆరావళి పర్వతశ్రేణుల విధ్వంసానికి కుట్రలు పన్నుతోంది.

నీటి భద్రత-ప్రజారోగ్యం:

నీటి భద్రత, ప్రజారోగ్యం సైతం ఈ ఆరావళిపై ఆధారపడి ఉండటం గమనార్హం. ముఖ్యంగా ఆరావళి పర్వత శ్రేణి రాజస్థాన్, హర్యానా, దిల్లీ ఎన్‌సీఆర్ ప్రాంతాల భూగర్భ జలాలకు ప్రధాన ఆధారం. ఈ నేపథ్యంలో ఆరావళి పర్వత శ్రేణి బలహీనపడితే జరగబోయే నష్టాలు కోకొల్లలు. ముఖ్యంగా నీటి కొరత మరింత తీవ్రమవుతుంది. దిల్లీలో వాయు కాలుష్యం పెరుగుతుంది. దుమ్ము, ఇసుక గాలులకు సహజ అడ్డుకట్ట తొలగిపోతుంది.

ఎడారీకరణ:

పశ్చిమ రాజస్థాన్ నుంచి తూర్పు దిశగా ఎడారి విస్తరణను అడ్డుకునే చివరి సహజగోడ ఆరావళి పర్వతాలే. ఈ గోడ బలహీనపడితే వ్యవసాయంతో పాటు నివాస ప్రాంతాలు, ప్రజల జీవనాధారాలు, తీవ్ర ప్రమాదంలో పడతాయి.

అభివృద్ధి వర్సెస్ విధ్వంసం:

సహజ వనరులు తాత్కాలిక లాభాల కోసం అమ్ముకునే సరుకులు కావు. నిజమైన అభివృద్ధి అంటే పర్యావరణ స్థిరత్వం ఉండితీరాలి. ప్రజారోగ్య రక్షణ జరగాలి. రాబోయే తరాల హక్కుల పరిరక్షణ అనివార్యంగా భావించాలి. ఇవన్నీ ఉంటేనే అది అసలు అభివృద్ధి. అభివృద్ధి పేరుతో విధ్వంసమే ధ్యేయంగా తీసుకున్న ఎలాంటి చర్యలైనా అవి భావితరాలకు నష్టదాయకమే. ఆరావళిని కాపాడటం అంటే నీటిని, గాలిని, ప్రజల ఆరోగ్యాన్ని, కోట్లాది మంది భవిష్యత్తుని కాపాడటమే. పర్యావరణ పునాదిని ధ్వంసం చేసే అభివృద్ధి అభివృద్ధి కాదు, అది ఆత్మవినాశనం.

చైర్మన్, కంట్రోల్ కమిషన్, సీపీఐ

భారతదేశంలో ఏఐ అవకాశాలు, సవాళ్లు, భవిష్యత్తు మార్గాలు

విజయ్‌కుమార్ కుర్రా

గత వ్యాసంలో AI ఎలా నేర్చుకుంటుంది? అనే అంశంలో భాగంగా Machine Learning, Supervised, Unsupervised, Reinforcement Learning వంటి అభ్యాస విధానాలను చూశారు. ఇప్పుడు మన దృష్టిని భారతదేశంపై నిలిపి AI భారతదేశంలో ఎలా ఎదుగుతోంది? మనకు ఉన్న అవకాశాలు, సవాళ్లు ఏమిటి? అనే అంశాలను విశ్లేషిద్దాం.

భారతదేశంలో ఏఐ అభివృద్ధికి పెరుగుతున్న ప్రాధాన్యత:

భారతదేశం, ప్రపంచంలో రెండవ అతిపెద్ద జనాభా గల దేశం కావడంతో పాటు, డిజిటల్ మార్పొసిస్ Digital Transformation లో వేగంగా పురోగమిస్తున్న దేశంగా నిలుస్తోంది. ప్రభుత్వ విధానాలు, స్టార్టప్‌ల పెరుగుదల, విద్యా రంగంలో మార్పులు ఇవన్నీ కలిసి AI అభివృద్ధికి మంచి వాతావరణం కల్పిస్తున్నాయి.

2023 నాటికి భారతదేశంలో AI మార్కెట్ విలువ 12.3 బిలియన్ డాలర్ల స్థాయిని దాటింది. 2025 నాటికి ఇది 20 బిలియన్ డాలర్లకు పైగా పెరిగే అవకాశముంది. (NASSCOM)

ప్రభుత్వం చేపట్టిన ప్రాథమిక చర్యలు:

1. National Strategy for AI (2018)

1. నీతి ఆయోగ్ రూపొందించిన ఈ ప్రణాళిక AI for All అనే లక్ష్యంతో ఆరోగ్యం, వ్యవసాయం, విద్య, స్మార్ట్ సిటీలు, న్యాయ వ్యవస్థ మొదలైన రంగాలలో AI ని ప్రవేశపెట్టే దిశగా రూపుదిద్దుకుంది.

2. Responsible AI for Youth ఈ ప్రోగ్రామ్ ద్వారా ప్రభుత్వము విద్యార్థులకు AI పట్ల అవగాహన, ప్రాజెక్ట్‌లు, పాఠశాల స్థాయిలోనే అందుబాటులోకి తీసుకువచ్చింది.

3. INDIA ai Portal ఇది ఒక కేంద్ర AI నాలెడ్జ్ హబ్‌గా పనిచేస్తోంది. పరిశోధనలు, సమాచారం, వార్తలు అందించే ప్రభుత్వ వెబ్‌సైట్.

4. ఐరావత్ AIRAWAT - AI Research, Analytics and Knowledge Assimilation Platform):

భారత ప్రభుత్వ ఆధ్వర్యంలో అభివృద్ధి చేస్తున్న AI-specific Cloud Computing Platform, ఇది పరిశోధకుల, స్టార్టప్‌లకు బలమైన మద్దతును అందిస్తుంది.

భారతదేశంలో AI వాడుక రంగాలు :

1. వ్యవసాయం:

AI ఆధారిత డ్రోన్‌లు, పొలంలో సాళ్ల గుర్తింపు సిస్టమ్స్ (అటానమస్), వాతావరణ అంచనాల ఆధారంగా పంట సలహాలు ఇవ్వడం మొదలైనవి అభివృద్ధిలో ఉన్నాయి.

ఉదాహరణ: Microsoft, ICRISATకలిసి చేసిన పంట తేమ ప్యాటర్న్ ప్రెడిక్షన్.

2. ఆరోగ్యం:

AI ఆధారంగా రేడియాలజీ స్కానింగ్, కేన్సర్ నిర్ధారణ, టెలీమెడిసిన్ ద్వారా గ్రామీణ ప్రాంతాలకూ వైద్య సేవల విస్తరణ.

ఉదాహరణ: Aravind Eye Hospital, Google DeepMind diabetic retinopathy AI వాడుతున్నారు.

3. విద్య:

AI ఆధారంగా వ్యక్తిగత విద్యా విధానాలు, తగిన కంటెంట్ సూచన.

ఉదాహరణ: దీఎయిబ వేదాంత వంటి సంస్థలు AIద్వారా విద్యార్థుల అభ్యాస శైలిని విశ్లేషించి వ్యక్తిగత కంటెంట్ అందిస్తున్నాయి.

4. లిపబ్లిక్ పాలసీ, పోలీసింగ్:

ఫేస్ రికగ్నిషన్ టెక్నాలజీ, స్మార్ట్ సిటీలలో ట్రాఫిక్ మానేజ్మెంట్, సైబర్ క్రైం రిపోర్టింగ్ వ్యవస్థలు. రీసెంట్‌గా మహారాష్ట్రలో మైక్రోసాఫ్ట్‌తో కలిసి క్రైమ్ డిటెక్షన్ యాప్ ఓ వినూత్న ప్రక్రియ.

భారత యువతకు అవకాశాలు:

AI రంగంలో భారతదేశం ప్రపంచంలో అత్యధికంగా టెక్నికల్ గ్రాడ్యుయేట్లను ఉత్పత్తి చేసే దేశం.

డేటా సైన్స్, AIఎథిక్స్, మెషిన్ లెర్నింగ్ ఇంజనీరింగ్, నాచురల్ లాంగ్వేజ్ ప్రోసెసింగ్ (NLP) వంటి ఉద్యోగ అవకాశాలు వేగంగా పెరుగుతున్నాయి.

AI India Talent Pool ప్రపంచంలో మూడవ స్థానంలో ఉంది.

సవాళ్లు:

1. సాంకేతిక అసమానత:

గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల మధ్య డిజిటల్ విభజన.

2. డేటా ప్రైవసీ చట్టాల లోపం:

AI కు అవసరమైన డేటా సేకరణకు సరైన నిబంధనలు లేకపోవడం.

3. అభ్యాస లోపాలు:

ప్రభుత్వ పాఠశాలల, గ్రామీణ విద్యాసంస్థలలో AI బోధన ఇంకా పరిమితంగానే ఉంది.

4. భాషా అవరోధం:

ఎక్కువ AI టూల్స్ ఇంకా ఇంగ్లీషులో ఉండటం వల్ల, స్థానిక భాషలలో అందుబాటులోకి తేవాల్సిన అవసరం ఉంది.

ఏం చేయాలి?

AIవిద్యను పాఠశాల స్థాయిలో ప్రవేశపెట్టాలి.

ప్రజా-ప్రైవేట్ భాగస్వామ్యం ద్వారా పరిశోధనలపై పెట్టుబడులు పెంచాలి.

భారతీయ భాషల NLP పరిశోధనలకు ప్రోత్సాహం ఇవ్వాలి.

డేటా ప్రైవసీ చట్టాలను బలపరచాలి.

చివరగా...

AI భారతదేశానికి ఒక బలమైన సాధనం. ఇది గ్రామీణాభివృద్ధి నుంచి పరిశ్రమల దిశగా, ఆరోగ్య సంరక్షణ నుంచి న్యాయ వ్యవస్థ దాకా ప్రతి రంగంలో వినూత్న మార్పులు తేగలదు. అయితే దీనిని బాధ్యతతో, పారదర్శకంగా, ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేయడం ప్రభుత్వాలకు ఎంతో అవసరం.

తదుపరి వ్యాసంలో AI నైతికత మానవీయ విలువలు కృత్రిమ మేధస్సు మధ్య సమతుల్యత"

AI రూపంలో భారతదేశ భవిష్యత్తు యువత చేతిలో!"

టెక్ జర్నలిస్ట్, పరిశోధకుడు, 9949690009

హ్యాపీ న్యూ ఇయర్

చింతపట్ల సుదర్శన్

ఇవాళ్లేమిటి ఇంత హడావిడి చేస్తున్నారు జనం. వీధులన్నీ రద్దీగా ఉన్నాయి. షాపుల్లో జనం కిటకిటలాడుతున్నారు. ముఖ్యంగా మటన్ షాపులో మందు షాపులో జనం ఆ రెండూ ఉచితంగానే ఇస్తున్నారన్నట్టు ఎగబడుతున్నారు. ఏ పండగో పబ్బమో అయి ఉంటుంది. సందు దొరికితే చాలు ఏదో ఓ పేరున ఎంజాయి చేస్తుంటారు ఈ మానవ జన్మనెత్తిన అదృష్టవంతులు అనుకుంటూ అరుగు ఎక్కింది డాగీ. అప్పటికే అరుగు ఎక్కి గోడకానుకుని కూచునుంది డాంకీ.

హలో బ్రదర్! ఏమిటి వేళ ఎర్లీగా వచ్చినట్టున్నావ్ అంది డాగీ తన జాగాలో ఓసారి చుట్టూ తిరిగి చూసి కూచుంటూ. సాయంత్రం అయ్యే కొద్దీ 'వింటర్ విండ్స్' చంపేస్తున్నవి. పైగా ఈవేళ రోడ్లంట తిరగడం అంత 'సేఫ్' కాదు అంది డాంకీ. అదేంటి ఆ మాట! ఎందుకని? జనం గోలగోలగా తిరుగుతుంటే నాకూ డవుటు వచ్చింది. అసలేంటి విశేషం? ఏముంది క్యాలెండర్ మారబోతున్నది అంది డాంకీ. కెబిసి క్వశ్చన్‌లో కన్‌ఫ్యూజ్ చెయ్యకుండా ఏదీ తిన్నగా చెప్పవు కదా! ఇందులో కన్‌ఫ్యూజనేం లేదు తంబీ. క్యాలెండర్ మారుతుంది అంటే పాత సంవత్సరం పరారై, కొత్త సంవత్సరం హుశారౌతుందని అర్థం. ఈ వేల్టితో పాత క్యాలెండర్లు గోడ దిగుతయి. రేపు కొత్త క్యాలెండర్లు గోడ ఎక్కుతయన్న మాట. పాత సంవత్సరం, కొత్తవడమేమిటి అసలు ఇదంతా ఎందుకు? అంది డాగీ. నువ్వూనేనూ బళ్లోకి వెళ్లలేదు అంకెలూ, ఎక్కాలూ తెల్సు. ముఖ్యంగా మన వాళ్లు బడ్జెట్‌లలో చేసేది ఆ పనే. అంకెలు మారతాయి కాని పేద ప్రజల

రంగస్థలం

బతుకులు మారవు. ఒక అంకె మార్పు కోసమే బజార్లో నువు చూసిన హడావిడి అంది డాంకీ. అవునా ఆ అంకె వీళ్లు మటనూ, మందూ కొంటే తప్పరాదన్న మాట. మంచిదే మాలాంటి వీధి కుక్కలకు కూడా కొంత లాభం అవుతుందన్న మాట. మంచిదే మాలాంటి వీధి కుక్కలకు కూడా కొంత లాభం అవుతుందన్న మాట. ఎంతసేపూ సొంత లాభం గురించేనా మాయదారి మనుషుల్లా అని కోప్పడింది డాంకీ. ఏదో ఓ పూటకింత కడుపులో పడ్తుందని. మనకేమన్నా కోట్లు కూడబెట్టే స్వార్థం ఉందా? అవునూ ఈ సందర్భంగా పాత క్యాలెండర్లు గోడ దిగుతయన్నావు కదా. నీకూ కలిసొస్తుంది కదా. కొన్నాళ్ల దాకా పళ్లు తీపులు పుట్టేట్టు నములుదువు కానీ అని డాగీ అంటుంటే అరుగు ఎక్కాడు అబ్బాయి.

పళ్లు తీపులంటున్నావు ఎవరికి? ఎందుకు? డాగీ అన్నాడబ్బాయి అరుగు మీద కూచుంటూ. ఏంలేదు బ్రో సంవత్సరం మారుంతుందట కదా, అంటే అంకె ఏదో కొత్తది వస్తుందట కదా? పాత క్యాలెండర్లు తినితిని పళ్లు తీపులవుతయి కదా డాంకీకి ఆ మాటే అంటున్నా అంది డాగీ. మీకేమిటి డాగీ క్యాలెండర్ మారితే, అంకె మారితే మీకే బాధాలేదు. మనుషులకే కష్టాలు అంటూ నిట్టూర్చాడు అబ్బాయి.

అదేంటి బ్రో! పాత సంవత్సరం సాగనంపడానికి ఎంత గోల చేస్తారు. డీజేలు, డాన్సులూ, ఊగూ, తూగూ అన్నీ. ఆ పైన కొత్త సంవత్సరానికి 'వెల్‌కం' చెప్పడానికి కేకులూ, క్రాకర్లు. హేపీ న్యూ ఇయర్ చెప్పుకోడాలూ, కావిలింతలూ. ఇంత హుశారైన టైంలో కష్టాలంటావు అది డాంకీ. నువ్వెప్పుడు పుట్టావు డాంకీ? అంటే ఏ ఇయర్‌లో, పోనీ నువ్వు చెప్పు డాంకీ నీ 'డేట్ ఆఫ్ బర్త్' ఏంటి? నేను ఎప్పుడు పుట్టానో నాకు ఎలా తెలుస్తుంది బ్రో, ఊరికే జోకులు వెయ్యకు అంది డాంకీ. మాకు డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్ ఎవడిస్తాడు బ్రదర్. మేం ఎప్పుడు పుట్టామో మాకు తెలీదు. ఏ లారీ కిందపడి కుక్కచావు చస్తామో అదీ తెలీదు అంది డాగీ.

కదా! మీకు, మీరు ఎప్పుడు పుట్టారో తెలీదు చావు సంగతి మీకులాగే మాకూ తెలీదు. ఏ కార్పొరేటు ఆసుపత్రి వాడు పొట్టన పెట్టుకుంటాడో. కానీ పుట్టిన తేదీ మనుషులందరికీ తెల్సు. క్యాలెండర్లు మారుతుంటే ఎన్నేళ్ల వయసు పైన పడుతున్నదో తెలుస్తుంది. ఆ తెలవడమే గుండె గుభేలు మనిపిస్తుంది. హేపీ న్యూ ఇయర్ ఆనందమంతా ఆవిరై పోతుంది అన్నాడబ్బాయి గులకరాయిని గాల్లోకి విసురుతూ. అదేంటి బ్రో కొత్త సంవత్సరం వస్తున్నదని అందరిలా ఉత్సాహంగా ఉండాలి కాని ఇలా జబ్బలు జార్చేస్తున్నావు అంది డాంకీ. హేపీ న్యూ ఇయర్ అందరికీ కాదు డాంకీ. కొందరికి అన్ హ్యాపీ న్యూ ఇయర్ కూడా! ఈ సంవత్సరం చివరి సంవత్సరం నాకు ఉద్యోగం రావడానికి. వచ్చే ఏడు ప్రభుత్వ ఉద్యోగానికి వయసు ముగిసిపోతుంది. అందుకే కొత్త సంవత్సరం అంటే దడ పుడుతున్నది. ఇక మా నాన్నగారి రిటైర్‌మెంట్ ఈ కొత్త సంవత్సరం పూర్తవకముందే. నా మీద నాకు బెంగ ఆయనకు నామీద బెంగ, నాకు ఈ సంవత్సరమన్నా ఉద్యోగం వస్తుందో రాదోనని. రిటైర్‌మెంట్ డబ్బులు ఎప్పటికి వస్తయోనని ఆయన చింత కానీ బయటకు కనిపించనీడు అన్నాడబ్బాయి. అయితే క్యాలెండర్ మార్పు, కొత్త సంవత్సరం అందరికీ సంతోషం కలిగించదంటావు అంతే కదా అంది డాగీ.

అవును. న్యూ ఇయర్ వచ్చే మాట నిజమే కాని అది అందరినీ హేపీగా ఉంచడం మాత్రం అబద్ధం. పదవిలో ఉన్నవాళ్లకి ఎలెక్షన్లు దగ్గర కొస్తున్నయని ఆందోళన, దీపం ఉండగానే ఇల్లు సర్దుకోవాలనే ఆతృత ఉంటే, మళ్లీ పదవిలోకి రావాలనుకునేవారు తమ అదృష్టాన్ని పరీక్షించుకునే సమయం దగ్గర పడుతున్నదని ఈసారి గెలుపు కోసం పథకాలు రచిస్తుంటారు అన్నాడు అబ్బాయి.

సంవత్సరాలు రానీపోనీ మాకేం పట్టదు. నాలుగు కాళ్ల మీద పొట్ట మోసుకుంటూ తిరగడం తప్పదు అంది డాగీ. ఉద్యోగం రావడానికి ఇదే ఆఖరి న్యూఇయర్ అంటున్నావు 'బ్రో' ఈసారి నీకుతప్పకుండా ఉద్యోగం రావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా 'హేపీ న్యూ ఇయర్' అంది డాంకీ.

పెరుగుతున్న నిరుద్యోగం

భారతదేశంలో నిరుద్యోగిత రేటుకు సంబంధించి ప్రభుత్వ (పీఎల్ఎఫ్ఎస్), ప్రైవేట్ (సీఎంఐఈ) సంస్థలు విడుదల చేసిన తాజా గణాంకాలు (2024-25) మిశ్రమ ఫలితాలను చూపుతున్నాయి. పట్టణ ప్రాంతాల్లో నిరుద్యోగం పెరుగుతున్నట్లు సూచిస్తున్నాయి.

1. జాతీయ నిరుద్యోగిత రేటు (పీఎల్ఎఫ్ఎస్ 2024-25)

కేంద్ర గణాంక, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ (ఎంఓఎస్‌పీఐ) విడుదల చేసిన 'పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే' ప్రకారం మొత్తం నిరుద్యోగం: 2024 క్యాలెండర్ సంవత్సరంలో నిరుద్యోగిత రేటు 4.9%గా నమోదైంది. అంతకుముందు ఏడాది ఇది 5%గా ఉండేది. 2025 ఏప్రిల్-సెప్టెంబర్: 2025 ఏప్రిల్‌లో 5.1%గా ఉన్న నిరుద్యోగం, సెప్టెంబర్ నాటికి 5.2%కి స్వల్పంగా పెరిగింది.

2. గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల మధ్య వ్యత్యాసం-నిరుద్యోగం అనేది గ్రామాల్లో కంటే నగరాల్లో ఎక్కువగా ఉంది: **గ్రామీణ నిరుద్యోగం:** సుమారు 4.2%-4.4%. ఉపాధి హామీ పథకాలు, వ్యవసాయ పనుల వల్ల ఇక్కడ నిరుద్యోగం కొంత తక్కువగా ఉంది. అయితే ఉపాధి హామీ చట్టాన్ని మోదీ సర్కారు మార్చేయడం వల్ల ఈ నిరుద్యోగం పెరిగే అవకాశాలు నూటికి నూరు శాతం ఉన్నాయి. పట్టణ నిరుద్యోగం: సుమారు 6.7%-6.9%. నగరాల్లో ఉద్యోగాల కోసం పోటీ ఎక్కువగా ఉండటం, నైపుణ్యాల కొరత దీనికి ప్రధాన కారణాలు.

నిరుద్యోగం పెరగడానికి/స్థిరంగా ఉండటానికి ప్రధాన కారణాలు:

నైపుణ్యాల కొరత: చదువుకున్న యువతకు పరిశ్రమలకు కావాల్సిన నైపుణ్యాలు లేకపోవడం.వ్యవసాయంపై ఆధారపడటం: గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ 45% పైగా జనాభా కేవలం వ్యవసాయంపైనే ఆధారపడటం వల్ల 'ప్రచ్ఛన్న నిరుద్యోగం' కనిపిస్తోంది. మహిళా భాగస్వామ్యం: మహిళా శ్రామిక శక్తి భాగస్వామ్యం పెరుగుతున్నప్పటికీ (సుమారు 33.7%), అందుకు తగ్గ ఉపాధి అవకాశాలు లభించకపోవడం. కేంద్ర ప్రభుత్వ వైఫల్యం అన్నింటికీ మించి ప్రధాన కారణం.

ఒక్కటైన పవార్ కుటుంబం

- స్థానిక ఎన్నికల్లో కలిసి పోటీ
- మహారాష్ట్ర రాజకీయాల్లో అనూహ్య పరిణామం

ముంబై: స్థానిక ఎన్నికల వేళ మహారాష్ట్ర రాజకీయాలు మారుతున్నాయి. పవార్ కుటుంబం ఒక్కటైంది. శరద్ పవార్-అజిత్ పవార్ నాయకత్వాల్లోని ఎన్సీపీ (ఎస్పీ)-ఎన్సీపీ పార్టీలు పింప్రీ-చించ్వాడ్ ఎన్నికల బరిలోకి ఉమ్మడిగా దిగనున్నాయి. ఈ విషయాన్ని మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి అజిత్ పవార్ వెల్లడించారు. ఈ కొత్త కూటమికి తన బాబాయ్ శరద్ పవార్ నాయకత్వం వహిస్తారని ఆయన చెప్పారు. మహారాష్ట్రలో జనవరి 15న స్థానిక ఎన్నికలు జరగనున్నాయి. బృహన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ)తో పాటు 28 కార్పొరేషన్లు, 32 జిల్లా కౌన్సిళ్లు, 336 పంచాయతీ సమితులకు ఒకేవిడతలో ఓటింగ్ జరగనుంది. ఈ ఎన్నికలకు అభ్యర్థులను ఖరారు చేసేందుకు జరిగిన చర్చల్లో భాగంగా కలిసి పోటీ చేయాలనే నిర్ణయం తీసుకున్నామని పింప్రీ-చించ్వాడ్ ర్యాలీలో అజిత్ పవార్ తెలిపారు. 'ఈ పరిణామాలపై ప్రజల మనసుల్లో ఎన్నో ప్రశ్నలు ఉన్నాయి. అయితే మహారాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా కొన్ని నిర్ణయాలు తీసుకోవడం తప్పడం లేదు. సీట్ల సర్దుబాటు జరుగుతోంది. త్వరలో అధికారిక ప్రకటన వస్తుంది. పార్టీ కార్యకర్తలు ప్రచారంపై దృష్టిపెట్టాలి. వివాదాస్పద ప్రకటనలకు దూరంగా ఉండాలి' అని మద్దతుదారులను ఉద్దేశించి అజిత్ పవార్ మాట్లాడారు. పూణె మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లోనూ ఈ రెండు పార్టీలు పొత్తు పెట్టుకునే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. స్థానిక ఎన్నికలు ఇటు పవార్లతో పాటు అటు ఠాక్రేలను కూడా కలిపిన సంగతి తెలిసిందే. మరాఠీలు, మహారాష్ట్ర ప్రయోజనాల కోసం తాము ఒక్కటయ్యామని, బీఎంసీ మేయర్ పీఠం తమదేనని శివసేన (యూబీటీ) అధిపతి ఉద్ధవ్ ఠాక్రే, మహారాష్ట్ర నవనిర్మాణ్ సేన (ఎంఎన్ఎస్) అధ్యక్షుడు రాజ్ ఠాక్రే ఇప్పటికే ప్రకటించారు. ఇతర పురపాలక సంఘాల్లోనూ పొత్తుపై చర్చలు కొనసాగుతున్నాయని చెప్పారు. ఈ కుటుంబాల పునరేకీకరణ మహారాష్ట్ర రాజకీయాల్లో పూర్తి మార్పు వచ్చే అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

ముంబై కాంగ్రెస్ శ్రేణుల్లో కలవరం

ముంబై: రాబోయే ముంబై మునిసిపల్ ఎన్నికలలో ఒంటరిగా పోటీ చేయాలన్న తన నిర్ణయాన్ని నామినేషన్ల దాఖలుకు గడువు ముగియడానికి కొద్ది రోజుల ముందు రద్దు చేసుకుని, కాంగ్రెస్ తీసుకున్న ఈ యూ-టర్న్ నగరంలోని పార్టీ కార్యకర్తలను దిగ్భ్రాంతికి గురిచేసింది. జనవరి 15న జరగబోయే ఎన్నికల్లో మొత్తం 227 వార్డుల్లోనూ ఒంటరిగా పోటీ చేస్తామని ఇంతకు ముందు ప్రకటించిన కాంగ్రెస్... ఆదివారం ప్రకాశ్ అంబేద్కర్ నేతృత్వంలోని వంచిత్ బహుజన్ అఘాడి (వీబీఏ) తో చేతులు కలిపి... దానికి 62 స్థానాలను కేటాయించింది. వీబీఏతో పాటు కాంగ్రెస్ రాష్ట్రీయ సమాజ్ పక్ష్ (ఆర్ఎస్పీ) కి 10 స్థానాలు, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (గవాయి వర్గం) కు రెండు స్థానాలు కేటాయించిందని, ఇది పార్టీ నగర విభాగం కార్యకర్తలను కలవరపరిచిందని నాయకులు తెలిపారు. ముంబై విభాగానికి సంబంధించి ఇంత ముఖ్యమైన నిర్ణయాన్ని కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రకటించడం గతంలో ఎన్నడూ జరగలేదని సీనియర్ నాయకులు ఎత్తి చూపారు. అయితే పార్టీ నగర విభాగం అధ్యక్షురాలు వర్ష గైక్వాడ్ ఈ పొత్తు, సీట్ల సర్దుబాటు పట్ల తాను సంతోషంగా ఉన్నానని చెప్పారు. పార్టీ రాష్ట్ర విభాగం ఒక స్వతంత్ర రాజకీయ మార్గాన్ని అనుసరిస్తున్నట్లు భావిస్తోంది. ఎన్సీపీ (ఎస్పీ) అధినేత శరద్ పవార్, శివసేన (యూబీటీ) అధ్యక్షుడు ఉద్ధవ్ ఠాక్రే ప్రభావంతో పార్టీ క్రమంగా తన స్వతంత్ర రాజకీయ స్వరాన్ని కోల్పోయింది. పార్టీ కార్యకర్తలు, రాజకీయ పరిశీలకులు కూడా ఇదే భావనను పంచుకున్నారని కాంగ్రెస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఒకరు తెలిపారు. వీబీఏతో సీట్ల పంపకం ఒప్పందం ముంబై కాంగ్రెస్ కార్యకర్తలకు షాక్‌గా తగిలింది, ఎందుకంటే ఆరు లోక్‌సభ నియోజకవర్గాలలో ప్రతి దానిలోనూ వీబీఏకు 10 కంటే ఎక్కువ వార్డులను కేటాయించినట్లు సమాచారం. ఆసక్తికరంగా, ఈ వార్డులలో చాలా వరకు బీజేపీకి కంచుకోటలుగా పరిగణించబడుతున్నాయి. దీంతో కాంగ్రెస్ తీవ్రమైన పోటీ లేకుండానే ఈ ప్రాంతాలను వదులుకుని ఉండవచ్చని విశ్లేషకులు సూచిస్తున్నారు. ఇదిలాఉండగా నగర నాయకత్వంలోని కొన్ని వర్గాలు తమ వ్యక్తిగత ప్రయోజనాలను కాపాడుకోవడానికి అధికార బీజేపీతో అవగాహన కుదుర్చుకున్నాయని కాంగ్రెస్ సీనియర్ కార్యకర్త ఒకరు ఆరోపించారు. కాంగ్రెస్ ఈ కొత్త దిశ ఈ అసంతృప్తికి రాజకీయ రూపం ఇవ్వడానికి ప్రయత్నిస్తోందని పరిశీలకులు పేర్కొంటున్నారు. ఒక పార్టీ నాయకుడు మాట్లాడుతూ ఈ మార్గం సులభం కానప్పటికీ, తక్షణ విజయాన్ని హామీ ఇవ్వనప్పటికీ, దీర్ఘకాలిక రాజకీయ పునర్నిర్మాణానికి ఈ ప్రయాణం అవసరమని అన్నారు. సమాన భావాలున్న పార్టీలను కలుపుకొని లౌకిక శక్తులను బలోపేతం చేయాలని కాంగ్రెస్ కోరుకుంటోందని, ఈ చర్య మహారాష్ట్రలో భవిష్యత్ రాజకీయాలకు మార్గం సుగమం చేయవచ్చని కాంగ్రెస్ ప్రతినిధి సచిన్ సావంత్ తెలిపారు.

సేన(యూబీటీ)తో కలిసి పని చేద్దాం

ఎంఎన్ఎస్ శ్రేణులతో రాజ్ ఠాక్రే

ముంబై: ముంబైని కాపాడటానికి విభేదాలను పక్కనపెట్టి శివసేన (యూబీటీ) తో కలిసి ఐక్యంగా పని చేయాని, జనవరి 15న జరగబోయే ముంబై మునిసిపల్ ఎన్నికలలో ఈ రెండు పార్టీల కూటమి విజయం సాధించేలా చూడాలని మహారాష్ట్ర నవనిర్మాణ సేన అధ్యక్షుడు రాజ్ ఠాక్రే తన పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. రంగశారద ఆడిటోరియంలో పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి ఠాక్రే మాట్లాడుతూ ముంబైని మహారాష్ట్ర నుంచి వేరు చేయాలని కొందరు కలలు కంటున్నారని, దాని కోసం ప్రణాళికలు కూడా రచిస్తున్నారని అన్నారు. 'ముంబైని విడదీయాలనే ఈ కలను నాశనం చేయాలి. ముంబై మరాఠీ ప్రజలకు, మహారాష్ట్రకు చెందినది. ఈ ఎన్నిక మరాఠీ ప్రజలకు చాలా కీలకం. మహారాష్ట్ర కంటే పెద్ద పోరాటం మరొకటి లేదు' అని పార్టీ నాయకుడు బాలా నందగావ్‌కర్, ఠాక్రే మాటలను ఉటంకిస్తూ అన్నారు. ఈ మునిసిపల్ ఎన్నికలలో ప్రతి సీటు ముఖ్యమైనది అయినందున పార్టీ కార్యకర్తలు కూటమి ధర్మాన్ని పాటించాలని ఠాక్రే అన్నారు. 'ముంబైని కాపాడటానికి మీ విభేదాలను పక్కన పెట్టండి. పార్టీ కార్యకర్తలు, స్థానిక నాయకులు శివసేన (యూబీటీ), ఎన్సీపీ (ఎస్పి) అభ్యర్థుల ప్రచారంలో పాల్గొనాలి. దానికి ప్రతిఫలంగా శివసేన (యూబీటీ) కూడా అదే విధంగా సహకరిస్తుంది' అని ఠాక్రే తెలిపారు. నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎస్పి) కూడా ఈ కూటమిలో భాగమవుతుందని ఆయన చెప్పారు. పార్టీ అధికారిక అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేయడానికి అవసరమైన ఏబీ ఫారాలను సోమవారం పంపిణీ చేస్తామని నందగావ్‌కర్ తెలిపారు. కొన్ని వార్డుల విషయంలో చివరి నిమిషం చర్చలు ఇంకా జరుగుతున్నాయని నందగావ్‌కర్ చెప్పారు. బృహన్ ముంబై మునిసిపల్ కార్పొరేషన్ ఎన్నికలు జనవరి 15న జరగనున్నాయి. నామినేషన్ దాఖలు చేయడానికి చివరి తేదీ డిసెంబరు 20. ఓట్ల లెక్కింపు జనవరి 16న జరుగుతుంది.

మోదీ కుట్రలపై నిరంతర పోరాటం

ఆరావళిపై సుప్రీం స్టేను స్వాగతించిన కాంగ్రెస్

న్యూఢిల్లీ: అరావళి పర్వత శ్రేణికి సంబంధించిన కొత్త నిర్వచనంపై నవంబరు 20న ఇచ్చిన తన ఉత్తర్వులపై స్టే విధిస్తూ సుప్రీం కోర్టు తీసుకున్న నిర్ణయాన్ని కాంగ్రెస్ సోమవారం స్వాగతించింది. ఈ పునర్నిర్వచనానికి అనుకూలంగా కేంద్ర పర్యావరణ మంత్రి భూపేందర్ యాదవ్ చేసిన వాదనలన్నీ తిరస్కరించబడ్డాయని పేర్కొంటూ, ఆయన తన పదవికి రాజీనామా చేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ కమిటీ సిఫార్సు చేసిన ఆరావళి పర్వతాలు, శ్రేణుల ఏకరీతి నిర్వచనాన్ని అంగీకరించిన తన నవంబరు 20 తీర్పులోని ఆదేశాలను సుప్రీం కోర్టు నిలిపివేసింది. ఈ అంశంపై సమగ్రంగా, సంపూర్ణంగా పరిశీలన జరపడానికి ఆయా రంగ నిపుణులతో కూడిన ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేయాలని కూడా అది ప్రతిపాదించింది. నిర్దేశిత ఆరావళి జిల్లాల్లోని ఏదైనా భూభాగం, దాని స్థానిక ఎత్తు కంటే 100 మీటర్లు లేదా అంతకంటే ఎక్కువ ఎత్తులో ఉంటే దానిని ఆరావళి కొండగా నిర్వచించాలని, ఒకదానికొకటి 500 మీటర్ల దూరంలో ఉన్న రెండు లేదా అంతకంటే ఎక్కువ కొండల సమూహాన్ని ఆరావళి శ్రేణిగా నిర్వచించాలని ఆ కమిటీ సిఫార్సు చేసింది. కాంగ్రెస్ ఈ పునర్నిర్వచనాన్ని తీవ్రంగా వ్యతిరేకించింది. దానిపై ఆందోళన వ్యక్తం చేసింది. ఇది మైనింగ్, రియల్ ఎస్టేట్, ఇతర ప్రాజెక్టుల కోసం కొండలను నాశనం చేయడానికి దారితీస్తుందని విమర్శించింది. ఎక్స్‌లో చేసిన ఒక పోస్ట్‌లో, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్... ఈ ఆదేశం 'ఆశా రేఖను' చూపిందని పేర్కొన్నారు. 'మోదీ ప్రభుత్వం ముందుకు తీసుకువస్తున్న ఆరావళి పర్వతాల పునర్నిర్వచనంపై సుప్రీం కోర్టు ఇచ్చిన ఆదేశాలను కాంగ్రెస్ స్వాగతిస్తోంది' అని తెలిపారు. 'ఈ అంశాన్ని ఇప్పుడు మరింత వివరంగా అధ్యయనం చేయాలి. ఈ పునర్నిర్వచనాన్ని ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా, సుప్రీం కోర్టు కేంద్ర సాధికార కమిటీ, స్వయంగా అమికస్ క్యూరీ కూడా వ్యతిరేకించారని గుర్తుంచుకోవాలి' అని ఆయన అన్నారు. ఇప్పుడు తాత్కాలిక ఉపశమనం లభించిందని, అయితే మైనింగ్, రియల్ ఎస్టేట్, ఇతర కార్యకలాపాల కోసం ఆరావళి పర్వతాలను తెరవడానికి 'మోదీ ప్రభుత్వం చేస్తున్న కుట్రల' నుంచి వాటిని రక్షించడానికి చేసే పోరాటాన్ని నిరంతరాయంగా కొనసాగించాల్సి ఉంటుందని కాంగ్రెస్ నాయకుడు అన్నారు.

పొగమంచు దిల్లీని కప్పేసింది!

రైలు, విమాన సర్వీసుల్లో జాప్యం

న్యూదిల్లీ: దేశ రాజధాని దిల్లీని పొగమంచు కప్పేసింది. అతి సమీపంలో ఉన్న వాహనాలు సైతం కనిపించని పరిస్థితి ఎదురవడంతో వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఆదివారం అర్ధరాత్రి నుంచి వాతావరణం దారుణంగా మారడంతో రోడ్డు, రైలు, వాయు మార్గాల్లో రాకపోకలకు అంతరాయం ఏర్పడే అవకాశం ఉందని హెచ్చరించింది. ఉత్తరాది రాష్ట్రాలైన పంజాబ్, హర్యానా, ఉత్తర్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్, బీహార్ రాష్ట్రాలను దట్టమైన పొగమంచు కప్పేసిందని, ఉపగ్రహ చిత్రాల ద్వారా ఈ విషయం వెల్లడైందని వాతావరణ శాఖ అధికారులు పేర్కొన్నారు. వాయు కాలుష్యాన్ని నియంత్రించేందుకు దిల్లీ ప్రభుత్వం తీసుకొచ్చిన కఠినమైన చర్యలు అమల్లోకి వచ్చాయి. సోమవారం తెల్లవారుజామున దిల్లీ వ్యాప్తంగా గాలి నాణ్యత సూచీ 403గా నమోదైనట్లు కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి వెల్లడించింది. వివేక్ విహార్ 460, ఆనంద్ విహార్ 459, రోహిణి 445, వజీర్‌పూర్ 444 ఏక్యూఐలతో అత్యంత ప్రభావిత ప్రాంతాలుగా ఉన్నాయన్నారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో కాలుష్య స్థాయిలు తీవ్రమైన జోన్‌లోకి ప్రవేశిస్తున్నందున నియంత్రణ చర్యలను ముమ్మరం చేస్తున్నామన్నారు. విజిబిలిటీ తగ్గిపోవడంతో రైలు, విమాన సర్వీసుల్లో జాప్యం నెలకొన్నట్లు అధికారులు వెల్లడించారు. తీవ్రమైన పొగమంచు వల్ల రాజధాని ఎక్స్‌ప్రెస్, వందేభారత్, జన శతాబ్దితో సహా వివిధ రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నాయన్నారు. దిల్లీ విమానాశ్రయం సైతం ప్రయాణికులకు అడ్వైజరీ జారీ చేసింది. విమానాల రద్దు, ప్రయాణ సమయాల్లో మార్పుల గురించి తెలుసుకోవడానికి తమ అధికారిక వెబ్‌సైట్లను తనిఖీ చేయాలని విమానయాన సంస్థలు ప్రయాణికులకు సూచించాయి. ఈ మేరకు పౌర విమానయాన మంత్రిత్వ శాఖ సోమవారం అన్ని విమానయాన సంస్థలకు కస్టమర్ సపోర్ట్ ఫోన్ నంబర్‌లను విడుదల చేసింది.

పొట్టు లారీ బోల్తా... ఒకరి మృతి

లక్నో: ఉత్తరప్రదేశ్‌లోని ఓ జాతీయ రహదారిపై పొట్టు లారీ బోల్తాపడింది. సిగ్నల్ వద్ద మలుపు తిప్పుతున్న బొలెరో వాహనంపై అది బోల్తా పడడంతో బొలెరో వాహనంలో ఉన్న డ్రైవర్ మృతిచెందాడు. ఈ ప్రమాదం రాంపూర్-నైనిటాల్ హైవే పై ఉనన పహాడి గేటు సిగ్నల్ వద్ద జరిగింది. మలుపు తిప్పేందుకు ప్రయత్నిస్తున్న బొలెరో వాహనాన్ని వెనుక నుంచి వచ్చిన పొట్టు లారీ ఢీకొట్టింది. అయితే ప్రమాదాన్ని తప్పించేందుకు లారీ డ్రైవర్ ప్రయత్నించాడు. కానీ రోడ్డు డివైడర్‌ను ఢీకొన్న లారీ ... అదే వేగంతో బొలెరో వాహనంపై పడింది. ఈ ప్రమాదంలో బొలెరో డ్రైవర్ ప్రాణాలు కోల్పోయాడు.

కొత్తగా పెళ్లైన జంట... వేర్వేరుగా ఆత్మహత్య

బెంగళూరు: కొత్తగా పెళ్లైన జంట మధ్య రెండు నెలలకే విభేదాలు తలెత్తాయి. రెండు ప్రాంతాల్లో వేర్వేరుగా వారు ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కర్నాటక రాజధాని బెంగళూరుకు చెందిన సూరజ్ శివన్న (36), గనవి (26)కి అక్టోబరు 29న పెళ్లి జరిగింది. హనీమూన్ కోసం శ్రీలంక వెళ్లారు. వారిద్దరి మధ్య గొడవ జరుగడంతో మధ్యలోనే బెంగళూరు తిరిగివచ్చారు. దీంతో గనవి తల్లిదండ్రులు ఆమెను పుట్టింటికి తీసుకువచ్చారు. అత్త వారింట్లో తిరస్కరణ, అవమానాన్ని ఆమె ఎదుర్కొన్నట్లు వారు ఆరోపించారు. ఈ నేపథ్యంలో సోమవారం గనవి ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యులు ఆమెను ఆసుపత్రికి తరలించగా బ్రెయిన్ డెడ్‌గా డాక్టర్లు ప్రకటించారు. ఈ నెల 25నే ఆమె మరణించినట్లు డాక్టర్లు నిర్ధారించారు. గనవి మరణంపై ఆమె కుటుంబం ఆందోళనకు దిగింది. వరకట్నం కోసం అత్తింటి కుటుంబం వేధించి ఆత్మహత్యకు పురికొల్పినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ అత్తమామల ఇంటి ముందు నిరసన చేశారు. ఈ నేపథ్యంలో శివన్నపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో శివన్న, తన తల్లి జయంతితో కలిసి బెంగళూరు నుంచి మహారాష్ట్రలోని నాగ్‌పూర్ వెళ్లాడు. ఈ నెల 27న హోటల్ రూమ్‌లోని సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని అతడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శివన్న తల్లి కూడా ఆత్మహత్యకు యత్నించింది. శివన్న సోదరుడి సమాచారంతో స్థానిక పోలీసులు ఆ హోటల్‌కు చేరుకున్నారు. అతడి మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం తరలించారు. శివన్న తల్లిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

దిల్లీ పేలుడు బాధితులకు

పరిహారం ఇవ్వరా?

న్యూదిల్లీ: దేశ రాజధాని దిల్లీలో ఇటీవల జరిగిన కారు బాంబు పేలుడు ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు, గాయపడిన బాధితులకు ప్రభుత్వం ఇంకా పరిహారం అందించలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఘటన జరిగి నెల రోజులు గడుస్తున్నా... తమ గురించి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత నవంబర్ 10న జరిగిన ఈ పేలుడులో 15 మంది మరణించగా, 20 మందికి పైగా గాయపడ్డారు. ఘటన అనంతరం దిల్లీ ముఖ్యమంత్రి రేఖ గుప్తా మృతుల కుటుంబాలకు రూ.10 లక్షలు, శాశ్వత అంగవైకల్యం పొందిన వారికి రూ.ఐదు లక్షలు, తీవ్రంగా గాయపడిన వారికి రూ.రెండు లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. అయితే ఈ సాయం అందించడంలో తీవ్ర జాప్యం జరుగుతోందని బాధితులు ఆరోపిస్తున్నారు. మృతుల కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం తాము అవసరమైన అన్ని ధృవీకరణ పత్రాలను ప్రభుత్వ కార్యాలయాల్లో సమర్పించినప్పటికీ... ఇప్పటివరకు అధికారుల నుండి ఎటువంటి స్పందన రాలేదన్నారు. ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబ సభ్యుల బాధ వర్ణనాతీతం. తమ కుటుంబానికి గల ఏకైక ఆధారం కోల్పోయామని, ఇప్పటికీ పరిహారం అందకపోవడంతో తాము తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రోదిస్తున్నారు. దీనిపై మీడియా దిల్లీ ప్రభుత్వ వర్గాలను సంప్రదించగా... పత్రాల పరిశీలన ప్రక్రియ కొనసాగుతోందని, త్వరలోనే అర్హులైన వారందరికీ పరిహారం చెల్లిస్తామని అధికారులు తెలిపారు.

కారుణ్య నియామకం హక్కు కాదు

సుప్రీంకోర్టు తీర్పు

న్యూదిల్లీ: ప్రభుత్వ ఉద్యోగుల మరణానంతరం వారి కుటుంబ సభ్యులకు కల్పించే కారుణ్య నియామకాలపై సుప్రీంకోర్టు సంచలన తీర్పునిచ్చింది. కారుణ్య నియామక ప్రాతిపదికన ఒకసారి ఉద్యోగాన్ని అంగీకరించిన తర్వాత... తమకు అర్హత ఉన్నా అంతకంటే ఉన్నత పదవి కావాలని కోరుతూ దరఖాస్తు చేసుకోవడానికి వీల్లేదని కోర్టు తెలిపింది. తమిళనాడు పట్టణ పంచాయతీల్లో స్వీపర్లుగా పనిచేస్తూ మరణించిన ఇద్దరు వేర్వేరు ఉద్యోగుల కుమారులకు (ఎం.జయబల్, ఎస్.వీరమణి) వారి తండ్రుల మరణానంతరం 2007, 2012 సంవత్సరాల్లో స్వీపర్లుగానే ఉద్యోగాలు లభించాయి. వారు ఉద్యోగంలో చేరే సమయంలో ఎలాంటి అభ్యంతరం తెలపకుండా ఆ కొలువుల్లో చేరారు. అయితే, సుమారు 3 నుంచి 9 ఏళ్ల తర్వాత తమకు జూనియర్ అసిస్టెంట్ పోస్టుకు కావాల్సిన అర్హతలు ఉన్నాయని, అప్పట్లో అవగాహన లేక తక్కువ స్థాయి ఉద్యోగంలో చేరామని పేర్కొంటూ మద్రాస్ హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు వారికి అనుకూలంగా తీర్పునివ్వగా... దానిని సవాలు చేస్తూ దాఖలైన అప్పీల్‌పై సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. 'కారుణ్య నియామకం అనేది రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 16 (సమానత్వ హక్కు)కు ఒక మినహాయింపు మాత్రమే. కుటుంబ పెద్దను కోల్పోయి ఆర్థిక సంక్షోభంలో ఉన్న కుటుంబానికి తక్షణ భరోసా ఇవ్వడమే దీని ఉద్దేశం. ఇది ఒక హక్కు కాదు లేదా కెరీర్ అభివృద్ధి కోసం ఇచ్చే అవకాశం కాదు. అభ్యర్థికి ఉన్నత పదవికి కావాల్సిన విద్యార్హతలు ఉన్నప్పటికీ ఖాళీలు, ప్రభుత్వ నిబంధనల ప్రకారమే తదుపరి నియామకం జరుగుతుంది. అర్హత ఉంది కదా అని ఉన్నత పదవిని డిమాండ్ చేసే హక్కు అభ్యర్థికి ఉండదు. ఉద్యోగంలో చేరిన చాలా ఏళ్ల తర్వాత కోర్టును ఆశ్రయించడం సరికాదు' అని సుప్రీంకోర్టు తప్పుపట్టింది. 'వేరే ఒకరికి నిబంధనలకు విరుద్ధంగా ఉన్నత పదవి ఇచ్చారు కాబట్టి, మాకూ ఇవ్వాలి' అనే వాదనను కోర్టు తోసిపుచ్చింది. ఒక అధికారి చేసిన తప్పును మరొకరికి వర్తింపజేయమని కోర్టులు ఆదేశించలేవని చెప్పింది. తప్పును పునరావృతం చేయలేమని స్పష్టం చేసింది. ఈ తీర్పుపై న్యాయ నిపుణులు స్పందిస్తూ... ఇది ప్రభుత్వ నియామక ప్రక్రియల సమగ్రతను కాపాడుతుందని అభిప్రాయపడ్డారు. కారుణ్య నియామకాలు కేవలం మానవతా దృక్పథంతో చేసేవని, వీటిని సీనియారిటీ పెంచుకోవడానికి లేదా ఉన్నత పదవులు అనుభవించడానికి వాడుకోలేమని ఈ తీర్పు ద్వారా స్పష్టమైందని పేర్కొన్నారు. మద్రాస్ హైకోర్టు ఇచ్చిన పాత తీర్పును సుప్రీంకోర్టు కొట్టివేసింది. దీంతో కారుణ్య నియామకం పొందిన వారు భవిష్యత్తులో ఉన్నత పదవుల కోసం ఇలాంటి క్లెయిమ్స్ చేయడానికి అవకాశం లేకుండా పోయింది.

భారత్‌కు లలిత్ మోదీ క్షమాపణలు

న్యూదిల్లీ: భారత్‌కు ఐపీఎల్ వ్యవస్థాపకుడు లలిత్ మోదీ క్షమాపణలు చెప్పారు. ప్రభుత్వం పట్ల తమకు గౌరవం ఉందని ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. వివరాల్లోకి వెళితే... వ్యాపారవేత్త విజయ్ మాల్యా ఇటీవలే లండన్‌లో తన 70వ పుట్టిన రోజు జరుపుకున్నారు. ఆ వేడుకకు లలిత్ మోదీ హాజరయ్యారు. ఈ వేడుకలకు సంబంధించి వీడియో ఒకటి ఇటీవలే వైరల్ అయింది. ఆ వీడియోలో 'మేం ఇద్దరం పరారీలో ఉన్న అతిపెద్ద నేరస్థులం' అంటూ లలిత్ మోదీ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. ఈ నేపథ్యంలో ఆ వీడియోపై లలిత్ మోదీ తాజాగా క్షమాపణలు చెప్పారు. 'ఎవరి మనోభావాలను దెబ్బతీయాలన్న ఉద్దేశం మాకు లేదు. నా వ్యాఖ్యలతో భారత ప్రభుత్వాన్ని, నాకు అత్యంత గౌరవంగా ఉన్న వారిని బాధపెట్టి ఉంటే నన్ను క్షమించండి. వీడియోలో నేను చేసిన వ్యాఖ్యలను తప్పుగా అర్థం చేసుకున్నారు. ఇందుకు గానూ నేను క్షమాపణలు కోరుతున్నాను' అంటూ ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. కానీ విజయ్ మాల్యా ఆ వీడియోలో ఎటువంటి వ్యాఖ్యలు చేయలేదు. నెటిజన్లు లలిత్ మోదీ వైఖరిని తప్పుపట్టారు. పరారీలో ఉన్న లలిత్ మోదీని కర్మ వెంటాడుతుందని, ఇవాళ కాకపోతే, రేపైనా అని కొందరన్నారు. భారతీయ చట్టాలను కించపరిచే రీతిలో లలిత్ మోదీ వ్యాఖ్యలు చేసినట్లు ఓ యూజర్ పేర్కొన్నారు. ప్రభుత్వం మిన్నకుంటే ఉంటే బలమైన వాళ్లు దేశాన్ని లూటీ చేసుకోవచ్చు అన్న సందేశం వస్తుందని కొందరన్నారు. ఈ వ్యవహారం తీవ్ర దుమారం రేపడంతో లలిత్ మోదీ తాజాగా క్షమాపణలు చెప్పారు.

పెట్రోల్, సీఎన్‌జీ వాహనాలకు

గ్రీన్ సెస్?

న్యూదిల్లీ: డీజిల్ కార్లపై విధించే గ్రీన్ సెస్‌ను దిల్లీ ప్రభుత్వం పెట్రోల్, సీఎన్‌జీ వాహనాలపైనా విధించే అవకాశం కనిపిస్తోంది. దీనివల్ల కార్ల ధరలు మరింత పెరగనున్నాయి. ఎలక్ట్రిక్ వాహన విధానం ముసాయిదాలో భాగమైన ఈ ప్రతిపాదన ప్రకారం సెస్ అమలు చేయనున్నారు. మార్చి నాటికి ఈ విధానాన్ని ఖరారు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. దిల్లీలో పెరుగుతున్న కాలుష్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం... ఈవీలను ప్రోత్సహించడానికి సిద్ధమైంది. ఇందులో భాగంగానే డీజిల్, పెట్రోల్, సీఎన్‌జీ వాహనాల కొనుగోలును తగ్గించాలని, దీనికోసం ధరలు పెంచాలని నిర్ణయించుకున్నట్లు రవాణా శాఖ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. సెంట్రల్ వాహన్ పోర్టల్ డేటా ప్రకారం దిల్లీలో ప్రతి నెలా జరిగే అన్ని వాహనాల రిజిస్ట్రేషన్లలో ఎలక్ట్రిక్ వాహనాలు 12-14 శాతం వాటా కలిగి ఉన్నాయి. ఈ సంవత్సరం నమోదైన సుమారు 8 లక్షల వాహనాలలో, దాదాపు 1,11,000 ఎలక్ట్రిక్ వాహనాలు ఉన్నాయి. ఈ సంఖ్యను మరింత పెంచే యోచనలో ప్రభుత్వం కొత్త నిర్ణయాలు తీసుకుంటోంది.

న్యాయమూర్తి పేరుతో విచారణ

రూ.3.7 కోట్లు కాజేసిన కేటుగాళ్లు

ముంబై: డిజిటల్ అరెస్ట్ ఈ మధ్య చాలా మందిని భయపెడుతోంది. దీనిపై ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్నప్పటికీ అనేక మంది ఈ తరహా సైబర్ మోసాల బారిన పడుతూనే ఉన్నారు. తాజాగా ముంబైలో మరో ఘటన వెలుగుచూసింది. డిజిటల్ అరెస్ట్ అంటూ ఓ మహిళను భయపెట్టిన కేటుగాళ్లు... ఏకంగా సుప్రీంకోర్టు మాజీ సీజేఐ పేరు చెప్పి ఆన్‌లైన్‌లో నకిలీ విచారణ చేపట్టారు. ఆమె నుంచి రూ.3.7 కోట్లు కాజేశారు. ముంబైలోని అంధేరీ పశ్చిమ ప్రాంతంలో నివాసముంటున్న 68 ఏళ్ల మహిళకు ఈ ఏడాది ఆగస్టులో ఓ ఫోన్ కాల్ వచ్చింది. ఆ తర్వాత నుంచి వరుసగా పోలీసులు, సీబీఐ అధికారులంటూ కొంతమంది ఆమెకు వాట్సప్, వీడియో కాల్స్ చేశారు. ఆమె ఆధార్ కార్డును ఉపయోగించి ఓ బ్యాంకు ఖాతా తెరిచినట్లు నిందితులు తెలిపారు. ఆ ఖాతాతో రూ.6 కోట్ల మేర అక్రమ లావాదేవీలు జరిపినట్లు చెప్పారు. దీనిపై కేసు నమోదైందని ఓ డిజిటల్ కాపీ పంపించారు. అందులో సీబీఐ లోగో, ఇతరత్రా వివరాలు ఉండటంతో నిజమేనని నమ్మిన బాధితురాలు... వారు అడిగినట్లుగా తన సొంత బ్యాంకు ఖాతా వివరాలు, ఇతర ఆస్తుల గురించి చెప్పారు. ఈ కేసులో డిజిటల్ అరెస్టు చేశామని నమ్మించిన నిందితులు... ఆన్‌లైన్‌లో విచారణకు హాజరవ్వాలని బెదిరించారు. కొన్ని రోజుల తర్వాత సుప్రీంకోర్టు మాజీ సీజేఐ పేరుతో ఓ వ్యక్తి ఆమెను విచారించి... ఈ కేసులో బెయిల్ నిరాకరిస్తున్నట్లు చెప్పాడు. అంతేకాకుండా వెరిఫికేషన్ కోసం తన వద్ద ఉన్న డబ్బంతా సీబీఐకి డిపాజిట్ చేయాలని న్యాయమూర్తిగా నటించిన వ్యక్తి ఆదేశించాడు. బాధితురాలు చేసేదేమీ లేక... వారు సూచించిన పలు బ్యాంకు ఖాతాలకు డబ్బు బదిలీ చేశారు. ఈ ఏడాది అక్టోబరు వరకు పలు దఫాలుగా దాదాపు రూ.3.71 కోట్ల వరకు బదిలీ చేశారు. ఆ మొత్తాన్ని తనిఖీ చేసి తిరిగి అప్పగిస్తామని బాధితురాలిని నమ్మించిన కేటుగాళ్లు... ఆ తర్వాత మాట్లాడటం నిలిపివేశారు. దీంతో మోసపోయానని గ్రహించిన ఆ మహిళ పోలీసులను ఆశ్రయించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు... దర్యాప్తు చేపట్టారు. ఆమె బదిలీ చేసిన డబ్బులో అధిక మొత్తం గుజరాత్‌లోని ఓ వ్యక్తి ఖాతాలో జమ అయినట్లు గుర్తించారు. ఆ వ్యక్తిని అరెస్టు చేసి విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విశాలాంధ్ర హైదరాబాద్

సాయిబాబా భౌతికకాయానికి నేతల నివాళి

విశాలాంధ్ర, హైదరాబాద్ : సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు, వికలాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్, అఖిల భారత ఎన్టీఆర్ అభిమాన సంఘం అధ్యక్షులు పి.సాయిబాబా పార్థివ దేహాన్ని సోమవారం ఉదయం దోమలగూడలోని తెలుగుదేశం జిల్లా పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులు సందర్శనార్థం వుంచారు. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు ఎన్టీఆర్ తనయుడు రామకృష్ణబాబు, పొలిట్ బ్యూరో సభ్యులు బక్కని నర్సింహులు, సాయిబాబా పార్థివ దేహంపై తెలుగుదేశం పార్టీ జెండాకప్పి శ్రద్ధాంజలి ఘటించారు. పలు పార్టీల నాయకులు భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. క్రమశిక్షణ కమిటీ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు, అజ్మీరా రాజు నాయక్, శ్రీపతి సతీష్, శ్రీశైలం దేవస్థానం బోర్డు సభ్యులు కాశీనాథ్, మాజీ వికలాంగుల చైర్మెన్ జి.కోటేశ్వర్ రావు, మాజీ మంత్రి కృష్ణ యాదవ్, ఎంఆర్.పిఎస్ అధ్యక్షులు మందకృష్ణ మాదిగ, ఎం.ఎన్ శ్రీనివాస్, బి.ఎన్ రెడ్డి, జిగ్నేష్‌జోషి, వల్లారపు శ్రీనివాస్, ఎబిఆర్ మోహన్, సుదర్శన్‌రెడ్డి, కట్ట రాములు, వైఎల్.నర్సింహ గౌడ్, మగ్గి యాదగిరి, బానుప్రకాష్, కిరణ్, తడక వినోద్, అనిల్, కెడి దినేష్, చంద్రమోహన్, పద్మజ, జాన్సీ, ప్రమీల, శశిరేఖ, శ్యామ్ సుందర్, చిరంజీవి రాజు, జివి కృష్ణ, ఎంరాజు, పెద్దోజు రవీంద్రాచారి, భవాని శ్రీనివాస్, బివై శ్రీకాంత్, జగదీష్ గౌడ్, జోగిందర్ సింగ్, శక్తి ప్రేమ్, సుక్రవేది దివ్యాంగుల నాయకులు కొల్లి నాగేశ్వర్ రావు, రామ్ చందర్, శ్రీనివాస్ తదితరులు నివాళులు అర్పించారు. నల్లెల్ల కిషోర్, పి.బాలరాజ్ గౌడ్, నాగు నగేష్‌లు ఏర్పాట్లను చూశారు. అనంతరం అంత్యక్రియలు అంబర్ పేట గోల్నాక స్మశాన వాటికకు తరలించి అంత్యక్రియలు పూర్తి చేశారు.

ప్రజావాణి ధరఖాస్తులు పరిష్కరించాలి

విశాలాంధ్ర, బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారుల సమస్యల అర్జీలను లా ఆఫీసర్ చంద్రావతితో కలిసి మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ స్వీకరించారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో (115) ఫిర్యాదులు అందాయన్నారు. సంబంధిత శాఖల జిల్లా అధికారులు స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించి తదుపరి చర్యలు తీసుకోవాలని డిఆర్‌ఓ సూచించారు. ఈ సందర్భంగా డిఆర్‌ఓ మాట్లాడుతూ వివిధ శాఖలలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే స్పందిస్తూ వాటిని వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. వినతులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ ఆన్లైన్ పోర్టల్ లో అప్లోడ్ చేయాలని సూచించారు. ఆన్ లైన్ లో పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు వెంటనే క్లియర్ చేయాలన్నారు. అదేవిధంగా సిఎంఓ ప్రజావాణి పెండింగ్ కేసులను కూడా త్వరితగతిన పరిష్కరించాలని వివిధ శాఖల అధికారులను డిఆర్‌ఓ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులుపాల్గొన్నారు.

శానిటేషన్ పనులు పరిశీలన

విశాలాంధ్ర, మల్కాజిగిరి : పారిశుధ్య పర్యవేక్షణలో భాగంగా ఉదయం 6 గంటల నుంచి సంచిత్ గంగ్వార్ లాలాపేట్ ఫ్లైఓవర్ తనికి, మౌలాలి హజరత్ అలీ అబిన్ కోయి మౌలాలి దర్గా పుట్టినరోజు, ఉర్సు ఉత్సవాల సందర్భంగా కొండపై దర్గా పరిసర ప్రాంతాలలో పారిశుధ్య నిర్వహణ తీసుకోవలసిన జాగ్రత్తలు, చర్యలు గురించి మౌలాలి దర్గా పారిశుద్ధ్య పనులను అదే విధంగా ఉర్సు ఉత్సవాలలో తీసుకోవలసిన జాగ్రత్తలు అడిగి తెలుసుకున్నారు. పారిశుద్ధ్యం మూడు షిఫ్టుల వారిగా ఉండాలని భక్తులకు యాత్రికులకు డస్ట్ బిన్స్ అందుబాటులో ఉండాలని భక్తులు విచ్చలవిడిగా బహిరంగంగా కొండపైన చెత్త వేయరాదని అందుకు తగ్గట్లుగా ఏర్పాట్లు చేయాలని, తాత్కాలిక మూత్రశాలలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రత్యేక పారిశుధ్యంలో భాగంగా సోమవారం నేరేడ్‌మెట్‌లోని ఫుట్ ఓవర్ బ్రిడ్జ్ తనిఖీ చేశారు. ఫుట్‌ఓవర్ బ్రిడ్జ్ యందు పారిశుధ్యలోపం వున్నందున ప్రతిరోజు ఊడ్చాలని, అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా రాత్రి వేళ ప్రత్యేక సిబ్బందిని నియమించాలని సర్కిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌ని ఆదేశించినారు. లాలాపేట్ ఫ్లైఓవర్ బ్రిడ్జి తనీకిలో భాగంగా సెంట్రల్ డివైడర్‌పైన రాళ్లు రప్పలు మట్టి కుప్పలు ఉండరాదని పిచ్చి మొక్కలు ఉండరాదని ఆదేశించినారు. గ్రీన్ వేస్ట్‌ను వెంటనే తొలగించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అదే విధంగా వాయుపురిలో ఉన్న చెత్త ట్రాన్స్‌పోర్ట్ స్టేషన్‌లో పని తీరును, ఎన్ని స్వచ్ఛ ఆటో టిప్పర్లు వస్తాయని అడిగి తెలుసుకున్నారు. పర్యటనలో మల్కాజిగిరి జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్, మౌలాలి డిప్యూటీ కమిషనర్ గోపాల్ రావు, లక్ష్మణ్ ఈఈ, సర్కిల్ ఉపవైద్యాధికారిని డాక్టర్ కే మంజుల, మహేశ్వర్ డిఈ ఈ(ఎస్ డబ్ల్యూ ఎం) ఏఈ. మధురిమ, సానిటరీ సూపర్వైజర్ శ్రీనివాస్, ఎస్ఎఫ్ఏలు తదితరులు పాల్గొన్నారు.

రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం

విశాలాంధ్ర, బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : జిల్లాకు అవసరమైన యూరియా ఎరువులు సరిపడా నిల్వలు ఉన్నాయని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మనుచౌదరి తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సోమవారం వరకు 773 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని తెలిపారు. రైతులకు ఇబ్బంది లేకుండా ప్రతి సేల్ కౌంటర్ వద్ద షామియానా, తాగు నీటి సౌకర్యం కల్పించాలన్నారు. ఉదయం 6.00 గంటల నుంచి కౌంటర్ వద్ద యూరియా సేల్స్ ప్రారంభించాలని తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో ఉన్న యూరియా నిల్వలు సాగుకు సరిపోతాయని, అవసరాన్ని బట్టి మరిన్ని సరఫరాలు కూడా క్రమం తప్పకుండా అందుతున్నాయని కలెక్టర్ రైతులకు భరోసానిచ్చారు. యూరియా పంపిణీపై సంబంధిత అధికారులు, వ్యవసాయ శాఖ సిబ్బంది నిరంతరం పర్యవేక్షణ చేపడుతున్నారని తెలిపారు. కృత్రిమ కొరత సృష్టించడం, అధిక ధరలకు విక్రయించడం వంటి అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. రైతులు ఎవరైనా యూరియా సరఫరాలో సమస్యలు ఎదుర్కొంటే సమీప వ్యవసాయ అధికారులను సంప్రదించాలని సూచించారు.

పేదరిక నిర్మూలనకు ప్రత్యేక ప్రణాళికలు

- తెలంగాణలో కేరళ మోడల్
- పేదలను గుర్తించడంలో మహిళా సంఘాలు భాగస్వాములు కావాలి
- ప్రజా భవన్‌లో జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షుల సమావేశంలో మంత్రి సీతక్క

విశాలాంధ్ర - హైదరాబాద్ : హైదరాబాద్ ప్రజా భవన్‌లో సోమవారం నిర్వహించిన జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షుల సమావేశంలో పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా సెర్ప్ ceo దివ్య దేవరాజన్‌తో కలిసి జిల్లాల వారిగా గత నెల రోజులపాటు మహిళా సంఘాలు, సమాఖ్యలు నిర్వహించిన కార్యకలాపాలను మంత్రి సీతక్క సమీక్షించారు. సమావేశంలో మంత్రి సీతక్క మాట్లాడుతూ, నూతన సంవత్సరంలో మహిళా స్వయం సహాయక బృందాలు నూతన లక్ష్యంతో, మరింత బాధ్యతాయుతంగా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. ఇప్పటివరకు మహిళా సంఘాలు తమను తాము అభివృద్ధి చేసుకుంటూ ముందుకు సాగాయని, ఇకపై వారి బాధ్యత మరింత పెరిగిందని తెలిపారు. కేరళ తరహాలో అత్యంత పేదరికంలో ఉన్న వారిని గుర్తించడంలో గ్రామ సమైక్య సంఘాలు కీలక పాత్ర పోషించాలని మంత్రి సూచించారు. అత్యంత పేదరికంలో ఉన్న 'పూరెస్ట్ ఆఫ్ ద పూర్'ను టార్గెట్‌గా గుర్తించి, వారిని ఆ స్థితి నుంచి బయటకు తీసుకురావడం ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రతి గ్రామంలో అత్యంత వెనుక బాటలో ఉన్న కుటుంబాలను గుర్తించి, వారి అవసరాలను అర్థం చేసుకొని ప్రభుత్వానికి నివేదిస్తే..టార్గెట్‌గా వారి అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతుందని స్పష్టం చేశారు. సంక్షేమ ఫలాలు ఇప్పటివరకు అందని చివరి వ్యక్తికి కూడా ప్రభుత్వ సహాయం చేరేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. 'మీ పరిసరాల్లో, మీ గ్రామాల్లో అత్యంత పేదరికంలో జీవిస్తున్న కుటుంబాలను గుర్తించి, వారికి ఏ అవసరాలు ఉన్నాయో తెలియజేస్తే ప్రభుత్వం తప్పకుండా వారిని ఆదుకుంటుంది' అని తెలిపారు. అత్యంత పేదరికంలో ఉన్న కుటుంబాలను గుర్తించేందుకోసం అవసరమైన ప్రొఫార్మాను త్వరలోనే అందజేస్తామని చెప్పారు. ఈ సందరర్గా కేరళలో అత్యంత పేదరికానీ నిర్మూలన ఎలా చేపట్టారో మహిళా సంఘాలకు మంత్రి సీతక్క వివరించారు. అక్కడ సర్వే ద్వారా 64,006 అత్యంత పేద కుటుంబాల్లో సుమారు లక్ష మంది తీవ్రమైన పేదరికంలో ఉన్నవారిగా గుర్తించారని చెప్పారు. ఆహారం, ఆరోగ్యం, జీవనోపాధి, గృహ నిర్మాణం వంటి అంశాలను ఆధారంగా తీసుకొని బతుకు కష్టంగా ఉన్న కుటుంబాలను అత్యంత పేదలుగా గుర్తించి, ప్రతి కుటుంబానికి వేర్వేరు అవసరాలున్నాయని, అందు కోసం ప్రత్యేక మైక్రో ప్లాన్‌లను రూపొందించారని, అదేవిధంగా తెలంగాణలో కూడా అత్యంత పేద కుటుంబాలను పేదరికం నుంచి బయటకు తీసుకొచ్చేందుకు మైక్రో ప్లాన్‌ను రూపొందిస్తామని చెప్పారు. పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ చొరవతో అన్ని ప్రభుత్వ విభాగాలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలను సమీకరించి ఈ లక్ష్యాన్ని కేరళ సాధించిందని.. అదే తరహాలో తెలంగాణలో మహిళా సంఘాలు ముందుకు వచ్చి అత్యంత పేదరిక నిర్మూలనలో భాగస్వాములు కావాలని ఆమె పిలుపునిచ్చారు. ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో సర్పంచులుగా ఎన్నికైన సూర్యాపేట, వనపర్తి జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు సరిత, స్వరూపలను మంత్రి సీతక్క సన్మానించారు. మహిళల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తున్న సెర్ప్ ను అభినందించారు. జిల్లా మహిళా సమాఖ్యలు ఏర్పాటు చేసిన నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొని కేక్ కట్ చేసి మహిళా సంఘ సభ్యులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

భూముల పరిరక్షణకు పకడ్బందీ చర్యలు: మంత్రి

విశాలాంధ్ర - హైదరాబాద్ : ప్రభుత్వ భూములు ప్రజల ఆస్తులని వాటి పరిరక్షణలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేదని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాలశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ప్రభుత్వ భూముల పరిరక్షణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సోమవారం సచివాలయంలోని తన కార్యాలయంలో సహచర మంత్రి మహ్మద్ అజారుద్దీన్, జూబ్లీ హిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్‌తో కలిసి జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఎన్నికల్లో ఇచ్చిన హామీలు, స్మశానవాటికలు తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో బోరబండ, ఎర్రగడ్డ, షేక్‌పేట్ ప్రాంతాల్లో దశాబ్దాలుగా మైనార్టీలు స్మశాన వాటికలు లేక ఇబ్బంది పడుతున్నారని ఈ సమస్యను వీలైనంత త్వరితగతిన రక్షణశాఖ, రెవెన్యూ, వక్ఫ్‌బోర్డ్ సమన్వయంతో అధిగమించాలని అధికారులకు సూచించారు. అవసరమైన చోట రెవెన్యూ భూమిని రక్షణశాఖకు బదలాయించి వారి నుంచి ప్రత్యామ్నాయంగా భూమి తీసుకోవాలని, రెవెన్యూ భూమిని వక్ఫ్ బోర్డుకు అప్పగించాలని సూచించారు. పేదల సంక్షేమం, ప్రజా అవసరాలు, అభివృద్ధి కార్యక్రమాల కోసం వినియోగించవలసిన ప్రభుత్వ భూములను కొద్దిమంది స్వార్థప్రయోజనాల కోసం కబ్జాపెట్టే ప్రయత్నాలు చేస్తుంటారని, ఇటువంటి వాటిని ఎట్టిపరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు. ఆక్రమణలను గుర్తించిన వెంటనే నోటీసులు జారీ చేసి అవసరమైతే ఖాళీ చేయించి ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలని వివాదాల్లో ఉన్న భూముల పరిరక్షణకు న్యాయపరంగా గట్టిగా వ్యవహరించాలని కలెక్టర్లకు సూచించారు. ఈ సమావేశంలో టీఎంఆర్ ఈఐఎస్ వైస్ ఛైర్మన్ ఫహీం ఖురేషి, మైనార్టీ సంక్షేమ శాఖ కార్యదర్శి బి. షఫీల్లాహ్, హైదరాబాద్, మేడ్చల్ కలెక్టర్లు పాల్గొన్నారు.

సమస్యలు సత్వరమే పరిష్కరించాలి : కలెక్టర్

విశాలాంధ్ర, హైదరాబాద్ : జిల్లాలోని వివిధ ప్రాంతాల ప్రజలు ప్రజావాణిలో అనేక సమస్యలపై అందచేసిన అర్జీలపై అధికారులు వెంటనే స్పందించి పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు కదిరవన్ పలని (రెవెన్యూ), జితేందర్ రెడ్డి (స్థానిక సంస్థలు), డిఆర్‌ఓ వెంకటాచారిలతో కలసి కలెక్టర్ ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ సమస్యలపై ప్రజలు అందజేసిన దరఖాస్తులను జిల్లా అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, వెంటనే పరిష్కరించేందుకు సంబంధిత శాఖల అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. అలాగే స్వీకరించిన దరఖాస్తులపై ఎండార్స్మెంట్ చేసి, సంబంధిత అధికారులకు అందజేశారు. దివ్యాంగులు, వయోవృద్ధుల వాట్సాప్ ద్వారా వచ్చే ఫిర్యాదులకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ పరిష్కరించాలని ఆమె సూచించారు.అలాగే జిల్లాలో నిర్వహిస్తున్న గ్రీవెన్స్‌లో వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, అవరమైతే క్షేత్రస్థాయిలో పర్యటించి, త్వరితగతిన పరిష్కరించాలన్నారు. అలాగే హైదరాబాద్ ప్రజా భవన్‌లో నిర్వహిస్తున్న ప్రజా దర్బార్ ద్వారా వచ్చిన దరఖాస్తులపై పురోగతిపై ఆమె సమీక్షించారు. పెండింగ్‌లో ఉన్న అర్జీలపై జాప్యం లేకుండా ప్రత్యేక దృష్టి సారించి వెంటనే పరిష్కరించి, సంబంధిత వెబ్సైట్‌లో అప్లోడ్ చేయాలని ఆమె తెలిపారు. సీఎం ప్రజా దర్బార్, జిల్లా ప్రజావాణి లో అలాగే దివ్యాంగులు, వయోవృద్ధులు వాట్సప్ ద్వారా వచ్చిన దరఖాస్తులలో ఏమైనా పెండింగ్లో ఉన్నట్లయితే ఈనెల 31లోపు తప్పనిసరిగా పరిష్కరించాలని ఆమె తెలిపారు. అదే విధంగా హౌసింగ్ శాఖ 190, (2బిహెచ్‌కె - 11, ఇందిరమ్మ ఇండ్లు 179), రెవెన్యూ 52, ఇతర శాఖలు 37 కలిపి మొత్తం 279 అర్జీలు అందాయని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పిడి హౌసింగ్ అశోక్ చక్రవర్తి, సికింద్రాబాద్ రెవెన్యూ డివిజనల్ అధికారి సాయిరాం, ముఖ్య ప్రణాళిక అధికారి డాక్టర్. సురేందర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటి, ఎస్సీ కార్పొరేషన్ ఈడి రమేష్, దివ్యాంగ శాఖ సహాయ సంచాలకులు రాజేందర్, స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ జ్యోతి, లా ఆఫీసర్ శ్రీధర్, జిల్లా సంక్షేమ శాఖ అధికారులు కోటాజి ఆశన్న, ఇలియస్ అహ్మద్, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ ప్రవీణ్ కుమార్, కలెక్టరేట్ ఇంచార్జ్ పరిపాలనాధికారి విజయ లక్ష్మి, వివిధ శాఖల జిల్లా అధికారులు, అర్జీదారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భద్రతా చర్యలపై సమీక్ష

- మంచి వాతావరణంలో వేడుకలు
- డ్రగ్స్ వినియోగం మీద ఉక్కు పాదం
- మైనర్లకు మద్యం అమ్మితే కఠిన చర్యలు
- నూతన సంవత్సర వేడుకల్లో ఔట్‌డోర్ ఈవెంట్లలో డీజేకు అనుమతి లేదు
- సీపీ సుధీర్ బాబు ఐపీఎస్

విశాలాంధ్ర, బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : నూతన సంవత్సర వేడుకల సందర్భంగా రాచకొండ పరిధిలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తీసుకోవాల్సిన భద్రతా చర్యల గురించి ఈ రోజు రాచకొండ కమిషనర్ సుధీర్ బాబు రాచకొండ పరిధిలోని పబ్‌లు, బార్లు, రెస్టారెంట్స్, ఫామ్ హౌస్‌లు, వైన్ షాపులు, ఈవెంట్ ఆర్గనైజేషన్ నిర్వాహకులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాచకొండ పరిధిలోని డీసీపీలు, అడిషనల్ డీసీపీలు, అన్ని పోలీస్ స్టేషన్ల ఇన్స్పెక్టర్లు కూడా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ మాట్లాడుతూ... ఇన్సిడెంట్ ఫ్రీ న్యూ ఇయర్‌గా జరుపుకోవాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఆ రోజు ఒక్క యాక్సిడెంట్ కూడా జరగకూడదు. ఏ ప్రాణం పోగుడదు, భూమిపై రక్తం చిందకూడదనీ కోరుకుంటున్న. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ప్రజలందరూ బాధ్యతాయుతంగా సహకరించాలని కోరారు. ఈ వేడుకలలో ప్రజలు, యువత ఎంతో ఉత్సాహంగా పాల్గొంటారని, కాబట్టి శాంతి భద్రతల సమస్య రాకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ట్రాఫిక్, ఎస్ఓటి, షి టీమ్స్, పెట్రోలింగ్ వంటి పోలీసు బృందాలు వేడుకల సందర్భంగా ఎటువంటి అవాంచనీయ సంఘటనలు, నేరాలు జరగకుండా విధుల్లో ఉంటారని పేర్కొన్నారు. ఔట్ డోర్ కార్యక్రమాలు జరిగే చోట డీజే బాక్సులకు అనుమతి లేదని, ఎటువంటి బాణసంచా కాల్చడానికి వీల్లేదని, పరిమితికి మించి ఈవెంట్‌లోకి ప్రేక్షకులను అనుమతించకూడదని పేర్కొన్నారు. మహిళలపై ఎటువంటి వేధింపులు జరగకుండా నిరోధించడానికి తమ షి టీమ్ బృందాలు విధుల్లో ఉంటారని పేర్కొన్నారు. న్యూ ఇయర్ వేడుకల్లో డ్రగ్స్ వినియోగాన్ని అరికట్టడానికి తమ బృందాలు తనిఖీలు చేస్తారని, నిషేధిత డ్రగ్స్ సరఫరా చేసే ముఠాల మీద ఉక్కుపాదం మోపుతున్నామని ఈ సందర్భంగా కమిషనర్ పేర్కొన్నారు. పబ్‌లు, బార్లు, వైన్ షాపులు నిర్దేశిత సమయంలోపు మూసి వేయాలని, మైనర్ యువతకు మద్యం అమ్మే దుకాణాలపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. వాహనాల పార్కింగ్‌కు సరైన ఏర్పాట్లు చేయాలని, షాపులు, పబ్‌లు, రెస్టారెంట్‌ల పరిసరాల్లో సీసీటీవీలు ఖచ్చితంగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నగర శివార్లలో ఉండే ఫామ్ హౌస్‌లలో ఏర్పాటు చేసే కార్యక్రమాలు కూడా నిబంధనలకు లోబడి ఉండాలని, ఎటువంటి డ్రగ్స్ వినియోగం జరగకూడదని, మహిళలతో అసభ్యకర డాన్స్ ప్రోగ్రామ్స్ నిర్వహించకూడదని పేర్కొన్నారు. రోడ్ల మీద ట్రాఫిక్ ఇబ్బందులు రాకుండా ట్రాఫిక్ సిబ్బంది జాగ్రత్తలు తీసుకోవాలని, డ్రంకెన్ డ్రైవింగ్ పరీక్షలు కట్టుదిట్టంగా అమలు చేయాలని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇచ్చే వాహన యజమానుల మీద కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అర్ధరాత్రి యువకులు నిర్లక్ష్యంగా అధిక వేగంతో వాహనాలు నడపకుండా, ఎటువంటి బైక్ రేసులు చేయకుండా ఉండేందుకు నిర్దేశిత సమయం పాటు తాత్కాలికంగా ఫ్లై ఓవర్ లను మూసివేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం డీసీపీ నారాయణ రెడ్డి ఐపీఎస్, ఎల్‌బి నగర్ డీసీపీ అనురాధ, మల్కాజిగిరి డీసీపీ సీహెచ్ శ్రీధర్, యాదాద్రి డీసీపీ ఆకాంక్ష్ యాదవ్, ఎస్ఓటి డీసీపీ రమణ రెడ్డి, డీసీపీ అడ్మిన్ ఇందిర, ఎస్బి డీసీపీ జి.నరసింహారెడ్డి, విమెన్ సేఫ్టీ డీసీపీ ఉషా రాణి, ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాస్, రోడ్ సేఫ్టీ డీసీపీ మనోహర్, డీసీపీ హెడ్ క్వార్టర్ శ్యామ్ సుందర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

హెచ్‌సిఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర- హైదరాబాద్ : హైదరాబాద్ సిటిజన్స్ ఫోరం (హెచ్.సి.ఎఫ్) ముద్రించిన 2026 క్యాలెండర్‌ను టూరిజం, సాంస్కృతిక శాఖామంత్రి జూపల్లి కృష్ణారావుఈరోజు రవీంద్ర భారతిలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ... హైదరాబాద్ సిటిజెన్స్ ఫోరం కార్యకర్తలకు, తెలంగాణ రాష్ట్ర ప్రజానీకానికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. 2026లో తెలంగాణ రాష్ట్ర ప్రజానీకానికి శుభం జరగాలని ఆకాంక్షించారు. హైదరాబాద్ సిటిజెన్స్ ఫోరం, హైదరాబాద్ జిందాబాద్ చేస్తున్న సేవా కార్యక్రమాలను అభినందించారు. హెచ్.సి.ఎఫ్ క్యాలెండర్‌లో హైదరాబాద్ నగరంలోని పర్యావరణ పరిరక్షణను ప్రబోధిస్తూ ప్రధాన చెరువులు, నదీ జలాలతో కూడిన ఫోటోలతో ఆకర్షనీయంగా ముద్రించారు. ఈ క్యాలెండర్ ఆవి ష్కరణ కార్యక్రమంలో హెచ్.సి.ఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు ఎం.శ్రీనివాసరావు, కె వీరయ్య, సలహాదారులు సామాజికవేత్త రాజీవ్, ఉపాధ్యక్షులు పి.శ్రీనివాసరావు, కె.రమేష్, శంకరయ్య, సుకుమార్, గోపాల్‌లు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధచూపాలి : కమిషనర్

విశాలాంధ్ర, హైదరాబాద్ : గ్రేటర్ హైదరాబాద్ నగరంలో పారిశుధ్యంపై మరింతగా మెరుగుపరచదానికి జోనల్, డిప్యూటీ కమిషనర్లు ప్రత్యేకశ్రద్ధ చూపాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ ఆదేశించారు. సోమవారం నుంచి గ్రేటర్ హైదరాబాద్ వ్యాప్తంగా జీహెచ్‌ఎంసీ ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం ప్రారంభమైంది. తొలి రోజు నగర వ్యాప్తంగా ఉన్న ఫుట్ ఓవర్ బ్రిడ్జి క్లీనింగ్ జీహెచ్‌ఎంసీ ప్రత్యేక దృష్టి పెట్టి క్లీనింగ్ చేపట్టింది. క్షేత్రస్థాయిలో సానిటేషన్ ప్రత్యేక డ్రైవ్‌ను జోనల్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లు మానిటర్ చేశారు. కిస్మత్ పూర్, నార్సింగి, సన్ సిటీలలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం కమిషనర్ ఆర్ వి కర్ణన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. క్షేత్రస్థాయిలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంను ప్రభావవంతంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. రానున్న రోజుల్లో ఫ్లై ఓవర్లు,రోడ్డు పక్కలు, డివైడర్లు, సెంట్రల్ మీడియన్లు, కర్బ్ స్టోన్లు,చెరువులు, నాలాలు, ఫుట్‌పాత్‌లు, పార్కులు, నిర్మాణ-కూల్చివేత, వ్యర్థాల తొలగింపు, ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాల వద్ద పేరుకుపోయిన చెత్త తొలగింపు వంటి కార్యక్రమాలు షెడ్యూల్ ప్రకారం పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు.

'దివ్యాంగుల హక్కుల చట్టాన్ని' అమలు చేయాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : అణగారిన వర్గాల గొంతుకగా, దివ్యాంగుల ఆశల వారధిగా డాక్టర్ శ్రవణ్ దాసోజు శాసన మండలిలో మండిపడ్డారు. 2016 నాటి 'దివ్యాంగుల హక్కుల చట్టాన్ని' కేవలం కాగితాలకే పరిమితం చేయకుండా, క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయిలో అమలు చేయాలని ఆయన ముఖ్యమంత్రిని మనస్ఫూర్తిగా కోరారు. ప్రభుత్వం ఉన్నత విద్యలో 5శాతం రిజర్వేషన్లు ఇస్తూ తీసుకున్న నిర్ణయం మంచిదే అయినా, అది ఆరంభం మాత్రమేనని.. వేలాది కుటుంబాల కన్నీళ్లు తుడవాలంటే ఇంకా ఎంతో చేయాల్సి ఉందంటూ ఆయన భావోద్వేగంతో ప్రసంగించారు.'నేడు దివ్యాంగుల పరిస్థితి చూస్తుంటే గుండె తరుక్కుపోతోంది' అని డాక్టర్ దాసోజు ఆవేదన వ్యక్తం చేశారు. కనీస హక్కుల కోసం తల్లిదండ్రులు ఆఫీసుల చుట్టూ కాళ్లు అరిగేలా తిరుగుతున్నారని గుర్తు చేశారు. ఆటిజం, పక్షవాతం వంటి 21 రకాల వైకల్యాల గురించి అవగాహన లేక, సరైన పరీక్షా కేంద్రాలు లేక సామాన్య, మధ్యతరగతి కుటుంబాలు ప్రైవేట్ సెంటర్ల చేతిలో మోసపోతూ ఆర్థికంగా చితికిపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

మానవీయ కోణంలో మార్పు కోసం సూచనలు

నేడు మండలి వేదికగా డాక్టర్ శ్రవణ్ దాసోజు ప్రభుత్వం ముందు కొన్ని కీలకమైన, ఆచరణాత్మకమైన ప్రతిపాదనలు ఉంచారు. కేవలం ఉన్నత విద్యలోనే కాదు.. ఎల్.కె.జి నుంచే ప్రైవేట్, ప్రభుత్వ స్కూళ్లలో 5శాతం సీట్లు దివ్యాంగులకు ఉచితంగా కేటాయించాలన్నారు. ప్రైవేట్ సెంటర్లలో వేల రూపాయలు ఖర్చు చేయలేని పేదల కోసం ప్రతి ప్రాంతంలో ప్రభుత్వ నిధులతో 'థెరపీ సెంటర్లు' ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి పాఠశాలలో ఒక సైకాలజిస్ట్, స్పెషల్ ఎడ్యుకేటర్ ఉండాలని, అప్పుడే చిన్నప్పుడే లోపాలను గుర్తించి పిల్లలను సరిదిద్దే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. పేదరికం వల్ల ఏ ఒక్క దివ్యాంగ బిడ్డ చదువు ఆగకూడదు.

అభివృద్ధి పనులపై సీఎంను కలిసిన గాంధీ

విశాలాంధ్ర శేరిలింగంపల్లి: అసెంబ్లీ శీతాకాల సమావేశం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని వారి ఛాంబర్ లో శేరిలింగంపల్లి నియోజకవర్గంలో నెలకొన్న పలు సమస్యలు, చేపట్టవలసిన పలు అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌తో మర్యాదపూర్వకంగా కలిసి పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ వివరించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ కొత్త సంవత్సరం జనవరి మాసంలో మియాపూర్ చౌరస్తా ఫ్లై ఓవర్ శంకుస్థాపన కార్యక్రమంను మీ చేతుల మీదుగా చేయాలని, శంకుస్థాపన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రావాల్సిందిగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరడం జరిగినది అని, దీనికి ముఖ్యమంత్రి రేవంత్‌రెండ్డి సానుకూలంగా స్పందించడం జరిగిందన్నారు. త్వరలోనే మియాపూర్ చౌరస్తా ఫ్లై ఓవర్ శంకుస్థాపన చేసుకొని ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని, ట్రాఫిక్ రహిత సమాజం కోసం కృషి చేస్తామన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో నెలకొన్న పలు సమస్యలు మరియు చేపట్టవలసిన అభివృద్ధి పనుల పై ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారి దృష్టికి తీసుకువెళ్లడం జరిగినది అని, శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేయాలని ,నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని ముఖ్యమంత్రిని కోరడం జరిగిందన్నారు. పై అంశాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించారన్నారు.

ప్రీ-మెట్రిక్ ఉపకారవేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం

విశాలాంధ్ర, హైదరాబాద్ : ప్రీ మెట్రిక్ ఉపకారవేతనాలకై కింద బీసీ కులాలకు చెందిన 9 మరియు 10వ తరగతి విద్యార్థుల నుండి 2025-26 సం.నికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు బీసీ సంక్షేమ శాఖ ఉపసంచాలకులు, జి. ఆశన్న ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో 9 మరియు 10వ తరగతి చదువుచున్న బీసీ విద్యార్థులు డిసెంబర్ 31 లోపు https://telanganaepass.cgg.gov.in వెబ్సైటు ద్వారా దరఖాస్తు చేసుకోగలరని తెలిపారు. అర్హత, మెరిట్ ప్రకారం ప్రతి విద్యార్థికి సం.నికి రూ.4000 మంజూరు చేయబడునని తెలిపారు. విద్యార్థికి సంబందించిన ఆధార్ కార్డు, కుల, ఆదాయం (గ్రామీణ ప్రాంతానికి చెందిన వారి సం. ఆదాయము రూ.1.50లక్షలు, పట్టణ ప్రాంతం ప్రాంతానికి చెందిన వారి సంవత్సర ఆదాయము రూ.2 లక్షలోపు ఆదాయం ఉండాలి), పాస్ పోర్ట్ సైజు ఫోటో, బ్యాంకు పాసుబుక్ కాపీ, స్టడీ సర్టిఫికెట్. దరఖాస్తు చేసుకున్న తదుపరి హార్డ్‌కాపీలు, ధృవీకరణ పాత్రలను జతపరిచి హైదరాబాద్ జిల్లా కలెక్టరేటులోని ఉపసంచాకులు, బిసి సంక్షేమ శాఖ ఆఫీస్ లో లేదా ఏదైనా బిసి వసతి గృహ సంరక్షకులు (HWO)కి నేరుగా అందించాలని ఒక ప్రకటనలో తెలిపారు.

గ్రామాభివృద్ధికి కృషి చెయ్యండి : కావలి

విశాలాంధ్ర-దుండిగల్: దుండిగల్ గ్రామం అభివృద్ధికి కృషి చేయాలని ఉమ్మడి కుత్బుల్లాపూర్ మండల సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షులు,దుండిగల్ మాజీ సర్పంచ్ కావలి గణేష్ పేర్కొన్నారు.కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధి దుండిగల్ సర్కిల్ నూతన డిప్యూటీ కమిషనర్‌గా వెంకటేష్ నాయక్ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా సోమవారం దుండిగల్ మాజీ సర్పంచ్ కావలి గణేష్ సర్కిల్ కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కావాలి గణేష్ మాట్లాడుతూ దుండిగల్ సర్కిల్ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించాలని, ఓఆర్ఆర్ నుంచి దుండిగల్ గ్రామం వరకు రాత్రి వేళల్లో సరైన వెలుతురు లేకపోవడంతో పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని,వెంటనే స్ట్రీట్ లైట్లు ఏర్పాటు చేయాలని కోరారు. అదేవిధంగా రోడ్ల మరమ్మతులు, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదల, పారిశుధ్య నిర్వహణ, ఇతర మౌలిక వసతుల అభివృద్ధిపై చర్చించి వినతి పత్రం అందజేశారు. ఈ విధంగా డిప్యూటీ కమిషనర్ వెంకటేష్ నాయక్ స్పందించి ప్రజా సమస్యలను ప్రాధాన్యతగా తీసుకొని పరిశీలించి,సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకొని తగిన చర్యలు తీసుకుంటామని వారికీ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జక్కుల గోపాల్ యాదవ్, పండుగ శ్రీశైలం ముదిరాజ్,సిరగల్ల బాబు,వాపుల శ్రీనివాస్,డొంతి మహేష్ ముదిరాజ్,చెట్లపల్లి దత్తు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

విశాలాంధ్ర, మల్కాజిగిరి : ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ పరిధిలోని జోహార్ నగర్‌లో స్థానికుల పిలుపు మేరకు కార్పొరేటర్ వై.ప్రేమ్ కుమార్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆంజనేయ స్వామి ఆలయంలో షెడ్ ఏర్పాటు చేయాలని, పెండింగ్‌లో ఉన్న రోడ్లు, డ్రైనేజీ పనులు పూర్తి చేయాలని కాలనీల వాసులు కార్పొరేటర్‌ను కోరారు. దీనిపై స్పందించిన కార్పొరేటర్ ప్రేం కుమార్ మాట్లాడుతూ...ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పని చేయనున్నట్లు ఆయన తెలిపారు. ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాలను కల్పించేలా చర్యలు తీసుకోనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు నారాయణ, మల్లేష్, పల్లె విజయ కుమారి, కిశోర్, అశోక్ పాల్గొన్నారు.

జిల్లా కాంగ్రెస్ కమిటీ పదవులకు దరఖాస్తులు

విశాలాంధ్ర - హైదరాబాద్ : మహబూబ్ నగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ పదవులకు దరఖాస్తులు పోటెత్తాయి. మంగళవారం చివరి తేదీ కావడంతో చాలా మంది ఆయా పదవులకు దరఖాస్తులు చేసుకున్నారు. డీసీసీ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్ పార్టీ కార్యాలయంలో పలువురి నుంచి దరఖాస్తులను స్వీకరించారు. జిల్లాలోని ప్రతి బ్లాక్‌కు ఒక జిల్లా ఉపాధ్యక్ష పదవి, బ్లాక్‌కు రెండు ప్రధాన కార్యదర్శులు, ప్రతి మండలానికి ఒక కార్యదర్శి, జిల్లా కోశాధికారి, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఒక అధికార ప్రతినిధి, అదే విధంగా మున్సిపల్ కార్పొరేషన్ లేదా మున్సిపాలిటీ పరిధిలో ప్రతి 10 డివిజన్లకు ఒక ప్రధాన కార్యదర్శి, ఐదు డివిజన్లకు ఒక కార్యదర్శి పదవులతోపాటు జిల్లా కార్యవర్గంలో గరిష్టంగా 15 మందిని కార్యవర్గ సభ్యులుగా నియమించనున్నారు. ఈనెల 31లోపు లేదా జనవరి మొదటి వారంలో జిల్లా కమిటీ కార్యవర్గం ప్రకటించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

విద్యార్థులకు సీడీకే చేయూత

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఆటోమొబైల్ రిటైల్ సాఫ్ట్‌వేర్‌లో ముందున్న సంస్థ సీడీకే, ఇటీవల కొంపల్లిలోని జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులతో సంభాషించింది. ఈ సందర్భంగా సీడీకే ఉద్యోగులు అణగారిన వర్గాల పిల్లలతో కలిసి మాట్లాడారు. 500కు పైగా అమ్మాయిలకు పరిశుభ్రతా కిట్‌లు, ప్రతి విద్యార్థికి 325 స్కూల్ కిట్‌లను పంపిణీ చేశారు. ఆరోగ్యం. విద్య అందుబాటులో ఉండటం అనేది సామాజిక పురోగతికి అత్యంత శక్తివంతమైన చోదక శక్తులలో ఒకటి. స్థిరమైన అభివృద్ధికి ఇది మూలస్తంభం. స్థానిక కమ్యూనిటీలకు మద్దతు ఇవ్వడంలో, సమాజంలోని వెనుకబడిన వర్గాలకు అవసరమైన పాఠశాల మౌలిక సదుపాయాలను అందించడంలో మా వంతు కృషి చేస్తున్నాం. ఇందుకు మేము గర్విస్తున్నామని సీడీకే మేనేజింగ్ డైరెక్టర్ సందీప్ జైన్ పేర్కొన్నారు. కొంపల్లిలోని జిల్లా పరిషత్ హైస్కూల్ చుట్టుపక్కల కమ్యూనిటీల నుండి వచ్చే పిల్లలకు సేవలు అందిస్తోందన్నారు. వీరిలో చాలా మంది ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, ఇలాంటి అనేక ప్రాంతాలలో, నాణ్యమైన విద్య. ప్రాథమిక అభ్యాస సామగ్రి అందుబాటు పరిమితంగా ఉందని పేర్కొన్నారు. ఈ లోపాన్ని తగ్గించడానికి మరియు విద్యార్థులను వారి లక్ష్యాలను సాధించడానికి శక్తివంతం చేయడానికి సీడీకే లక్ష్యంగా పెట్టుకుందని చెప్పారు.

నేడు సామూహిక విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం

విశాలాంధ్ర, మల్కాజిగిరి : వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా ఆనంద్‌బాగ్ బృందావన్ గార్డెన్‌లో మంగళవారం 3333 మంది భక్తులచే సుమారు 4 కోట్ల నామ జపం (సామూహిక విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం) జరుగుతుందని నిర్వాహకులు గోన సన్నెల్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. గత మూడు సంవత్సరాలుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, మంగళవారం ఉదయం సుప్రభాత సేవ, తోమాల సేవ, అర్చన, ఊంజల్ సేవ, కళ్యాణోత్సవము, పవళింపు సేవతో పూజా కార్యక్రమాలు ముగుస్తాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో కుటుంబ సమేతంగా పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాల్సిందిగా భక్తులను కోరారు.

యువ ప్రతిభకు పట్టం

- 'బతుకమ్మ యంగ్ ఫిలిం మేకర్స్ ఛాలెంజ్ 2025'
- రవీంద్రభారతిలో ఘనంగా అవార్డుల ప్రదానోత్సవం

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'బతుకమ్మ యంగ్ ఫిలిం మేకర్స్ ఛాలెంజ్ 2025' అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం సోమవారం ఉదయం 10 గంటలకు రవీంద్రభారతి మెయిన్ ఆడిటోరియంలో జరిగింది. ఈ కార్యక్రమానికి సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పర్యాటక- శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎఫ్.డి.సి ఛైర్మన్ దిల్ రాజు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రజా పాలన ప్రారంభమైన నాటి నుంచి ప్రభుత్వం అమలు చేస్తోన్న వివిధ సంక్షేమ పథకాలపై షార్ట్ ఫిలిమ్స్ తోపాటు పాటలను పంపించారు. ఎంపికైన ఉత్తమ ఫిల్మ్‌లకు, పాటలకు ముఖ్య అతిథుల చేతులమీదుగా నగదు బహుమతులు, సర్టిఫికెట్స్ అందజేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ "ఈ రోజు నిజంగా తెలంగాణ గర్వించదగ్గ రోజని, మన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని 'ప్రజా ప్రభుత్వం' దేశంలోనే ఎక్కడా లేని విధంగా ఒక అద్భుతమైన ప్రయోగానికి శ్రీకారం చుట్టిందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి గడపకూ ఎలా చేరుతున్నాయో ప్రపంచానికి చాటిచెప్పే బాధ్యతను మన యువ ఫిల్మ్ మేకర్ల చేతుల్లో పెట్టిందని వివరించారు. తెలంగాణ ఫిల్మ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ నిర్వహించిన ఈ 'బతుకమ్మ యంగ్ ఫిల్మ్ మేకర్స్ ఛాలెంజ్' కేవలం ఒక పోటీ మాత్రమే కాదని, ఇది మన యువత మేధస్సుకు, సృజనాత్మకతకు ఒక గొప్ప వేదికగా అభివర్ణించారు. రాష్ట్రం నలుమూలల నుంచి ముఖ్యంగా మారుమూల గ్రామాల నుండి వచ్చిన ఎంట్రీలను చూస్తుంటే నాకు చాలా సంతోషంగా ఉందన్నారు. మీరంతా ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య ఒక చైతన్యవంతమైన వారధిలా నిలిచారన్నారు. పల్లెల్లో ఉన్న అపారమైన ప్రతిభను ఈ వేదిక ద్వారా ప్రపంచానికి పరిచయం చేయడం నాకు ఎంతో గర్వకారణమని పేర్కొన్నారు. ఈ పోటీలో పాల్గొన్న ప్రతి ఒక్క యంగ్ ఫిల్మ్ మేకర్ కు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. గెలుపొందిన విజేతలకు నా ప్రత్యేక అభినందనలు. మీ ప్రయాణం ఇక్కడితో ఆగిపోకూడదు.. తెలంగాణ భవిష్యత్తును మీ కళాత్మక దృష్టితో మరింత గొప్పగా తీర్చిదిద్దాలని కోరుకుంటున్నాను" అన్నారు. పర్యాటక- శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ "తెలంగాణ అంటేనే వీరత్వానికి, కళలకు పుట్టినిల్లు అని, మన సంస్కృతిని ప్రపంచానికి చాటిచెప్పే గొప్ప బాధ్యత యువత చేతుల్లో ఉందని నేను నమ్ముతున్నాను. మన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని 'ప్రజా ప్రభుత్వం' అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు సామాన్యుడి జీవితాల్లో ఎలాంటి మార్పులు తెస్తున్నాయో మీ కెమెరా కంటితో చూపించడం నిజంగా అభినందనీయమన్నారు. ఈ 'బతుకమ్మ యంగ్ ఫిల్మ్ మేకర్స్ ఛాలెంజ్' అనేది కేవలం ఒక పోటీ మాత్రమే కాదు, ఇది మన పల్లెల్లో ఉన్న అపారమైన ప్రతిభను వెలికితీసే ఒక గొప్ప వేదిక అని తెలిపారు. పర్యాటక, సాంస్కృతిక శాఖా మంత్రిగా, మన రాష్ట్ర అస్తిత్వాన్ని, బతుకమ్మ పండుగ వైభవాన్ని మీ లఘు చిత్రాల ద్వారా ప్రపంచవ్యాప్తం చేయడం చూస్తుంటే నాకు చాలా గర్వంగా అనిపిస్తోందని పేర్కొన్నారు. మీరంతా కేవలం ఫిల్మ్ మేకర్లు మాత్రమే కాదు, ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య ఒక చైతన్యవంతమైన వారధిగా నిలిచారు. క్షేత్రస్థాయిలో ప్రభుత్వం అందిస్తున్న పథకాలు ప్రజలకు ఏ విధంగా చేరుతున్నాయో మీరు మీ సృజనాత్మకతతో కళ్ళకు కట్టినట్లు చూపించారు. విజేతలుగా నిలిచిన వారందరికీ నా ప్రత్యేక అభినందనలు తెలియజేస్తూ, పాల్గొన్న ప్రతి ఒక్క యువ దర్శకుడు భవిష్యత్తులో తెలంగాణ సినిమా కీర్తిని మరింత ఎత్తుకు తీసుకెళ్లాలని ఆకాంక్షిస్తున్నానని తెలిపారు. కళాకారులను వారి సృజనాత్మకతను గౌరవించే విషయంలో మన ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందని హామీ ఇస్తున్నాను" అన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్.డి.సి ఎండీ ప్రియాంక, ప్రముఖ దర్శకులు దశరథ్, హరీష్ శంకర్, నటులు తనికెళ్ళ భరణి, సినిమాటోగ్రాఫర్ పిజి విందా, నిర్మాత-నటులు అశోక్ కుమార్, సింగర్స్ రాహుల్ సిప్లిగంజ్, మంగ్లీ, మోహన భోగరాజు, సంగీత దర్శకుడు చరణ్ అర్జున్, సినిమా క్రిటిక్ అయినంపూడి శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ అక్రిడిటేషన్ ఇవ్వాలని వినతి

విశాలాంధ్ర - హైదరాబాద్ : గ్రేటర్ హైదరాబాద్ పనిచేస్తున్న జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు వచ్చే విధంగా జీవోలో సవరింపులు చేపట్టాలని కోరుతూ టియుడబ్ల్యూ జే (ఐజెయు) బృందం సమాచార శాఖ కమిషనర్‌కు విజ్ఞప్తి చేసింది. సోమవారం సచివాలయంలోని ఐఅండ్ పిఆర్ కార్యాలయంలో ప్రత్యేక కమిషనర్ ప్రియాంకను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా టియుడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి కే శ్రీకాంత్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాజేష్, హెచ్ యు జె అధ్యక్షులు శిగా శంకర్, మేడ్చల్ అధ్యక్షులు గడ్డమీది బాలరాజు, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు సలీం పాషా, మేడ్చల్ కార్యదర్శి వెంకట్ రాం రెడ్డి, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి మేకల సత్యనారాయణలు సమస్యను ఆమెకు వివరించారు. గ్రేటర్ పరిధిలోని అర్బన్ మండలాలలో ప్రధాన పత్రికలలో నలుగురు నుంచి ఐదుగురు జర్నలిస్టులు విధులు నిర్వహిస్తున్నారని ఆమెకు తెలిపారు. నూతన జీవో 252 ద్వారా ఒక పత్రికకు మండలానికి ఒకే అక్రిడిటేషన్ పొందే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. మిగిలిన ముగ్గురు నలుగురికి అక్రిడిటేషన్ అవకాశం కోల్పోయే ప్రమాదం ఉందని తెలిపారు. రూరల్ మండలాలతో కాకుండా అర్బన్ మండలాలను ప్రత్యేకంగా చూడాలని ఆమెకు విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టుల ఆవేదనలు దృష్టిలో ఉంచుకొని జీవోలో సవరణలు చేసి న్యాయం చేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన కమిషనర్....

గ్రేటర్ పరిధిలోని మండలాల్లో పనిచేస్తున్న జర్నలిస్టుల సమస్య పై పౌర సంబంధాలు అండ్ సమాచార శాఖ కమిషనర్ ప్రియాంక సానుకూలంగా స్పందించారు. అర్బన్ మండలాలలో పనిచేస్తున్న అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ లు ఇవ్వడం న్యాయ బద్ధమైనదని తెలిపారు. త్వరలోనే మంత్రితో చర్చించి తగు నిర్ణయం తీసుకుంటామని హామీని ఇచ్చారు.

ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి : కలెక్టర్

విశాలాంధ్ర - రంగారెడ్డి: ప్రజల నుండి వచ్చే పిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి అన్నారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించినప్రజావాణి కార్యక్రమానికి (40) ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డికి విన్న విస్తూ అర్జీలు సమర్పించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధితశాఖల జిల్లా అధికారులు తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలనుపెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పరిష్కరించాలనిఅధికారులను ఆదేశించారు.రెవెన్యూ శాఖ- 21, ఇతర శాఖలు - 19, మొత్తం 40 దరఖస్తులు అందాయి.ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో యూరియా కొరత లేదు

రంగారెడ్డి జిల్లాలో యూరియా కొరత లేదని జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని జిల్లా వ్యాప్తంగా యూరియా సరఫరా పూర్తిస్థాయి లో కొనసాగుతోందని తెలిపారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో పనిచేస్తున్న అన్ని యూరియా పంపిణీ కేంద్రాలకు అవసరమైనంత స్టాక్ అందుబాటులో ఉందని పేర్కొన్నారు.రైతులకు సౌకర్యవంతంగా, క్రమబద్ధంగా యూరియా పంపిణీ జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. అలాగే రైతులకు స్పష్టంగా కనిపించే విధంగా స్టాక్ బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. విక్రయ కేంద్రాలకు యూరియా సరఫరా తగినంతగా ఉండేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని, ఎక్కడా అంతరాయం లేకుండా స్టాక్‌ను అందుబాటులో ఉంచాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. యూరియా పంపిణీలో ఎలాంటి అవకతవకలు జరగకుండా పర్యవేక్షణ మరింత కట్టుదిట్టంగా చేపడతామని తెలిపారు.

విశ్వ సంఘ్ శిబిర్ అంతర్జాతీయ సమ్మేళనం

విశాలాంధ్ర-దుండిగల్:రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ సంస్థ ప్రపంచంలోనే పెద్దదని దుండిగల్ మున్సిపల్ బిజెపి అధ్యక్షులు పిసరి కృష్ణారెడ్డి పేర్కొన్నారు. సోమవారం శంషాబాద్ రామచంద్ర మిషన్ కాన్హాశాంతి వనంలో ఆర్ఎస్ఎస్ విశ్వసంఘ శిబిర్ -2025 సార్వజనిక కార్యక్రమంలో బౌరంపేట్ రాష్ట్రీయ స్వయం సేవక్ సంగ్ సభ్యుల కుటుంబాలతో పాటు సహ-సంస్థాపకుడు,ఎగ్జిక్యూటివ్ చైర్మన్,భారత్ బయోటెక్ డా.కృష్ణ ఎల్లా కమలేశ్,పటేల్ అధ్యక్షులు, ఆధ్యాత్మిక మార్గదర్శి,రామచంద్ర మిషన్, ప్రధాన మార్గదర్శనం పూజనీయ సర్ సంఘచాలక్ డా. మోహన్ భాగవత్ జీ ధర్మం,సంస్కృతి,సేవ,సంఘటన వంటి శాశ్వత విలువలను ప్రతిబింబించే కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. విశ్వసంఘ్ శిబిర్ అనేది ప్రపంచవ్యాప్తంగా ఉన్న హిందూ ఘటన కార్యకర్తలను ఒకే వేదికపైకి తీసుకొచ్చే అంతర్జాతీయ సమ్మేళనం. 1990 నుంచి ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి నిర్వహించబడుతున్న ఈ ప్రతిష్టాత్మక శిబిర్, హిందూ స్వయంసేవక్ సంఘ్,వరల్డ్ హిందూ కౌన్సిల్, సేవా ఇంటర్నేషనల్,సంస్కృత భారతి వంటి అనేక సంస్థల మధ్య పరస్పర అనుసంధానం, చర్చలు,అనుభవాల పంచుకోలు సాధించే ముఖ్యమైన వేదికగా నిలుస్తోంది. ఈ సందర్భంగా బీజేపీ దుండిగల్ మున్సిపల్ అధ్యక్షులు పీసరి కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఈ యొక్క కార్యక్రమంలో కుటుంబం, బౌరంపేట్ స్వయంసేవక్ సభ్యులతో కలిసి పాల్గొనడం సంతోషంగా ఉందని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం గురించి 71 దేశాల నుంచి 1600కు మించి హిందూ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారని,సనాతన ధర్మ రక్షణ కోసం సర్వం త్యాగం చేసిన వారందరిని ఒకే వేదికపై ప్రత్యక్షంగా చూడడం అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు.ఈ శిబిర్‌లో విజ్ఞానాత్మక ప్రదర్శనలు సాంస్కృతిక కార్యక్రమాలు దేశాల వారీగా చర్చా వేదికలు నిర్వహించారు.ఇవన్నీ మానవ సమాజానికి మేలు చేసే విశాల దృష్టిని పెంపొందిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో బౌరంపేట్ మాజీ కౌన్సిలర్ పీసరి బాలమణి కృష్ణా?రెడ్డి,మాజీ ఎంపీటీసీ సభ్యులు జంగారెడ్డి,మాజీ ఉప సర్పంచ్ గోనె అనితా అనంతరెడ్డి, బీజేపీ నాయకులు దమ్మగారి సీతారాంరెడ్డి,నర్సింహాచారీ, కృష?మోహన్ రెడ్డి,ఆర్ఎస్ఎస్ కుటుంబ సభ్యులు కమ్మరి రమేష్ చారి,శ్రీపాల్ రెడ్డి,శ్రీనివాస్ రెడ్డి,నరేందర్ రెడ్డి, బాలకృష్ణ,భద్రయ్య ఆదిలక్ష్మి,అరుంధతి,హేమంత్ కుమార్ పాల్గొన్నారు.

ఎంజీఆర్‌కు డాక్టరేట్

విశాలాంధ్ర, హైదరాబాద్ : ఎంపిక చేసిన కంపెనీలపై దృష్టి సారించి, సంస్థాగత వ్యూహాలను రూపొందించడం, వ్యాపార ఫలితాలను మెరుగుపరచ డంలో హెచ్‌ఆర్ అనలిటిక్స్ , టెక్నాలజీతో పరివర్తన పాత్రను అన్వేషిస్తుంది. ఈ అధ్యయనం మానవ వనరుల నిర్వహణ మరియు వ్యాపార వ్యూహ రంగానికి గణనీయంగా దోహదపడుతుంది, డేటా ఆధారిత హెచ్‌ఆర్ పద్ధతులు కార్పొరేట్ లక్ష్యాలతో ఎలా సమలేఖనం అవుతాయో అంతర్దృష్టులను అందించే ఈ పరిశోధనకు గాను మద్దెల గౌడ్ రాంచందర్ అభిమానంగా పిలువబడే డాక్టర్ ఎంజిఆర్‌కు ఈ నెల12న ఉస్మానియా విశ్వవిద్యాలయం అధికారికంగా డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ (పిహెచ్‌డి.) డిగ్రీని ప్రదానం చేసినట్లు ఉస్మానియా విశ్వవిద్యాలయం పరీక్షల అదనపు కంట్రోలర్ ప్రకటించారు. ఈ పరిశోధన ఉస్మానియా కాలేజ్ ఆఫ్ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్‌కు చెందిన ఎమెరిటస్ ప్రొఫెసర్ విద్యాధర్ రెడ్డి పర్యవేక్షణలో జరిగింది. ఎంజిఆర్ 1998-2000లో కాకతీయ విశ్వవిద్యాలయం నుండి హెచ్‌ఆర్‌ఎంలో మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేశారు. చెన్నై ఆధారిత ఐటీ కంపెనీలో తన కెరీర్‌ను ప్రారంభించారు. భారతదేశంలోని అతిపెద్ద కంపెనీ రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ మరియు రిలయన్స్ రిటైల్ లిమిటెడ్‌లో కూడా జిఎం హెచ్‌ఆర్ (స్ట్రాటజిక్ హెచ్‌ఆర్ అండ్ టాలెంట్ మేనేజ్‌మెంట్) నుంచి సీనియర్ హెచ్‌ఆర్ నాయకత్వ పాత్రలను సైతం నిర్వహించారు.అనేక ప్రముఖ సంస్థలు అయినటువంటి నాగార్జున కన్స్ట్రక్షన్స్ కంపెనీలో, అభిజిత్ గ్రూప్, ఐవిఆర్ సిఎల్ లిమిటెడ్, ఫుడ్ మింగో, సి.కె బిర్లా గ్రూప్ ఓరియంట్ సిమెంట్ లిమిటెడ్, గ్రూప్ సి.హెచ్.ఆర్.ఓ పవర్‌మెక్ ప్రాజెక్ట్స్ లిమిటెడ్, ఫ్రెంచ్ ఎంఎన్‌సి కియోలిస్ హైదరాబాద్ ఎంఆర్‌టిఎస్, ధనుష్ హెల్త్ కేర్ గ్రూప్ సిహెచ్‌ఆర్‌ఓగా బాధ్యతలు నిర్వర్తించి ఇప్పుడు కెర్మ్ ఆటోమేషన్ , గేర్ నెక్స్ట్ అండ్ కేర్ క్యు హెల్త్ కేర్ లో గ్రూప్ సిహెచ్‌ఆర్‌ఓగా కూడా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు . టి-హబ్‌లో మల్టీ స్టార్ట్-అప్‌లకు, వరంగల్‌లోని ఎస్.ఆర్. విశ్వవిద్యాలయంలో ఎస్.ఆర్. ఇన్నోవేషన్ ఎక్స్ఛేంజ్‌కు మెంటర్, కోచ్‌గా చేశారు. ఎన్‌హెచ్‌ఆర్‌డి నెట్‌వర్క్ (2007-09, 2011-13)కు రెండుసార్లు జాతీయ బోర్డు సభ్యుడుగా ఎన్నికయ్యారు. (నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ పర్సనల్ మేనేజ్‌మెంట్) వైస్ ఛైర్మన్ (2016-2018) కార్యదర్శి (2018-2023)గా విధులు నిర్వహించారు. ప్రస్తుతం ఇండియన్ ఇండస్ట్రియల్ రిలేషన్స్ అసోసియేషన్, సౌత్ ఇండియా చాప్టర్ వ్యవస్థాపక కార్యదర్శి గా ఉన్నారు. తెలంగాణ టిపిఓ అసోసియేషన్, ఆల్ ఇండియా టిపిఓ అసోసియేషన్‌కు చీఫ్ మెంటర్‌గా పనిచేస్తున్నారు, సంస్థలలో శిక్షణ అండ్ ప్లేస్‌మెంట్ అధికారులకు మార్గనిర్దేశం చేస్తారు. ఈ విశిష్ట విద్యావిషయక విజయానికి ఉస్మానియా విశ్వవిద్యాలయం డాక్టర్ ఎంజిఆర్‌ను అభినందించింది. తన వృత్తిపరమైన, పరిశోధన ప్రయత్నాలలో విజయం పొందాలని తెలిపింది.

నిరుద్యోగ అంశంపై అసెంబ్లీలో చర్చించాలి

విశాలాంధ్ర, బషీర్ బాగ్: ప్రస్తుతం నడుస్తున్న అసెంబ్లీ సమావేశాల్లో ప్రతిపక్షాలు చొరవ తీసుకొని అసెంబ్లీలో నిరుద్యోగ అంశం చర్చకు వచ్చేలా చూడాలని ప్రతిపక్షాలకు నిరుద్యోగ హక్కుల వేదిక అధ్యక్షులు అశోక్ విజ్ఞప్తి చేశారు. బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మ్యానిఫెస్టో 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని నిరుద్యోగలను ఏమార్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ రెండు ఏండ్ల కాలంలో ఒక్క నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదన్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్లకు పరీక్షలు పూర్తిఅయి ఫలితాలు ఇచ్చిన తరువాత నియామక పత్రాలు ఇచ్చి 60 వేల ఉద్యోగాలు ఇచ్చామని గొప్పలు చెప్పుకుంటున్నారనీ మండిపడ్డారు. ఎస్.ఐ. కానిస్టేబుల్ 13 వేలు, గురుకులాలు 9 వేలు. గ్రూప్-4- 8 వేలు, జెఎల్. 1392, డిఎస్సి 11 వేలు, గ్రూప్-1-563, గ్రూప్-2-783, గ్రూప్-3 -1370 ఈ ఉద్యోగాలు ఏ ఒక్కటి కాంగ్రెస్ వేసిన నోటిఫికేషన్ కాదని పత్రాలు మాత్రమే ఇచ్చారని అన్నారు. బిటెక్, ఎంటెక్ పూర్తి చేసిన విద్యార్థులకు కూడా 15 వేల జీతం రాని పరిస్థితి, జమోటో, స్విగ్గీ, ఉబర్ బైక్ రైడ్లు నడపాల్సిన పరిస్థితి యువతకు ఎదురైంది అని ఈ ప్రశ్నలకు సమాధానం ఎవరు చెబుతారని నిలదీశారు. తక్షణమే ఈ అసెంబ్లీ సమావేశాల్లో ఈ విషయంపై చర్చించి నోటిఫికేషన్లు జారీ చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే సంక్రాంతి పండుగ తరువాత ముఖ్యమంత్రికి చావు డప్పు మోగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కొడంగల్ రవి. ఇంద్రా నాయక్, కయ్యా వెంకటేష్, శంకర్ నాయక్, సింధూ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నట్టల నివారణ మందులను సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర - మొయినాబాద్: ఉచిత నట్టల నివారణ మందు పంపిణీ కార్యక్రమాన్ని రైతులు, పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారి దేవిరెడ్డి అన్నారు. మండలంలోని ఖాసింబౌలి, నజీబ్ నగర్ గ్రామాల్లో గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందును సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.... నట్టల నివారణతో జీవాల్లో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని అన్నారు. ఈ మందు ద్వారా మరణాలు తగ్గి, జీవాల ఆరోగ్యం మెరుగుతుపడుతుందని తెలిపారు. ఈ శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచ్ లు , వార్డు సభ్యులు, పశు వైద్య సిబ్బంది, పశు పెంపకదారులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు పరిశీలన

విశాలాంధ్ర-మేడ్చల్ : హైదరాబాద్ మహా నగర పాలక సంస్థ కమిషనర్ ఆదేశనుసారం ప్రత్యేక పరిశుధ్య కార్యక్రమంలో భాగముగా సోమవారం మొదటి రోజు కార్యక్రమంలో ఉప్పల్ జోనల్ కమిషనర్ మరియు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీమతి రాధిక గుప్తా, బోడుప్పల్ సర్కిల్ యందు క్షేత్ర స్థాయిలో పర్యటనలో పారిశుధ్య పనులను బోడుప్పల్ డిప్యూటీ కమిషనర్ ఎ.. శైలజతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ మాట్లడుతూ.. ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం రోజు వారి ప్రణాళిక ప్రకారం విజయవంతం చేయాలన్నారు. అనంతరం అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డి.ఇ.ఇ. ఎస్. దబ్ల్యూ. ఎమ్. జాహ్నవి, సానిటరీ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ కుమార్, శ్రీనివాస్ రెడ్డి, ఎన్విరన్మెంటల్ ఇంజనీర్స్ నిఖిల్, మురళి, వార్డ్ ఆఫీసర్స్, జవాన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

డిప్యూటీ కమిషనర్‌ను శైలజకు మాజీ కార్పొరేటర్లు శుభాకాంక్షలు

విశాలాంధ్ర-మేడ్చల్ : గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సోమవారం బోడుప్పల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా డిప్యూటీ కమిషనర్ శైలజాను మర్యాద పూర్వకంగా సింగిరెడ్డి పద్మారెడ్డి, మాజీ కార్పొరేటర్లు కలసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా బి బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్, మాజీ కార్పొరేటర్లు కొత్త చందర్ గౌడ్, భూక్యా సుమన్, కుంభం కిరణ్ కుమార్ రెడ్డి, చీరాల నరసింహ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఎయిడ్స్ పై అవగాహన ఉండాలి

విశాలాంధ్ర - రంగారెడ్డి : ప్రతి ఒక్కరూ ఎయిడ్స్ పై అవగాహన కల్గివుండాలని జిల్లా వైద్యులు అన్నారు.జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి లలిత దేవి చూచన మేరకు, డాక్టర్. పాపారావు ఆదేశాల మేరకు డిస్ట్రిక్ట్ ఇంటిగ్రేటెడ్ స్ట్రాటజీ ఫర్ హెచ్.ఐ.వి, ఎయిడ్స్ పై (దిశ) హయతనగర్ ఆటోనగర్ ఏరియాలో హెచ్.ఐ.వి టెస్ట్, అవహగాహన కార్యక్రమం నిర్వహించడం నిర్వహించారు. ఈ క్యాంపులో 72 మంది ట్రక్ డ్రైవర్స్ రక్త పరీక్షలు చేయించుకున్నారు.దిశ సిబ్బంది హెచ్.ఐ.వి పైన అవగాహన కల్పించారు.ప్రతి ఒక్కరు హెచ్.ఐ.వి స్థితిని తెలుసుకొని , ఆరోగ్యాంగా ఉండడంతో పాటు, ఫ్యామిలీకి రక్షణగ ఉండాలని అన్నారు. హెచ్.ఐ.వి వచ్చినవారికి ఉచితంగా మందులు అందుబాటులో ఉన్నాయి అని తెలియజేసారు. ఆటోనగర్ ప్రాంతంలో మరిన్ని హెచ్.ఐ.వి టెస్ట్ క్యాంపులు రానున్న రోజుల్లో నిర్వహిస్తామని, ఈ ప్రాంత ప్రజలు హెచ్.ఐ.వి పరీక్షలు చేయించుకొని తమ హెచ్.ఐ.వి స్థితిని తెలుసుకోవాలని తెలిజేశారు. ఈ కార్యక్రంలో దిశ సిబ్బంది డానియెల్, రమేష్, మొబైల్ ఐసీటీసీ కౌన్సిలర్ గీతాలు, సిబ్బంది పాల్గొన్నారు.

పని హక్కుపై దాడి

- ఉపాధి హామీ చట్టానికి తూట్లు
- పేదల జీవితాలతో కేంద్రం చెలగాటం
- ఆర్ఎస్ఎస్, కార్పొరేట్లకు అనుకూలంగా 'జీరామ్‌జీ'
- రాజ్యాంగ నిర్వీర్యానికి కుట్ర
- కాంగ్రెస్ సదస్సులో వక్తలు
- కాంగ్రెస్, వామపక్ష, ప్రజా సంఘాలతో ఐక్య ఉద్యమం: ఈశ్వరయ్య

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి (ఎంజీఎన్ఆర్ఈజేపి) తూట్లు పొడిచి, పేదల జీవితాలతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని వక్తలు ధ్వజమెత్తారు. జీరామ్‌జీ పేరుతో ప్రధాని మోదీకి, ఆరెస్సెస్‌కి, కార్పొరేట్ శక్తులకు అనుకూలమైన చట్టం తెచ్చారని ధ్వజమెత్తారు. ఇది పేద ప్రజలపైన, దశబ్దాలపాటు పోరాడి సాధించుకున్న పని హక్కుపైన దాడి చేయడమేనని మండిపడ్డారు. విజయవాడ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యాలయం(ఆంధ్రరత్న భవన్)లో ఎంజీఎన్ఆర్ఈజేసీ పథకాన్ని యథాతథంగా కొనసాగించాలని డిమాండ్ చేస్తూ రాజకీయ పార్టీలు, ప్రజా, కార్మిక, కర్షక సంఘాల నాయకులు, ప్రజాస్వామ్య వాదులతో కలిసి సమాలోచన సదస్సు సోమవారం నిర్వహించారు. పీసీసీ ఉపాధ్యక్షులు కొలనుకొండ శివాజీ అధ్యక్షతన జరిగిన సదస్సులో కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, రైతు, కౌలు రైతులు, ప్రజా సంఘాలు దళితులు, మైనార్టీ సంఘాల నేతలు ప్రసంగించారు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యుడు గిడుగు రుద్రరాజు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ఒక చట్టబద్ధమైన హక్కు అని తెలిపారు. ప్రజలు పని కోరితే పని కల్పించాల్సిన బాధ్యత, పరిహారం చెల్లించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని గుర్తుచేశారు. బీజేపీ ప్రభుత్వం ఈ హక్కును కాలరాస్తూ... ప్రజల హక్కును ప్రభుత్వ దయాదాక్షిణ్యంగా మార్చిందని ఆరోపించారు. గతంలో ప్రజలు ఏటా 100 రోజుల పనిని డిమాండ్ చేసే హక్కు కలిగి ఉండేవారని, ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం పంచాయతీలను ఎంపిక చేసి బడ్జెట్ కేటాయిస్తేనే పని లభించే పరిస్థితి తీసుకువచ్చిందని పేర్కొన్నారు.

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య మాట్లాడుతూ... మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి పేరు మార్చి, గాంధీజీ అనే పదం ఉచ్చరించడానికి అవకాశం లేకుండా చేశారన్నారు. పైపెచ్చు కేంద్ర ప్రభుత్వం 125 రోజులపాటు పని దినాలు పెంచినట్లు ప్రకటించడం, అన్ని రకాల హక్కులు ఉంటాయని తెలపడం అర్థరహితమన్నారు. ఇప్పటికే ఈ చట్టంలో 100 రోజులకుగాను కనీసం 50 రోజులపాటు పని లేదంటూ గ్రామీణ ప్రాంతాల్లోని వ్యవసాయ కూలీలు ఆందోళన చెందుతున్నారని గుర్తుచేశారు. నాలుగైదు సంవత్సరాలుగా ఉన్న బడ్జెట్‌ను క్రమంగా తగ్గించుకుంటూ వస్తూ... ఇంకోవైపు పని దినాలను పెంచామని దేశ ప్రజలను మభ్యపెట్టేందుకు కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. ఇది ఏ మాత్రం సమర్థనీయం కాదని, దానికి వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా, మరోవైపు పార్లమెంట్‌లోను ఆందోళనలు కొనసాగుతున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇష్టానుసారంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. భవిష్యత్‌లో బీజేపీకి కొమ్ముకాసే పార్టీలను పక్కనపెట్టి... కాంగ్రెస్, వామపక్ష, ఇతర ప్రజా సంఘాలను కలుపుకుని పెద్దఎత్తున పోరాటాలకు దిగుతామన్నారు. జీరామ్‌జీ పేరులో బీజేపీ, ఆరెస్సెస్ సిద్ధాంతం, కుట్ర దాగి ఉందని... దీనిని మనమంతా వ్యతిరేకించాలిసిన అవసరముందని పిలుపునిచ్చారు. దేశ తొలి ప్రధాని పండిట్ నెహ్రూను పార్లమెంట్‌లో దూషించేలా మాట్లాడారని మండిపడ్డారు. దేశ ఆర్థికాభివృద్ధిలో నెహ్రూ పాత్ర ఎంతో కీలకంగా నిలిచిందని వివరించారు. మరోవైపు సుప్రీం తీర్పునకు వ్యతిరేకంగా కేంద్రం నిర్ణయాలు తీసుకుంటోందన్నారు. బీజేపీ, ఆరెస్సెస్ ప్రజా వ్యతిరేక విధానాల్ని బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని, దేశ వ్యాప్తంగా దీనికి కాంగ్రెస్ నడుం బిగించాలని కోరారు. జాతీయ గ్రామీణ హామీ ఉపాధి హామీ పథకానికి గాంధీజీ పేరు కొనసాగించాల్సిందేనని... ఆ దిశగా సీపీఐ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోందన్నారు.

సీపీఎం రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యులు సీహెచ్ బాబూరావు మాట్లాడుతూ ఎంజీఎన్ఆర్ఈజేపి చట్టాన్ని రద్దు చేసి, జీరామ్‌జీగా.. ఆరెస్సెస్‌కి, కార్పొరేట్‌కి అనుకూలమైన చట్టాన్ని మోదీ తెచ్చారని ధ్వజమెత్తారు. ఇది పేద ప్రజలపైన, దశబ్దాలపాటు పోరాడి సాధించుకున్న పని హక్కుపైన దాడేనని మండిపడ్డారు. పార్టీలకు అతీతంగా పని హక్కును కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం రాజ్యాంగంలోని ఫెడరల్ స్ఫూర్తికి మంగళం పాడేలా వ్యవహరిస్తోందని అన్నారు. ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తూ... రాష్ట్ర ప్రభుత్వాలపై భారం వేయడం తగదని, దానిపై ప్రభుత్వాలతో సంప్రదింపులు చేయరా? అని సూటిగా ప్రశ్నించారు.

సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుత ఎంజీఎన్ఆర్ఈజేపి యథాతథంగా ఉంచాలని, జీరామ్‌జీ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇందుకోసం భవిష్యత్తు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే సీపీఐ అధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల వద్ద ఆందోళనలు నిర్వహించినట్లు తెలిపారు. దళిత బహుజన నాయకులు కొరివి వినాయకుమార్ మాట్లాడుతూల మోదీ సర్కారు తీసుకొచ్చిన జీరామ్‌జీ చట్టం కార్పొరేట్ వ్యక్తులకు అనుకూలంగా ఉందని మండిపడ్డారు. కాంగ్రెస్ నాయకులు జంగా గౌతమ్ మాట్లాడుతూ గతంలో ఉన్న చట్టం ప్రకారం ఏ గ్రామీణ ప్రాంతంలోనైనా ప్రజలు పని కోరవచ్చని, ఇప్పుడు కేంద్రం నోటిఫై చేసిన పంచాయతీల్లో మాత్రమే పనులు లభిస్తాయని తెలిపారు. సదస్సుకు కేంద్ర మాజీ మంత్రులు పల్లంరాజు, రాష్ట్ర మాజీ మంత్రి రఘువీరారెడ్డి, సీపీఐ రాష్ట్రకార్యదర్శి వర్గ సభ్యులు రామాంజనేయులు, విజయవాడ నగర కాంగ్రెస్ అధ్యక్షులు నరహరిశెట్టి నరసింహారావు, ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య, సీపీఎం నాయకులు వై.కేశవరావు, కాంగ్రెస్ కిసాన్ కేత్ రైతు విభాగం చైర్మన్ కె.ప్రభాకరరావు, జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, మైనార్టీ నేతలు దానీ, షఫీ, బాజీ, అన్సారీ, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు రామారావు, ప్రజా సంఘాల నేతలు హాజరయ్యారు.

చెస్‌లో మెరిసిన తెలుగు తేజాలు

- వరల్డ్ రాపిడ్ చెస్ చాంపియన్‌షిప్‌లో హంపి, అర్జున్‌కు కాంస్య పతకాలు
- మోదీ, చంద్రబాబు, జగన్ అభినందనలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వరల్డ్ రాపిడ్ చెస్ చాంపియన్‌షిప్-2025లో కాంస్య పతకాలు గెలిచిన తెలుగు తేజాలు కోనేరు హంపి, అర్జున్ ఇరిగేశిలను ప్రధాని నరేంద్ర మోదీ అభినందించారు. ఆటపై కోనేరు హంపి, అర్జున్‌లకు ఉన్న అంకిత భావం ప్రశంసనీయమని, వారు మరెన్నో విజయాలు సాధించాలని ప్రధాని ఆకాంక్షించారు. ఈ మేరకు వేర్వేరు ట్వీట్లతో హంపి, అర్జున్‌లను మోదీ కొనియాడారు. 'దోహా వేదికగా జరిగిన ఫిడే ప్రపంచ రాపిడ్ చెస్ చాంపియన్‌షిప్ 2025 మహిళల విభాగంలో కాంస్య పతకం సాధించి, టోర్నీని ఘనంగా ముగించిన కోనేరు హంపికి అభినందనలు. ఈ క్రీడ పట్ల ఆమెకున్న అంకితభావం ఎంతో ప్రశంసనీయం. భవిష్యత్తులో మరిన్ని విజయాలను సాధించాలని ఆకాంక్షిస్తూ ఆమెకు శుభాకాంక్షలు' అని మోదీ పేర్కొన్నారు. ' దోహాలో జరిగిన ఫిడే ప్రపంచ రాపిడ్ చెస్ ఛాంపియన్‌షిప్ ఓపెన్ విభాగంలో కాంస్య పతకాన్ని గెలుచుకున్న అర్జున్ ఇరిగేశిని చూసి గర్విస్తున్నాం. అతను ప్రదర్శించిన పట్టుదల అద్భుతం. భవిష్యత్తు ప్రయత్నాల్లో మరిన్ని విజయాలు సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను'అని మోదీ మరో ట్వీట్‌లో పేర్కొన్నారు. ఏపీ సీఎం చంద్రబాబునాయుడు 'ఎక్స్' వేదికగా హంపి, ఇరిగేశిలకు అభినందనలు తెలిపారు. 'ఒక్క ఫలితంతో విజేతలను అంచనా వేయలేం. అత్యున్నత స్థాయిలో పదేపదే పోటీపడే సాహసమే వారిని నిలబెడుతుంది. ప్రపంచ వేదికపై కాంస్యం సాధించడం హంపి నైపుణ్యానికి నిదర్శనం. హంపి ప్రయాణం, నిలకడ దేశంలోని లక్షలాది మందికి స్ఫూర్తినిస్తుంది' అన్నారు. అదేవిధంగా అర్జున్ ఇరిగేశిని కూడా చంద్రబాబు కొనియాడారు. 'పురుషుల్లో గ్రాండ్‌మాస్టర్ విశ్వనాథన్ ఆనంద్ తర్వాత ఈ ఘనత సాధించిన ఏకైక భారత క్రీడాకారుడిగా అర్జున్ నిలిచారు. తెలంగాణ బిడ్డ అయిన అర్జున్, భారత చెస్ కీర్తి కిరీటంలో మరో ఘనతను చేర్చారు' అని పేర్కొన్నారు. ఏపీ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సైతం పతకాలు సాధించిన హంపి, ఇరిగేశిలకు అభినందనలు తెలిపారు. మహిళల విభాగంలో డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగిన హంపి... టైటిల్ నిలబెట్టుకోవడానికి ఆఖరిదాకా పోరాడింది. 11 రౌండ్లలో 8.5 పాయింట్లతో జుజినైర్(చైనా), అలెగ్జాండ్రా గొర్యాచ్‌కినా(రష్యా)తో ఉమ్మడిగా అగ్రస్థానంలో నిలిచింది. కానీ టైబ్రేక్ స్కోరులో హంపి మూడో స్థానంలో నిలిచింది. అలెగ్జాండ్రా గొర్యాచ్‌కినా చాంపియన్‌గా నిలవగా.. జినెర్‌కు రజతం దక్కింది. పురుషుల ఓపెన్ విభాగంలో అర్జున్ సత్తా చాటాడు. 9.5 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచాడు. ప్రపంచ చెస్‌లో అర్జున్‌కు ఇదే తొలి పతకం. వరల్డ్ నెంబర్ వన్ మాగ్నస్ కార్ల్‌సన్(నార్వే) ఆరోసారి ప్రపంచ ర్యాపిడ్ టైటిల్‌ను గెలుచుకున్నాడు.

అనవసర వ్యాజ్యాల తగ్గింపునకు కృషి

మంత్రివర్గ ఉప సంఘం భేటీలో ఫరూక్

విశాలాంధ్ర -సచివాలయం: కోర్టుల్లో అనవసర వ్యాజ్యాలను తగ్గించడం, సమస్యలకు సకాలంలో ప్రభావవంతమైన, ప్రత్యామ్నాయ పరిష్కారాన్ని చూపడం, ప్రభుత్వ విభాగాలలో పారదర్శకత, జవాబుదారీతనం కోసం ప్రత్యేక చర్యలకు న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్‌లతో మంత్రివర్గ ఉప సంఘాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఏర్పాటు చేసింది. ఈ నేపథ్యంలో సోమవారం రాష్ట్ర సచివాలయంలో "ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాజ్య విధానం- 2025" (ఏపీ స్టేట్ లిటిగేషన్ పాలసీ)పై వివిధ నిర్ణయాలను రూపొందించడంలో భాగంగా మంత్రివర్గ ఉపసంఘం తొలిసారి సమావేశమైంది. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడాతూ...అనవసరమైన వ్యాజ్యాలను తగ్గించడానికి, కోర్టులపై అధిక భారాన్ని నివారించడానికి, పాలన సామర్థ్యాన్ని మెరుగుపరచడానికి, పరిపాలనా స్థాయిలో వివిధ పద్ధతులను సమీక్షించి మంత్రుల సంఘం సూచనలు చేస్తుందని వివరించారు. ముందస్తు కేసు నిర్వహణ ద్వారా అప్పీళ్లను న్యాయంగా దాఖలు చేయడానికి, విధానపరమైన జాప్యాలను తొలగించడానికి చర్యలను కూడా సూచిస్తుందని పేర్కొన్నారు. ప్రత్యామ్నాయ వివాద పరిష్కారాన్ని సమీక్షించడం, ప్రోత్సహించడం, లోక్ అదాలత్‌లను సంస్థీకరించడం తదితర అంశాలపై పూర్తిస్థాయిలో దృష్టి సారించి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. న్యాయశాఖను మరింత పటిష్టం చేసేందుకు ప్రణాళిక బద్ధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టడం జరుగుతుందని స్పష్టం చేశారు. మంత్రి నాదెండ్ల మాట్లాడుతూ తదుపరి జీవోఎం సమావేశం నాటికి ప్రభుత్వ శాఖల వారీగా పెండింగ్లో ఉన్న కేసుల వివరాలు తెప్పించాల్సిందిగా న్యాయశాఖ కార్యదర్శి ప్రతిభా దేవికి సూచించారు. గుజరాత్, కర్నాటక రాష్ట్రాల లిటిగేషన్ పాలసీ వివరాలు కూడా మంత్రివర్గ ఉప సంఘానికి తెలియ జేయాలని ఆదేశించారు.

సార్వత్రిక సమ్మెకు సమాయత్తం కండి

- సివిల్ సప్లయీస్ హమాలీల సమస్యలు పరిష్కరించాలి
- నూతన ఒప్పందంపై చర్చలకు పిలవాలి
- రవీంద్రనాథ్, వెంకట సుబ్బయ్య



విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్: కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలపై కేంద్ర కార్మిక సంఘాల పిలుపులో భాగంగా ఫిబ్రవరి 12న తలపెట్టిన సార్వత్రిక సమ్మెను విజయవంతం చేసేందుకు సివిల్ సప్లయీస్ హమాలీలు సమాయత్తం కావాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రావులపల్లి రవీంద్రనాథ్, ఎస్.వెంకట సుబ్బయ్య పిలుపునిచ్చారు. ఆంధ్ర ప్రదేశ్ స్టేట్ సివిల్ సప్లయీస్ కార్పొరేషన్ హమాలీ (ముఠా) వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర కమిటీ విస్తృత సమావేశం గుంటూరు మల్లయ్యలింగం భవన్‌లోని వీఎస్‌కే హాలులో సోమవారం జరిగింది. యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు చల్లా చిన ఆంజనేయులు అధ్యక్షతన జరిగిన సమావేశంలో రవీంద్రనాథ్ మాట్లాడుతూ నరేంద్ర మోదీ ప్రభుత్వం కార్పొరేట్‌లకు అనుకూలంగా తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్ వల్ల కార్మికవర్గం పోరాడి సాధించుకున్న హక్కులు కాలరాయబడ్డాయన్నారు. ఉన్న చట్టాల కంటే మెరుగైన చట్టాలను తీసుకురావాల్సిన ప్రభుత్వాలు ఇంత దుర్మార్గంగా కార్మిక హక్కులు హరించేలా చట్టాలు తీసుకురావడం శోచనీయమని అన్నారు. ఈ పరిస్థితుల్లో హక్కులు సాధించుకోవడానికి, చట్టాలు నిలబెట్టుకోవడానికి, పని భద్రత, పని గంటలు, పీఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్, గ్రాట్యూటీ, పని ప్రదేశాలలో మెరుగైన సౌకర్యాలు పొందేందుకు కార్మికవర్గం పెద్ద ఎత్తున పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. దేశ వ్యాప్తంగా 12 కేంద్ర కార్మిక సంఘాలు 450 స్వతంత్ర సమాఖ్యలు ఇచ్చిన సార్వత్రిక సమ్మె పిలుపులో అన్ని రంగాల్లోని కార్మికులు పెద్దఎత్తున భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ హమాలీ కార్మికులకు సంబంధించి ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి కూలీ ఒప్పందం చేసుకునే ఆనవాయితీ ఉందని, 2026 జనవరి 1న నూతన ఒప్పందం జరగాల్సి ఉందని తెలిపారు. దీని కోసం కూలీ రేట్ల డిమాండ్ నోటీసును ఈ నెల 15న సివిల్ సప్లయీస్ కార్పొరేషన్ ఎండీకి అందజేయడం జరిగిందన్నారు. దీనిపై ఎండీ సానుకూలంగా స్పందిస్తారని ఆశిస్తున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎంఎల్ఎస్ పాయింట్లలో అనేక సమస్యలు నెలకొని ఉన్నాయని, వీటితో హమాలీలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. రోజుకో నూతన విధానాన్ని ప్రవేశపెట్టి హమాలీలకు వచ్చే కూలి డబ్బులు కూడా ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని విమర్శించారు. హమాలీలకు ఈఎస్ఐ, ఇన్సూరెన్స్ వంటి సౌకర్యాలు లేవని, ఆయా సమస్యలపై త్వరలో రాష్ట్ర స్థాయి సదస్సు ఏర్పాటు చేసి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని సమావేశం నిర్ణయించడం జరిగిందని తెలిపారు.

ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పోరుమామిళ్ల సుబ్బరాయుడు మాట్లాడుతూ ప్రజలకు సకాలంలో నిత్యావసరాలు అందించడంలో కీలకపాత్ర పోషిస్తున్న హమాలీల శ్రమకు తగిన వేతనాలు, గౌరవం దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వీరికి పీఎఫ్, ఈఎస్ఐ వంటి సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కోట మాల్యాద్రి మాట్లాడుతూ సీపీఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సందర్భంగా జనవరి 18న ఖమ్మంలో జరిగే ప్రదర్శన, బహిరంగ సభకు హమాలీలు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. అనంతరం ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయిన వెంకట సుబ్బయ్యను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సమావేశంలో యూనియన్ రాష్ట్ర డిప్యూటీ ప్రధాన కార్యదర్శి రావుల అంజిబాబు, కార్యదర్శి వీరబాబు, నాయకులు జి.సురేష్‌బాబు, గోవిందు, జిల్లా అధ్యక్షులు కోట్ల మరియదాసు తదితరులు పాల్గొన్నారు.

ఎర్నాకులం ఎక్స్‌ప్రెస్‌లో మంటలు

విశాలాంధ్ర-యలమంచిలి: ఎర్నాకులం ఎక్స్‌ప్రెస్‌లో మంటలు ఎగిసిపడ్డాయి. విశాఖ జిల్లా దువ్వాడ మీదుగా ఎర్నాకుళం వెళ్లే టాటా-ఎర్నాకుళం(18189) ఎక్స్‌ప్రెస్ ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత అగ్నిప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో ఓ వృద్ధుడు మరణించారు. రైలులోని ప్యాంట్రీ కారును ఆనుకుని ఉన్న బీ1, ఎం2 ఏసీ బోగీల్లో మంటలు చెలరేగాయి. యలమంచిలి రైల్వేస్టేషన్ సమీపంలో ఈ ఘటన జరగడంతో లోకో పైలట్ సిబ్బంది గుర్తించి రైల్వేస్టేషన్‌లో రైలును నిలిపివేశారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చేలోపే రెండు బోగీలకు మంటలు పూర్తిగా వ్యాపించి దగ్ధమయ్యాయి. భయాందోళనకు గురైన ప్రయాణికులు బోగీల్లో నుంచి దిగి స్టేషన్‌లోకి పరుగులు పెట్టారు. దట్టమైన పొగ వ్యాపించడంతో అసలు ఏమి జరుగుతుందో తెలియని పరిస్థితి. ఈ రైలు అనకాపల్లికి నాలుగు గంటలు ఆలస్యంగా చేరుకుంది. అక్కడి నుంచి బయలుదేరిన అనంతరం నర్సింగబల్లి వద్ద బీ1 ఏసీ బోగీ బ్రేకులు పట్టేయడంతో అగ్నికీలలు వ్యాపించినట్లు సమాచారం. అనకాపల్లి, ఎలమంచిలి, నక్కపల్లి అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలికి చేరుకుని మంటలను ఆర్పడానికి శ్రమించారు. రెండు బోగీల్లోని ప్రయాణికుల సామగ్రి మొత్తం కాలిపోయింది. రైల్వే ఉన్నతాధికారులు స్టేషన్‌కు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. హుటాహుటిన అంబులెన్స్‌లను రప్పించారు. చలిలో సుమారు రెండువేల మంది ప్రయాణికులు స్టేషన్‌లో పడిగాపులు పడ్డారు. ఈ ప్రమాదం నేపథ్యంలో విశాఖ-విజయవాడ మార్గంలో రైళ్లన్నీ నిలుపుదల చేశారు. సోమవారం తెల్లవారుజామున 3.30గంటలు దాటిన తర్వాత రైల్వే అధికారులు

కాలిపోయిన రెండు బోగీలను తొలగించి, ఆయా బోగీల్లోని ప్రయాణికులను మిగతా బోగీల్లో సర్దుబాటు చేసి రైలును పంపించడానికి ఏర్పాట్లు చేశారు.

వృద్ధుడి సజీవదహనం: బీ1 బోగీలో వృద్ధుడు సజీవ దహనమైనట్లు అధికారులు తెలిపారు. మృతుడిని విజయవాడకు చెందిన చంద్రశేఖర్ సుందర్(70)గా గుర్తించారు. అతడి కుటుంబసభ్యులకు సమాచారం చేరవేశామని అనకాపల్లి ఎస్పీ తుహిన్‌సిన్హా తెలిపారు. ఎం2, బీ1 బోగీల్లో మంటలు చెలరేగాయన్నారు. ఎం2లో 82 మంది, బీ1లో 76 మంది ప్రయాణిస్తున్నారని చెప్పారు. దగ్ధమైన రెండు బోగీలకు చెందిన ప్రయాణికులను సామర్లకోట స్టేషన్‌కు మూడు ఆర్టీసీ బస్సుల్లో తరలించారు. అక్కడ మూడు బోగీలను సిద్ధం చేశారు. ఎర్నాకుళం ఎక్స్‌ప్రెస్‌కు వాటిని జత చేసి అక్కడి నుంచి పంపించారు. కాగా, రైలు ప్రమాదంపై గవర్నమెంట్ రైల్వే పోలీసులు తునిలో కేసు నమోదు చేశారు. రైల్వే సిబ్బంది నుంచి వివరాలు సేకరించారు. మరోవైపు ఈ ప్రమాదంపై దక్షిణ కోస్తా రైల్వే విచారణకు ఆదేశించింది. ప్రమాదానికి గురైన బోగీల నుంచి నమూనాలను ఫోరెన్సిక్ సిబ్బంది సేకరించారు.

ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి

కోటి పరిహారం అందజేసిన సీఎం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు మృతి చెందిన ఎక్సైజ్‌శాఖ హెడ్ కానిస్టేబుల్ పిచ్చేశ్వరరావు కుటుంబానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రూ.కోటి పరిహార చెక్కును సోమవారం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం-స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మధ్య 2025 మార్చిలో కుదిరిన అవగాహన ఒప్పందం ప్రకారం అమలులో ఉన్న ఎస్‌బీఐ బీమా పథకం కింద ఈ పరిహారం మంజూరైంది. ఒప్పందం తర్వాత ఈ పథకం ద్వారా పరిహారం అందజేయడం ఇదే తొలిసారి. మృతుడి కుటుంబానికి ముఖ్యమంత్రి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ... ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కుటుంబ సభ్యుల్లో అర్హులైన వారికి కారుణ్య నియామకం కల్పిస్తామని తెలిపారు. ఎక్సైజ్ శాఖను ప్రభుత్వం ఏర్పడిన తక్కువ సమయంలోనే పునర్వ్యవస్థీకరించి, సమర్థంగా ముందుకు నడిపించినందుకు ఎక్సైజ్ అధికారులు, మంత్రి కొల్లు రవీంద్ర, ముఖ్య కార్యదర్శి ముకేష్ కుమార్ మీనాలను సీఎం అభినందించారు. ఎక్సైజ్ శాఖ అధికారులను ఉద్దేశించి ముఖ్యమంత్రి మాట్లాడుతూ అందరూ నిబద్ధతతో పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. ప్రభుత్వ ఆదాయం కన్నా ప్రజల ఆరోగ్యం ముఖ్యమని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమం కోసం ఎస్‌బీఐ -ఎస్‌జీఎస్‌పీ శాలరీ ఖాతా ద్వారా ఇలాంటి విలువైన బీమా ప్రయోజనాలు కల్పించడం అభినందనీయమని ఉద్యోగ సంఘం నేతలు సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ పథకం ద్వారా బాధిత కుటుంబానికి తక్షణ ఆర్థిక భద్రత కలగడం ఎంతో ఉపశమనమని పేర్కొన్నారు. ఎక్సైజ్ కమిషనర్ చెరుకూరి శ్రీధర్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్ దేవ్ శర్మతో పాటు ఎక్సైజ్ అధికారుల సంఘం నాయకులు బి.నరసింహులు, కె.కామేశ్వరరావు, ప్రభాకరరావు, వెంకట రమణ పాల్గొన్నారు.

నేరాలు తగ్గుముఖం

త్వరలో ఐపీఎస్‌లకు ప్రత్యేక వర్క్‌షాప్: డీజీపీ

విశాలాంధ్ర -విజయవాడ (క్రైం): రాష్ట్రంలో నేరాలు తగ్గాయని డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా అన్నారు. తన కార్యాలయంలో సోమవారం 2025 వార్షిక నేర నివేదికను ఆయన విడుదల చేశారు. పోలీసింగ్‌లో పురోగతి, భవిష్యత్ కార్యాచరణను వివరించారు. ఈ సందర్భంగా డీజీపీ మీడియాతో మాట్లాడుతూ... గతేడాదితో పోలిస్తే 6 శాతం నేరాలు తగ్గాయన్నారు. హిడ్మా ఎన్‌కౌంటర్ ఘటనను పోలీస్ విజయం లేదా మావోయిస్టుల ఓటమిగా చూడలేమని అభిప్రాయపడ్డారు. చట్టానికి విరుద్ధంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ముఖ్యంగా సైబర్ క్రైమ్, మహిళలపై నేరాలు, మత్తుపదార్థాల రవాణా నియంత్రణ పోలీసులకు ప్రధాన సవాళ్లుగా మారాయని చెప్పారు. సైబర్ నేరాలు పెరిగాయని, సైబర్ మోసాల్లో డబ్బు రికవరీ చేయడం చాలా కష్టంగా మారిందని, డబ్బు క్రిప్టో కరెన్సీకి వెళ్లి చైనా గ్యాంగ్‌ల ఖాతాల్లోకి వెళ్లిపోతుందన్నారు. ఆ డబ్బు తిరిగి తెచ్చుకోవడం దాదాపు అసాధ్యమన్నారు. అందుకే ప్రజల్లో సైబర్ నేరాల పై ప్రజల్లో ఇంకా అవహన పెరగాల్సిన అవసరం ఉందన్నారు. అంతరాష్ట్ర స్థాయిలో డ్రగ్స్, గంజాయి రవాణాను అరికట్టడంపై మరింత లోతుగా దృష్టి పెట్టామన్నారు. ఇతర రాష్ట్రాల పోలీసుల సహకారం కూడా తీసుకుని మత్తుపదార్థాల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. దేశ వ్యాప్తంగా 12 రాష్ట్రాలకు చెందిన 343 మంది పాత్ర ఉన్నట్లు గుర్తించామని, వారిపై నిఘా కొనసాగుతోందన్నారు. బెంగుళూరు, ఇతర రాష్ట్రాల్లో ఉన్న డ్రగ్స్ లింకులు అరికట్టేందుకు ప్రత్యేక బృందాలు పని చేస్తున్నాయన్నారు. సెల్‌ఫోన్ల రికవరీ, నేరాల నియంత్రణ,మత్తు రవాణా నిరోధం వంటి అంశాల్లో 2025లో మెరుగైన ఫలితాలు వచ్చాయని వివరించారు. రాబోయే పదేళ్లలో పోలీసింగ్ ఎలా ఉండాలని అన్న అంశంపై సమగ్ర కార్యాచరణ రూపొందిస్తున్నట్లు డీజీపీ చెప్పారు. సంక్రాంతి పండుగ తర్వాత అమరావతిలో రెండు రోజుల ఐపీఎస్‌లకు ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఇందులో పోలీసింగ్‌లో వచ్చే మార్పులు, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, కీలక కేసుల ఛేదన విధానాలను అధికారులకు వివరించనున్నారని చెప్పారు. కేంద్ర నివేదికల్లో ఏపీ 36వ స్థానంలో ఉందన్న ప్రచారం పాత డేటా ఆధారమైనదని, రాష్ట్రం లేఖ ద్వారా ఇప్పటికే ఆ తప్పును కేంద్రానికి తెలియజేసిందన్నారు. డేటా వ్యత్యాసాల కారణంగానే అపోహలు వచ్చాయని చెప్పారు. ఇప్పుడు డ్యాష్‌బోర్డ్‌లో ఏపీ వాస్తవ స్థానం కనిపిస్తోందన్నారు. పేకాట క్లబ్బులు, ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలపై పోలీస్ శాఖ మరింత కఠినంగా వ్యవహరిస్తుందని, అవసరమైతే పీడీ యాక్ట్ కూడా నమోదు చేస్తామని హెచ్చరించారు. మహిళలకు పోలీసులు ఎల్లప్పుడూ రక్షణగా ఉంటారని చెప్పారు. అక్కడక్కడా మహిళలపై వేధింపుల కేసులు నమోదు అవుతుంటాయని, ఆలయాల వద్దకు లక్షల్లో వెళ్లే భక్తుల్లో ఎక్కడో వేధింపు ఘటన ఉంటుందన్నారు. అన్నీ సాధారంగా చూడకూడదన్నారు. ఇటీవల నిందితులను రోడ్లపై నడిపించడంపై డీజీపీ స్పందిస్తూ... కోర్టులో హాజరుపరిచే సమయానికి పెట్రోలింగ్ వాహనాలు అందబాటులో లేవని, దీంతో కొన్ని చోట్ల నిందితులను నడిపిస్తూ కోర్టుకు తీసుకువెళుతున్నారని వివరణ ఇచ్చారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు ఉండాలనే లక్ష్యంతోనే పోలీసులు పని చేస్తున్నారని చెప్పారు. ఈగల్ ఐజీ రవి కృష్ణ, ఐజీలు సిహెచ్.శ్రీకాంత్, కేవీ మోహన్‌రావు, ఏపీ ఫోరెన్సిక్ డైరెక్టర్ పాలరాజు, అమ్మిరెడ్డి, కే ఫకీరప్పా ఇతర అధికారులు పాల్గొన్నారు.

కంబళ క్రీడలో సరికొత్త రికార్డు

10.87 సెకన్లలో 125 మీటర్లు పూర్తి చేసిన విజేత స్వరూప్

బెంగళూరు: కర్నాటకలో సంప్రదాయ కంబళ పోటీలు హోరాహోరీగా జరిగాయి. ఈ సందర్భంగా మస్తికట్టె స్వరూప్ అనే యువకుడు దున్నపోతుల పందేల్లో సరికొత్త రికార్డు సృష్టించాడు. మంగళూరులో జరిగిన ఈ పోటీల్లో స్వరూప్ 125 మీటర్ల దూరాన్ని కేవలం 10.87 సెకన్లలో పూర్తి చేసి విజేతగా నిలిచాడు. గతంలో శ్రీనివాస గౌడ 100 మీటర్ల దూరాన్ని 8.78 సెకన్లలో పూర్తి చేయగా, ఆ రికార్డును స్వరూప్ అధిగమించాడు. స్వరూప్ 125 మీటర్లను 10.87 సెకన్లలో పూర్తి చేయడంతో, 100 మీటర్ల దూరాన్ని 8.69 సెకన్లలోనే అధిగమించినట్లయింది.

కర్నాటక తీర ప్రాంతంలో ప్రతి సంవత్సరం ఈ గ్రామీణ క్రీడను నిర్వహిస్తారు. గత మూడేళ్లుగా కంబళ రేసులో పాల్గొంటున్నానని, గతంలో జూనియర్ విభాగంలో పాల్గొనేవాడినని స్వరూప్ తెలిపాడు. ఈ ఏడాది తొలిసారి సీనియర్ విభాగంలో పాల్గొని రికార్డు సృష్టించడం తనకెంతో సంతోషాన్ని కలిగించిందని, ఇది ఊహించని విజయమని పేర్కొన్నాడు. దక్షిణ కన్నడ జిల్లా మంగళూరులో శనివారం ప్రారంభమైన ఈ పోటీలు ఆదివారంతో ముగిశాయి. దున్నల యజమాని సందీప్‌శెట్టి మాట్లాడుతూ.. గతంలో జరిగిన కంబళ పోటీల్లో ఈ దున్నలు తాడులాగే విభాగంలో రెండో స్థానంలో నిలిచాయన్నారు. స్వరూప్ గతేడాది వరకు జూనియర్ విభాగంలో పాల్గొనగా.. ఈసారి సీనియర్ విభాగంలో పాల్గొని ఊహించని రికార్డు నెలకొల్పాడని అభినందించారు. ఈ రికార్డుపై కంబళ కమిటీ చైర్మన్ దేవిప్రసాద్ శెట్టి హర్షం వ్యక్తం చేశారు. గతంలో శ్రీనివాస గౌడ అద్భుతమైన ఘనత సాధించగా... ఇప్పుడు స్వరూప్ ఆ రికార్డుని బ్రేక్ చేశారన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.

జాతీయ కబడ్డీ పోటీలపై జిల్లా విద్యాశాఖ అధికారి సమీక్షా

విశాలాంధ్ర - పినపాక: జాతీయ స్థాయి కబడ్డీ పోటీల విషయంలో జిల్లా విద్యాశాఖ అధికారిణి నాగలక్ష్మి సోమవారం మండల అధికారులు, ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు, ప్రైవేటు పాఠశాలల యజమానులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పినపాక మండలంలోని ఏడూళ్ల బయ్యారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జనవరి 7వ తేది నుండి 11వ తేది వరకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే 69వ అండర్ 17 బాలుర జాతీయ కబడ్డీ పోటీలు జరగనున్నాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మారుమూల ఏజెన్సీ ప్రాంతమైన ఏడుళ్ల బయ్యారం గ్రామంలో జాతీయస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించడం మనందరికీ గర్వకారణం అన్నారు. ఈ పోటీలు విజయవంతం చేయడం కోసం అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. అదే విధంగా ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు కూడా ఈ టోర్నమెంటు విజయవంతం చేయడం కోసం సహకరించాలని కోరారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే క్రీడాకారుల కోసం వసతి ఏర్పాట్లు, రవాణా ఏర్పాట్లకు ప్రైవేటు పాఠశాలల యజమానులు సహకరించాలని కోరారు. పోటీల నిర్వహణకు అవసరమైన మౌలిక వసతులు, క్రీడా మైదాన సన్నద్ధత, విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు, వసతి, భోజన ఏర్పాట్లపై మండల అధికారులతో విస్తృతంగా చర్చించారు. క్రీడాకారుల భద్రత, వైద్య సదుపాయాలు, అంబులెన్స్ సేవలు అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. అలాగే శాంతిభద్రతలు, ట్రాఫిక్ నియంత్రణకు సంబంధించి పోలీసు శాఖతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. జాతీయ స్థాయి పోటీలు కావడంతో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే క్రీడాకారులు, కోచ్‌లు, అధికారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు సమయానికి పూర్తిచేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి స్పష్టం చేశారు. స్వచ్ఛంద సంస్థలు, క్రీడా సంఘాలు, ఉపాధ్యాయులు సమన్వయంతో పని చేసి ఈ పోటీలను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎంపీడీవో సంకీర్త్, మండల విద్యాశాఖ అధికారి నాగయ్య, జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య కార్యనిర్వాహక కార్యదర్శి వాసిరెడ్డి నరేష్ కుమార్, పిడి వీరన్న, సీనియార్ పిడి ప్రేమ్ కుమార్, గ్రామ పెద్దలు కంది సుబ్బారెడ్డి, ప్రైవేటు పాఠశాలల యజమానులు గంగిరెడ్డి మధుసూదన్ రెడ్డి, యూసఫ్, బందారు నరేందర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, క్రీడా ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

జీ.ఏంను, సర్పంచులను సన్మానించిన వర్తక సంఘం నాయకులు

విశాలాంధ్ర, మంథని: ఆర్జీ-3 జీ.ఎం గా పదవి విరమణ పొందుతున్న జీఎం నరేంద్ర సుధాకర్ రావును సోమవారం సెంటినరీ కాలనీ రామగిరి వర్తక సంఘ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఇటీవల నూతనంగా సర్పంచులుగా ఎన్నికైన పల్లె ప్రతిమ పీవీరావు (రత్నాపూర్), చిందం మహేష్ (పన్నూరు) లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రామగిరి వర్తక సంఘం అధ్యక్షులు ఆకుల నారాయణ, ఉపాధ్యక్షులు గట్ల సంపత్ రెడ్డి (సంఘమిత్ర), కొంక రాజు (బేకరీ), చికెన్ సెంటర్ రాజు, ఒజ్జే ప్రేమ్ కుమార్, పూసర్ల మొగిలి, విజయ డ్రెస్సెస్ సంపత్, కంగన్ హాలు గోపాల్, డ్రెస్సెస్ రాములు, నీటెక్స్ పబ్బా సది, రిలయన్స్ వెంకన్న, సమ్మెట రాజేశం, వాచ్ రిపేరు శ్రీధర్, దేవ రమేష్, ఫ్రిడ్జ్ రిపేర్ రమేష్, కొలిపాక కుమార్, లక్ష్మీనారాయణ, ఫాస్ట్ ఫుడ్ వంశీ పాల్గొన్నారు.

బుద్ధిస్ట్ సొసైటీ అఫ్ ఇండియా - తెలంగాణ కొత్త కమిటీ ఎన్నిక

గౌరవ అధ్యక్షులుగా కోట ప్రసాద్, అధ్యక్షులుగా ఆసఫ్ అలీ

విశాలాంధ్ర -ఖమ్మం : ఖమ్మం డిస్ట్రిక్ట్ బ్రాంచ్ ఆధ్వర్యంలో ది బుద్దిస్ట్ సొసైటీ అఫ్ ఇండియా - తెలంగాణ స్టేట్ రాష్ట్రకమిటీ పిలుపు మేరకు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు హెచ్ బసవయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో కొత్త కమిటీని ఎన్ను కున్నారు. గౌరవ అధ్యక్షులుగా కోట ప్రసాద్, అధ్యక్షులుగా ఆసఫ్ అలీ, జనరల్ సెక్రెటరీ డాక్టర్ పత్తిపాటి వెంకటేశ్వర్లు, వర్కింగ్ ప్రెసిడెంట్ మట్టే గురుమూర్తి, వైస్ ప్రెసిడెంట్లు కట్టెకోల వెంకటేశ్వర్లు, డి సత్యనారాయణ, మహిళా సెక్రెటరీలు డి సుధారాణి, పగిడి కత్తుల ఈదయ్య , ట్రెజరర్ పిడమర్తి ప్రసాద్ లు . వీరితో పాటు ఆర్గనైజ్ సెక్రెటరీ లు, పబ్లిసిటీ సెక్రెటరీ లు, కల్చరల్ సెక్రెటరీ లు, ఈసీ మెంబర్లు మరియు ముఖ్య సలహాదారులను ఎన్నుకున్నారు. ఈ సంద గావారు మాట్లాడుతూప్రజలలో బుద్ధధర్మాన్ని వ్యాప్తిచేసి సమసమాజాన్ని నిర్మించ దానికి తమ వంతుగా కృషి చేస్తామని అలాగే సమావేశములు, సెమినార్లు నిర్వ హించి ప్రజలలో అవగాహన తేవడానికి ప్రయత్నిస్తామని అన్నారు. బుద్ధ పౌర్ణమి రోజున వీలైనంత వైభవముగా బుద్ధ జయంతిని జరుపుకుంటామని తెలిపారు.

విశ్రాంత సింగరేణియుల ద్వితీయ ఆత్మీయ మహా సమ్మేళనం

భారీగా హాజరైన విశ్రాంత కార్మికులు

విశాలాంధ్ర, మంథని: సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విశ్రాంత సింగరేణి కార్మికుల ద్వితీయ ఆత్మీయ మహా సమ్మేళనం సోమవారం రామ గిరి మండలం సెంటినరీ కాలనీలోని సాయి రామ్ గార్డెన్ లో ఘనంగా నిర్వహించారు. ఈ సమ్మేళనానికి వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో విశ్రాంత కార్మికులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీఎంపీఎఫ్ అసిస్టెంట్ కమిషనర్ హాజరై మాట్లాడారు. విశ్రాంత కార్మికులు సంస్థ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించారని, వారి సేవలు ఎప్పటికీ మరువలేనివని ఆయన పేర్కొన్నారు. విశ్రాంతి అనంతరం కూడా కార్మికుల సంక్షేమానికి సంబంధించిన సమస్యలపై సంఘం ద్వారా పోరాటం కొనసాగాలని సూచించారు.కార్యక్రమంలో సంఘ నాయకులు మాట్లాడుతూ, పెన్షన్, సీఎంపీఎఫ్, ఆరోగ్య సదుపాయాలు వంటి అంశాలపై ఐక్యంగా ముందుకు సాగాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ ఆత్మీయ సమావేశం ద్వారా పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ పరస్పర అను బంధాన్ని మరింత బలోపేతం చేసుకున్నామని వారు అన్నారు.ఈ కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు, విశ్రాంత ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

టిపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా జోగ రాంబాబు

విశాలాంధ్ర - ఆళ్లపల్లి : టిపిటిఎఫ్ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా జోగా రాంబాబును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అంకితభావంతో విధులు నిర్వహించే, సంఘం కోసం శ్రమించే రాంబాబు ఎన్నిక పట్ల ఆళ్ళపల్లి మండల టిపిటి ఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బానోతు భోజ్య, ఈసం ముత్తయ్యతో పాటు కమిటీ సభ్యులు సోమవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం నాడు పాల్వంచ లోని ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాల నిర్వహించిన టిపిటిఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశంలో రాంబాబును జిల్లా ప్రధాన కార్యదర్శి గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వారు తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతున్న రాంబాబుకు ఈ బాధ్యతలు మరింత శక్తినిస్తాయన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉపాధ్యాయులకు ఆయన నాయకత్వంలో దిశా నిర్దేశం జరిగి మంచి ఫలితాలు వస్తాయని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాంబాబుకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, టిపిటిఎఫ్ బలోపేతానికి అందరం కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఆయన ఎంపిక పట్ల ఆ సంఘం నేతలు కె. లక్ష్మీనారాయణ, జి. కుమార్ రాజా, ఎన్ రామకృష్ణ నాగమణి, కె.రామయ్య, నెహ్రూ, భద్రు,రవి, బిక్షమయ్య, భద్రమ్మ, కొమరం లాలయ్య, బి శ్రీను, బి చిన్న, నీలావతి, కొమరం వసంతరావు, పాయం ప్రసాదరావు, ఈశ్వరి, వసంత, భావ్ సింగ్, వీరన్న తదితరులు హర్షం వ్యక్తం చేసినవారిలో ఉన్నారు.

ఏజెన్సీలో మెరుగైన జిల్లా వైద్య విధాన పరిషత్ సేవలు..

డిసి హెచ్ ఎస్ యువ డాక్టర్ రవిబాబు సారథ్యంలో వైద్యాధికారుల సమిష్టి కృషి

ప్రభుత్వ ధవఖానాల్లో అందుబాటులోకి వచ్చిన ఆధునిక పరికరాలు

విశాలాంధ్ర - కొత్తగూడెం : మూడేళ్ల కాలంగా జిల్లా వైద్య విధాన పరిషత్ ఆసుపత్రుల్లో ఆధునిక వైద్య సేవలు ప్రగతి కనిపిస్తుంది. పక్క ఏజెన్సీ ప్రాంతాల్లో సైతం ఆధునిక పరికరాలు కల్పించడం తోపాటు వైద్య సేవ విస్తృత్రిలో వైద్యులను సిబ్బందిని సమన్వయం చేయడంలో మూడేళ్ళ క్రితం డిసి హెచ్ఎస్‌గా బాధ్యతలు చేపట్టిన యువర్ డాక్టర్ రవిబాబు సారధ్యంలో ఏజెన్సీ ప్రాంతాల్లోని ప్రభుత్వ దాకానాల్లో భరోసా ఏర్పడు తుంది. అభివృద్ధి సాధించాలంటే ప్రతి రంగంలో యువ సారథ్యం ఎందుకు అవసమో డాక్టర్ రవిబాబు నిరూపిస్తున్నారు. గతంలో కంటే రవిబాబు జిల్లా అధికారిగా బాధ్యతలు చేపట్టిన ఈ మూడేళ్ల కాలంలో ప్రభుత్వ ఆసుపత్రిలో పేదలకు వైద్య సేవలు మెరుగుపడ్డాయని ఇటీవల రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి క్రిస్టినా అభినందిస్తూ అవార్డులు అందజేయటం. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో వైద్య విధాన పరిషత్ ఆసుపత్రులలో ఆధునిక పద్ధతుల్లో వైద్య సేవలు అందించడమే కాక క్లిష్టమైన ఆపరేషన్లను సైతం చేస్తున్నారని రాష్ట్ర మంత్రి కితాబు ఇవ్వడం గమనార్హం. ప్రభుత్వం కూడా ఇతోటికంగా ఆస్పత్రుల అభివృద్ధి కోసం ప్రత్యేకంగా దృష్టి పెట్టి పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తుందని దాన్ని డాక్టర్ రవిబాబు ఎంతో సద్వినియోగం చేస్తున్నారని మంత్రి కితాబు కూడా ఇచ్చారు. గడచిన మూడేళ్ల కాలం నుంచి ఏజెన్సీ ఆసుపత్రిలో స్పెషాలిటీ సేవలు అందిస్తున్నారు. గతంలో భద్రాచలం, పాల్వంచ ఆసుపత్రుల్లో అంతంత మాత్రంగా ఉన్న స్పెషాలిటీ సేవలు నేడు జిల్లా నలుమూలల ప్రసూతి వైద్యులతో పాటు ఇతర స్పెషలిస్ట్ డాక్టర్లు అందుబాటులో ఉంటూ స్థానికంగానే విశేష సేవలు అందుతున్నాయి. మారుమూల ప్రాంతాలైన మణుగూర్ లో నెలకు 100 ప్రసవాలు జరుగుతున్నాయంటే వైద్యులపై వైద్యుల శ్రమను గుర్తించక తప్పదు. అదేవిధంగా అశ్వారావుపేట లో గతంలో 10 ప్రసవాలు జరిగితే ఇప్పుడు 50 పైగా, చర్ల లో 2 నుండి 30 పైగా ప్రసవాలు ప్రగతి పెరగటం విశేషం. పిల్లల వైద్యులు కూడా అందుబాటులో ఉండడం తో తల్లి బిడ్డ మరణాల సంఖ్య బాగా తగ్గిందని లెక్కలు చెబుతున్నాయి. డైయాలసిస్ సేవలు కూడా జిల్లాలో బాగా పెరిగాయి. ఎంతో ఖర్చు, రిస్కు తో కూడిన డయాలసిస్ గతం లో కేవలం భద్రాచల%శీ% కొత్తగూడెం లోనే ఉండేవి అవి కూడా పది యంత్రాలు మాత్రమే ఉండేవి. ఇప్పుడు మణుగూరు ,పాల్వంచ ,అశ్వారావుపేట, చర్ల , ఎల్లందు లో డయాలసిస్ సేవలు విస్తరింపజేశారు. దీంతో కిడ్నీ రోగులకు ఎంతో ఆర్థిక వెసులుబాటుతో పాటు స్థానికంగా డయాలసిస్ సౌకర్యాలు లభిస్తున్నాయి. గతంలో ఒక పెషేంట్ చనిపోతే తప్ప మరొక కిడ్నీ పేషెంట్ కు డయాలసిస్ అవకాశం లభించేది కాదు దీంతో ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించి వేలాది రూపాయలు నష్టపోయేవారు. నేడు 53 డయాలిసిస్ మెషిన్ లతో 100 కు పైగా ఖాళీలతో పుష్కలంగా స్థానికంగానే సేవలందటం గమనార్హం.

రక్త నిల్వ కేంద్రాలు కూడా పెరిగాయి. గతం లో భద్రాచలం, కొత్తగూడెం లో ఉన్న రక్తి నిధి కేంద్రాలు నేడు మణుగూరు , అశ్వారావుపేట ఎల్లందు లో అందుబాటులో వచ్చి రోగులు స్థానికంగానే ప్రైవేట్ బ్లడ్ బ్యాంకు కి వెళ్లకుండా ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా పొందుతున్నారు. తలసేమియా, సికిల్ సెల్ ఎనీమియా, ఆక్సిడెంట్ కేసులు, రక్త హీనత తో బాధపడుతున్న గరిణీలకు వరంగా మారింది. మెరుగైన మౌలిక సదుపాయాలను కూడా ఆస్పత్రులలో పెంచారు. ఆపరేషన్ వార్డులలో ఏసీ, స్వఛమైన చన్నీళ్లు, ఎండాకాలం లో కూలర్స్ లు, కరెంటు లేనప్పుడు 24 గంటలు జనరేటర్ ద్వారా విద్యుత్, అధ్యాధునిక ఆపరేషన్ థియేటర్ లో పరికరాలు, ఓపి పరికరాలు విస్తృతంగా పెంచారు. జిల్లాలో మొట్టమొదటి కంటి శస్త్ర చికిత్స ఆపరేషన్ థియేటర్ మొదలైనవి ఇపుడు అందుబాటులోకి వచ్చాయి. దింతో రోగులను ఇతర ప్రాంతాలకు తరలించ కుండా స్థానికంగా అన్ని సేవలు అందిస్తున్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడ లేని విధంగా ఏజెన్సీ జిల్లా అయినప్పటికీ సరిపడా సిబ్బంది లేనప్పటికీ నాణ్యమైన వైద్యాన్ని అందిస్తున్నందుకు సి ఆర్ ఎమ్ జాతీయ స్థాయి బృందం ఇటీవల జిల్లా ఆస్పత్రిలో తనిఖీ చేసి చాలా అభినందించింది. ఈ పరిణామాలతో సంతోషం వ్యక్తం చేసిన రాష్ట్ర మంత్రులు దామోదర రాజ నరసింహ, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, టీవీవీ కమీషనర్, జిల్లా ప్రజాప్రతినిధులు డాక్టర్ రవిబాబు తో పాటు వైద్యులను, సిబ్బందిని మెచ్చుకుంటు అభినందిస్తున్నారు. ప్రజల్లో సైతం ఏజెన్సీలోని ప్రభుత్వాసుపత్రుల పట్ల భరోసా ఏర్పడుతుంది. అక్కడక్కడ కొందరు వైద్యులు నిర్లక్ష్యం చేయకుంటే ప్రైవేట్ ఆసుపత్రిలో దోపిడీకి గురవుతున్నాం రోగులు ఇంకా పెద్ద మొత్తంలో ప్రభుత్వ ఆసుపత్రుల బాధపడతారు. గతంలో విషజ్వరాలు విజృంభిస్తే ప్రైవేట్ కి వెళ్లి వేలు, లక్షలు వెచ్చించి వారు. పేదలకైతే మరణమే శరణమయ్యేది. కాని నేడు స్థానికంగానే ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్యం లభిస్తుంది. చాలా ఖరీదైన ఔషధాలు కూడా సరఫరా అవుతున్నాయి. ప్రభుత్వ ఆసుపత్రిలో రక్తనమున ల్యాబ్లను కూడా ఆధునికరించి ప్రైవేట్ ల్యాబ్లో దోపిడీకి గురికాకుండా అరికట్టగలిగారు. ?ఇటీవల గొంతు కోసుకున్న ఒక వ్యక్తికీ సుపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో కావాల్సిన ఆపరేషన్ ను పాల్వంచ సామాజిక ఆసుపత్రికి చేసి విజయవంతంగా ప్రాణాల కాపాడిన ఘనత కూడా డాక్టర్ రవిబాబు సారధ్యంలో జరిగింది. ఈ విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే కోణంనేని సాంబశివరావు సైతం ఇటీవల ఒక ప్రకటనలో వైద్యుల శ్రమను అభినందించారు.

గత మూడు సంవత్సరాలుగా నిరంతర కృషి, కింద స్థాయి సిబ్బంది పై పర్యవేక్షణ, సమన్వయం చేస్తూ ఎన్నో సవాళ్లు ఎదుర్కొంటూ జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ దిశా నిర్దేశంలో రాష్ట్ర స్థాయి అధికారులను ఒప్పించి, మెప్పించి చర్ల లాంటి తీవ్ర మావోయిస్టు ప్రభావిత మారుమూల ఆసుపత్రులలో సైతం సేవలకు అంకురార్పణ చేసారు. నిరంతరం పేదవారికి స్థానికంగా ఉచిత నాణ్యమైన సేవలు అందాలని ఆసుపత్రుల అభివృద్ధికి కృషిచేస్తున్న డి సి హెచ్ఎస్ డాక్టర్ రవి బాబు, అతని సిబ్బందిని జిల్లా ప్రజలు అభినందిస్తున్నారు. రాబోయే కొత్త సంవత్సరంలోనూ ప్రభుత్వ వైద్యం ఇంకా కొత్త పంతులు తొక్కలని పేదలకు దగ్గర అవ్వాలని జిల్లా ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.

దమ్మపేటలో వీధి కుక్కల స్వైరవిహారం..

భయం గుప్పిట్లో జనం

విశాలాంధ్ర, దమ్మపేట : దమ్మపేట మండల కేంద్రంతో పాటు పరిసర గ్రామాల్లో వీధి కుక్కలు స్వైరవిహారం రోజురోజుకు పెరిగిపోతుంది. ఒక ముఠాల ఏర్పడి గుంపులు గుంపులుగా తిరుగుతూ బాటసారులపై దాడులు చేస్తున్నాయి. ఉరుకులు పరుగులతో ప్రాణాలు అరిచితుల్లో పెట్టుకొని కుక్కల బారి నుంచి తప్పించుకోవటం దినచర్యగ మారింది. ముఖ్యంగా పాఠశాలలకు వెళ్లి వచ్చే చిన్నారులు, బజారు కెళ్ళి వచ్చే వృద్ధుల విషయంలో ఈ కుక్కలు సైన్యం భయం గొలుపుతుంది. ఈ పరిణామాలతో పిల్లలను బయటికి ఒంటరిగా పంపించాలంటే తల్లిదండ్రులు భయపడిపోతున్నారు. గతంలో కుక్కల దాడి అనేక సంఘటనలు జరిగాయి. గతంలో జరిగిన కొన్ని ఘటనల్లో కుక్కల దాడిలో చిన్నారులు తీవ్రంగా గాయపడ్డ ఉదంతాలు ఉన్నాయి. ప్రాణాపాయ స్థితిలో ఆసుపత్రుల పాలైన సంఘటనలు అనేకం జరిగాయి. పాఠశాలకు వెళ్లాలన్నా, వీధుల్లో ఆడుకోవాలన్నా పిల్లలు వణికిపోతున్నారు. ఒంటరిగా వెళ్లే పాదచారులను వెంబడించి మరీ కరుస్తున్నాయని స్థానికులు వెల్లడిస్తున్నారు. ప్రజలకు ప్రమాదకరంగా మారిన నేపథ్యంలో వీధి కుక్కలను నివారించాలని ఇటీవల సుప్రీంకోర్టు ఆదేశాలు కూడా జారీచేసిన సందర్భం ఉంది. కుక్కల నివారణ విషయంలో?అధికారుల నిర్లక్ష్యంపై స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏదైనా పెద్ద సంఘటన జరిగి పిల్లలు లేదా పెద్దలు ప్రాణాలు కోల్పోతే తప్ప స్పందించే పరిస్థితి ఇక్కడ కనిపించడం లేదు. కొత్తగా ఏర్పడ్డ గ్రామ పంచాయతీ పాలకవర్గం, స్థానిక అధికారులైన ఈ కుక్కల సమూహాల బెడద నుంచి కాపాడాలని డిమాండ్ వినిపిస్తుంది. కుక్కల నియంత్రణకు కనీస స్థాయిలో చర్యలు తీసుకోవాల్సిన అవసరం కూడా ఉంది. ప్రతి నెల కుక్కల సంఖ్య పెరుగుతూనే పోతుంది. కుక్కలకు జనన నియంత్రణ శ స్త్రచికిత్సలు చేయడంతో పాటు, ప్రమాదకరంగా మారిన కుక్కలను జనావాసాల నుంచి దూరంగా తరలించాలని ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

అపరిశుభ్రతకు చిరునామా కొత్తగూడెం ప్రభుత్వం దవఖానా

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : జిల్లా కేంద్రంలో ఉన్న ప్రభుత్వ దావకానాలు వైద్యులు సిబ్బంది నిర్లక్ష్యం పై అనేక విమర్శలు వస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు ఎవరు పట్టించుకోవడం లేదని విమర్శలున్నాయి. జిల్లాలోని ముఖ్యమైన ఆసుపత్రి అయిన ఇక్కడ వైద్య సేవలు మానవత్వంతో చేపట్టాలని అనేకసార్లు సందర్శించిన స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు వైద్యులకు, సిబ్బందికి సూచనలు ఇచ్చినప్పటికీ పట్టించుకునే పరిస్థితి కనిపించడం లేదని ఆరోపణలు వస్తున్నాయి. ఎమ్మెల్యే విశ్వప్రయత్నాలతో కార్పొరేట్ స్థాయి వైద్యం అందించాలని ఈ ఆసుపత్రిలో ఆధునిక యంత్రాలు సమకూర్చినప్పటికీ వాటి వినియోగం నామమాత్రం కూడా చేయటం లేదని తెలుస్తుంది. ఇక్కడి వైద్యులు తమ ప్రైవేటు ఆసుపత్రిలో చూపించినంత శ్రద్ధ ప్రభుత్వ ఆసుపత్రిలో చూపించడం లేదని విమర్శలున్నాయి. దానికి తోడు శుభ్రత విషయంలో కూడా నిర్లక్ష్య ధోరణి కనిపిస్తుంది. ఈ ఆసుపత్రికి అచ్చంగా పేద దిగువ మధ్యతరగతి ప్రజలు అధికంగా వస్తుంటారు. వారి పట్ల వైద్యులు సిబ్బంది ప్రవర్తించే తీరు చాలా విమర్శలకు దారితీస్తుంది. ఆసుపత్రి ఆవరణలో ఒక్కసారి లోపటికి గదుల్లో కూడా కుక్కలు విశ్రాంతి తీసుకునే చిత్రాలు అనేక అనేక సందరాల్లో బయట పడ్డాయి కూడా. కుక్కలు లోపట దూరి వస్తున్నప్పటికీ అక్కడ ఉన్న సిబ్బంది ఏ మాత్రం లెక్కచేయాలని ఇక్కడ వచ్చే రోగులు వెల్లడిస్తున్నారు. ఆవరణలో ఒక్కోసారి లోపటికి గదుల్లో ఆవులు కూడా దర్శనమిస్తూ పోతుంటాయి. వైద్యం కోసం వాడే పరికరాలు, ఔషధ వ్యర్థాలు, హానికరమైన నీడిల్స్ వ్యర్థాలను హాస్పిటల్ ఆవరణలోనే వేస్తుండగా అవి కుప్పలుగా పడి మున్సిపాలిటీ పారిశుద్ధ కార్మికుల కోసం రోజుల తరబడి కుప్పలు ఎదురు చూస్తుంటాయి. ఆసుపత్రి సిబ్బంది వ్యర్థాలను బహిరంగంగా పడ వేయకుండా ఆసుపత్రి అధికారి చర్యలు తీసుకుంటే బాగుంటుందని రోగులు అంటున్నారు. అన్ని విధాల ఈ ఆసుపత్రికి పట్టిన రోగం వీడేది ఎప్పుడో అని రోగులు వారి బంధువులు ఎదురుచూస్తున్నారు.

డ్రైనేజీలు లేక ఇబ్బంది పడుతున్న కోదాడ ప్రజలు

పట్టించుకోని మున్సిపాలిటీ ఇంజనీరింగ్ అధికారులు..

ఫిర్యాదు చేస్తేనే పనిచేస్తాం అంటున్న డి.ఈ.సాయిలక్ష్మి..?

విశాలాంధ్ర - కోదాడ : కోదాడ ఎమ్మెల్యే ఎన్.ఉత్తమ్ పద్మావతి రెడ్డి కోదాడ ను రాష్ట్రంలోనే అభివృద్ధి పథంలో అగ్రస్థానంలో నిలపాలని కృషి చేస్తున్నారు.

అలాంటిది కోదాడ మున్సిపాలిటీ ఇంజనీరింగ్ అధికారుల తీరు మాత్రం,పూర్తి విరుద్ధంగా ఉంది అనడంలో అతిశయోక్తి లేదని పట్టణ ప్రజలు వాపోతున్నారు.

మున్సిపాలిటీ ఇంజనీరింగ్ విభాగం అనేది మున్సిపాలిటీ అభివృద్ధిలో ఒక ముఖ్యమైన భాగం.ఇది మున్సిపాలిటీలో రోడ్లు,డ్రైనేజీ,వాటర్ సప్లై లాంటి సదుపాయాలను నిర్మించడం మరియు నిర్వహించడంలో ముఖ్య భూమిక పోషిస్తుంది. మున్సిపాలిటీ ఇంజనీరింగ్ విభాగంలోని ఇంజనీర్లు పట్టణ మౌలిక సదుపాయాల నిర్మాణం,నిర్వహణ మరియు పట్టణ అభివృద్ధికి ముఖ్య బాధ్యతలు వహించాలి. కానీ కోదాడ మున్సిపాలిటీకి చెందిన ఇంజనీరింగ్ అధికారులు విధుల పట్ల నిర్లక్ష్యపు వైఖరి ప్రదర్శిస్తున్నారనే వాదన బలంగా వినిపిస్తుంది.కోదాడ మున్సిపాలిటీలో కొన్ని చోట్ల డ్రైనేజీ నిర్మాణాలు లేకపోవడంతో స్థానిక ప్రజలు చాలా ఇబ్బందికి గురవుతున్నారు.

కోదాడ విద్యారంగం మరియు వివిధ రంగాలలో ప్రఖ్యాత చెందిన ప్రాంతం. కోదాడకు చుట్టు ప్రక్కల వారే కాకుండా,ఇతర రాష్ట్రాలు మరియు జిల్లాల నుండి కూడా చాలామంది వస్తుంటారు.అలాంటిది పట్టణ ఇంజనీరింగ్ అధికారులు మాత్రం కొన్నిచోట్ల అసలు డ్రైనేజీ నిర్మాణాలు చేపట్టడంలో విఫలం అయ్యారని,దీంతో ఇండ్ల నుండి వచ్చేటటువంటి మురుగునీరు ఎటు వైపు వెళ్ళాలో ఇంజనీరింగ్ అధికారులే సమాధానం చెప్పాలని పట్టణ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.డ్రైనేజీలు లేకపోవడం వలన మురుగునీరు ఇండ్ల పరిసర ప్రాంతాల్లో నిల్వ ఉండడంతో స్థానిక ప్రజలు అనారోగ్యాల భారిన పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. కావున తక్షణమే కోదాడ ఎమ్మెల్యే ఎన్.ఉత్తమ్ పద్మావతి రెడ్డి మరియు జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ స్పందించి సదరు అధికారుల పై చర్యలు తీసుకోవాలని,కోదాడ పట్టణంలో డ్రైనేజీలు లేని చోట వెంటనే నిర్మాణాలు చేపట్టేలా కృషి చేయాలని పుర ప్రజలు కోరుకుంటున్నారు.

ఫిర్యాదు చేస్తేనే పని చేస్తాం..?

సాయి లక్ష్మి,
డిప్యూటీ ఇంజనీర్,కోదాడ మున్సిపాలిటీ..

ఇదే విషయమై కోదాడ మున్సిపాలిటీ డిప్యూటీ ఇంజనీర్ సాయి లక్ష్మి ని వివరణ అడగగా పట్టణంలో డ్రైనేజీలు లేక ఎవరైనా ఇబ్బంది పడుతున్నట్లయితే ఫిర్యాదు చేయాలని,బడ్జెట్ ఉంటే ఏది అత్యవసరమో చూసి పనులు ప్రారంభిస్తామన్నారు.

అడవిలో బోర్లు వేస్తున్న వ్యక్తులపై కేసు నమోదు

విశాలాంధ్ర -కారేపల్లి : ఖమ్మం జిల్లా అటవీ విభాగ పరిధిలోని చీమలపాడు రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతంలో అక్రమ కార్యకలాపాలపై అటవీ శాఖ అధికారులు కఠిన చర్యలు చేపట్టినట్లు ఫారెస్ట్ డివిజనల్ అధికారి వి. మంజుల తెలిపారు.సోమవారం అటవీ శాఖ డివిజనల్ అధికారి మంజుల తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం తెల్లవారుజామున అందిన విశ్వసనీయ సమాచారంతో చీమలపాడు సెక్షన్‌కు చెందిన అటవీ సిబ్బంది పి కిషోర్ కుమార్ ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ బి సైదా,బీట్ ఆఫీసర్ డి శ్రీకాంత్ తోపాటు ఖమ్మం స్పెషల్ టీం ఫారెస్ట్ డివిజినల్ అధికారి,ఖమ్మం,చీమలపాడు అటవీ సిబ్బంది,ఖమ్మం టీమ్ సహకారంతో సంయుక్తంగా తనిఖీలు నిర్వహించగా రాగబోయినగూడెం-నార్త్ బీట్,కంపార్ట్మెంట్ నం14/2లో అక్రమంగా ప్రభుత్వ అనుమతి లేకుండా రిజర్వ్ ఫారెస్ట్‌లో అక్రమంగా ప్రవేశించి బోర్‌వెల్ త్రవ్వకము నిర్వహిస్తున్నట్లు నిర్ధారణ అయిందని తెలిపారు.ఈ సందర్భంగా టీఎస్12 ఈకె3699,ఏపి 04 ఈ పి 3294 నంబర్లు గల బోర్‌వెల్ రెండు లారీలను అధికారులు స్వాధీనం చేసుకున్నారన్నారు.ఈ ఘటనకు సంబంధించి ముగ్గురు నిందితులపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు. అటవీ భూముల పరిరక్షణలో భాగంగా రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతాల్లో అక్రమ తవ్వకాలు, అక్రమ రవాణా వంటి చర్యలపై కఠినమైన పరిరక్షణ విధానాలను పాటిస్తున్నామని, అటవీ చట్టాలను ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు.అటవీ ప్రాంతాల్లో ఏవైనా అక్రమ కార్యకలాపాలు గమనించిన పక్షంలో ప్రజలు వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

పెన్షనర్లు రెన్యువల్ కోసం డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించాలి : జియం కిరణ్ కుమార్

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : సిఎం పిఎఫ్ పెన్షనర్లు, సిపిఆర్ ఎంఎస్ కార్డుదారులు రెన్యూవల్ కోసం డిజిటల్ లైఫ్ సర్టిఫికేట్ సమర్పించాలని జిఎం (పర్సనల్) వెల్ఫేర్ అండ్ సిఎస్ఆర్ జి వి. కిరణ్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. సింగరేణి సంస్థలో పని చేసి పదవీవిరమణ పొంది పెన్షన్ తోపాటు సిపిఆర్ ఎంఎస్ స్కీమ్ ద్వారా హెల్త్ కార్డ్ పొందిన ఉద్యోగులు 2026 సంవత్సరానికి గాను రెన్యువల్ కొసం లైఫ్ సర్టిఫికెట్ అనివార్యమన్నారు. ప్రతీ ఏటా ఈ ప్రక్రియ నవంబర్ నెలలోనే లైఫ్ సర్టిఫికెట్ ను సమర్పించాల్సి ఉంటుం దన్నారు. కానీ ఇప్పటివరకు చాలా మంది మాజీ ఉద్యోగులు తమ లైఫ్ సర్టిఫికెట్ ను సమర్పించలేదని జియం వెల్లడించారు. సింగరేణి సంస్థ వ్యాప్త ముగా సిపిఆర్ఎంఎస్ మెడికల్ కార్డుల మొత్తం 43,358 కార్డుదారులకు 81,595 లబ్దిదారులకు (ఉద్యోగి వారి భాగస్వామి) గాను ఇప్పటి వరకు కేవలం 66,902మంది మాత్రమే లైఫ్ సర్టిఫికెట్ సమర్పించటం జరిగిన దన్నారు. మిగిలిన 14,693 లబ్ది దారులు నిరాటంకమైన పెన్షన్, వైద్య సేవలు పొందటానికి లైఫ్ సర్టిఫికెట్ ను త్వరగా సమర్పించాలని జిఎం కోరారు. సిఎంపిఎఫ్ పెన్షన్ కొరకు సింగరేణి వ్యాప్త ముగా మొత్తం 88,100 పెన్షన్ దారులకు గాను ఇప్పటి వరకు 72, 212 మంది పెన్షన్ దారులు మాత్రమే లైఫ్ సర్టిఫికెట్ సమర్పించటం జరిగిన దన్నారు. ఇంకా 15,888 మంది సర్టిఫికెట్ సమర్పించాల్సి ఉందన్నారు. దగ్గరలోని మీసేవా కేంద్రం వద్దనైనా పొందు పరచి సర్టిఫికెట్లు తీసుకోవాలని తద్వారా పెన్షన్, వైద్య సేవలు పొందవలసిందిగా ఆయన కోరారు.

పెరిక వర్గం సంక్షేమం అభివృద్ధికి ఐక్యంగా పోరాడుదాం

రాష్ట్ర అధ్యక్షుడు ఎర్రం శెట్టి ముత్తయ్య



విశాలాంధ్ర, కరకగూడెం : అన్ని రంగాల్లో వెనుకబడిన పెరిక కుల ప్రజల సంక్షేమం అభివృద్ధి కోసం ఎవరో వస్తారని ఏదో చేస్తారని ఎదురు చూడకుండా ఐక్యంగా కృషి చేస్తే ఫలితాలు ఉంటాయని రాష్ట్ర పెరిక సంఘం అధ్యక్షులు యర్రంశెట్టి ముత్తయ్య పిలుపునిచ్చారు. జిల్లా పురగిరి క్షత్రియ (పెరిక) సంఘం ముఖ్య కార్యవర్గ సమావేశం సోమవారం జరిగింది. నూతన కమిటీ ఎన్నిక సమావేశం జనవరి 4 వ తేదీన పాల్వంచ పెద్దమ్మ తల్లి ఆలయం వద్ద భవానీ ఫంక్షన్ హాల్ లో జరగనున్నట్లు అందరూ హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన తోపాటు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి రంగారావు , భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కన్వీనర్ అంకతి ఉమామహేశ్వరరావు , జిల్లా కార్యదర్శి పూజారి వెంకటేశ్వర్లు, రాష్ట్ర నాయకులు తిప్పని శ్రీనివాసరావు లు కోరారు. ఈ సందర్భంగా నాయకులు కరకగూడెం మండలంలోని అనంతారం, కరకగూడెం, భట్టుపల్లి గ్రామాలలో పెరిక సంఘం కర పత్రాలను ఆవిష్కరించారు. కుల ఐక్యతగా వున్నపుడే మనకు గుర్తింపు ఉంటుందని సంక్షేమ అభివృద్ధి కూడా అప్పుడే జరుగుతుందని నాయకులు తెలిపారు. జిల్లాలోని సంఘంలోని 41 గ్రామాల పేద కుటుంబంలోని వారికి 41 కుట్టు మిషన్లు హైద్రాబాద్ సంఘీ యులు కానుగంటి శ్రీనివాస్ అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు అంకతి మల్లికార్జున్ రావు , చిట్టి వెంకటేశ్వర్లు, అత్తె నాగేశ్వరరావు, కొమ్ము ప్రసాద్, అత్తె సత్యం, బాలరాజు, నాగేశ్వరరావు, సారయ్య, కటకం నరసింహారావు, బుడగం రాము, ముద్దం సాంబయ్య, బుస్సీ శ్రీను, యగ్గడి శ్రీరాం, సత్యం, అచ్చ నవీన్, జానకిరావు, ఆకిరెడ్డి సతీష్, బరపటి వెంకన్న, అనంతరం ఉప సర్పంచ్ పూజారి వెంకన్న, కరకగూడెం ఉప సర్పంచ్ బుడగం రాము తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ

విశాలాంధ్ర -ఖమ్మం : ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డితో కలిసి ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. నేలకొండపల్లి గ్రామానికి చెందిన ఐతనబోయిన ఉమ సింగరెడ్డి పాలెం రెవెన్యూ నందు సర్వే నెంబర్ 131,132, 132ఇ లలో తమకు ఉన్న భూమి రాజకీయ పలుకుబడితో కొంతమంది ఆక్రమించాలని చూస్తున్నారని, బెదిరిస్తున్నారని, తమకు న్యాయం చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, కలెక్టరేట్ ఈ విభాగం పర్యవేక్షకులకు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ తెలిపారు. ఖమ్మం రూరల్ మండలం ఏదులాపురంకు చెందిన నంద్యాల శ్రీనివాస రావు ప్రభుత్వ సీలింగ్ భూమి సర్వే నెంబర్ 101,104 లో గల 13 ఎకరాలను 13 మంది నిరుపేదలకు 1976-77 లో ఇందిరా గాంధీ ప్రభుత్వం పంపిణీ చేయడం జరిగిందని, అట్టి భూమిని కొంతమంది ఆక్రమించుకున్నారని, ప్రభుత్వం స్పందించి భూమిని స్వాధీనం చేసుకుని పట్టాదారులకు తిరిగి ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, కలెక్టరేట్ ఏఓకు వ్రాస్తూ పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. వైరా మండలం రెబ్బవరం గ్రామానికి చెందిన సుబ్బమ్మ తన కుమారుడు 30 గుంటల భూమిని బలవంతంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడని తన భూమి తిరిగి ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, జిల్లా సంక్షేమ అధికారికి అవసరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ తెలిపారు. తిరుమలాయపాలెం మండలం ఇస్లావత్ తండాకు చెందిన ఇస్లావత్ బుజ్జి తనకు సదరం సర్టిఫికెట్ లో వికలాంగత్వం తప్పుగా నమోదు కావడం వల్ల దివ్యాంగుల పెన్షన్ ఆగిపోయిందని తనకు సరైన సర్టిఫికెట్ జారీ చేసి దివ్యాంగుల పెన్షన్ వచ్చేలా చూడాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారితో అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ఇట్టి ప్రజావాణి కార్యక్రమంలో డిఆర్ఓ ఏ. పద్మశ్రీ, జెడ్పీ సీఈఓ దీక్ష రైనా, డీఆర్డిఓ సన్యాసయ్య, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏఓ కె. శ్రీనివాస రావు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

బుక్, పెన్, పెన్సిల్ లతో నూతన సంవత్సర శుభాకాంక్షలు

జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

విశాలాంధ్ర -ఖమ్మం : బుక్స్, పెన్స్, పెన్సిల్స్ లతో నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియ జేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖమ్మం జిల్లా కలెక్టర్‌కు 2026 నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేయడానికి వచ్చే అధికారులు, ప్రభుత్వ సిబ్బంది, ఇతర ప్రజా ప్రతినిధులు ప్రజలు బోకేలు, శాలువాలకు బదులుగా నోట్ బుక్స్, పెన్స్, పెన్సిల్స్ తీసుకుని రావాలని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

రౌడీషీటర్లకు పోలీస్ కౌన్సెలింగ్ : టౌన్ ఏసీపీ

విశాలాంధ్ర -ఖమ్మం క్రైమ్ : పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు సోమవారం ఖమ్మం నగరలోని రౌడీషీటర్లకు టౌన్ ఏసీపీ రమణమూర్తి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఏసీపీ కార్యాలయంలో ఒక్కొక్కరి నుంచి పూర్తి వివరాలు తెలుసుకున్నారు. వారు ఎక్కడెక్కడ నివాసం ఉంటున్నారు.. ఏం పని చేసి జీవిస్తున్నారో ఆరా తీశారు. నేరప్రవృత్తిని మార్చుకోవడానికి ఒక అవకాశం ఇస్తున్నామని, ఒకవేళ మారకపోతే కఠినంగా వ్యవహరించాల్సి వస్తుందని పెర్కొన్నారు. గతంలో నేరాలకు పాల్పడిన పాత నేరస్తులు, రౌడీషీటర్లు, నేర స్వభావం గలవారు తమ నేర ప్రవృత్తిని వీడి సమాజంలో మంచి నడవడికతో కొనసాగాలని, కాదని ఎవరైనా యధావిధిగా నేరాలకు పాల్పడుతున్నట్లు తేలితే ప్రివెంటివ్ డిటెన్షన్ (పీడీ) యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ భూముల కబ్జాలకు పాల్పడే రౌడీషీటర్లు, రియల్టర్లపై పోలీసులు దృష్టి సారించినట్లు తెలిపారు. నగరంలో జరిగే నేరాల్లో ఎక్కువగా రౌడీ షీటర్లే నిందితులుగా ఉంటున్నారని, సివిల్ వివాదాల్లో జోక్యం చేసుకుని దాడులకు దిగుతూ.. పోలీస్ రికార్డుల్లోకి ఎక్కుతున్న నేపథ్యంలో వారిపై ప్రత్యేక నిఘా పెట్టి కట్టడి చేయడంలో భాగంగా ముందుగా కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. రౌడీ షీటర్ ఉన్న ప్రతీ ఒక్కరిపై ప్రత్యేక నిఘా ఉంటుందని, చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేస్తే ఎవరిని ఉపేక్షించేది లేదన్నారు. గత కొంత కాలంగా తమ వైఖరిని మార్చుకుని ఏలాంటి నేరాలు పాల్పడకుండా, పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదు కాకుండా సత్ప్రవర్తనతో వున్న పాత నేరాస్థులను ఒక్కొక్కరి కేసు డైరీని పరిశీలించి వారిపై వున్న రౌడీషీట్ ను తొలగించారు. నేరాలు పునరావృతం పరిణామాలు ఉంటాయని, తిరిగి రౌడీ షిట్ తెరుస్తామన్నారు. ఎక్కడైనా రౌడీషీటర్లు, నేరస్తులు ఇబ్బంది పెడుతుంటే తమ దృష్టికి తీసుకురావాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

జనవరి 4 న పెన్షనర్ల సదస్సు..

డైరీ ఆవిష్కరణ, సీనియర్ పెన్షనర్లకు సన్మానం



విశాలాంధ్ర -ఖమ్మం : రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సమస్యల, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలు గురించి చర్చించేదుకై జనవరి 4 న పెన్షనర్ల సదస్సు నిర్వహిస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం (ఎస్జిపిఏటి)రాష్ట్ర కార్యదర్శి వి మేరిఏసుపాదం, జిల్లా అధ్యక్షులు పరిశపుల్లయ్య తెలిపారు. సోమవారం ఉదయం కృషిభవన్ లో జిల్లా అధ్యక్షులు పరిశపుల్లయ్య అధ్యక్షతన జరిగిన కార్యనిర్వాహకవర్గ సమావేశంలో మేరిఏసుపాదం మాట్లాడూతూ పెన్షనర్ల బకాయిలు చెల్లింపులు సకాలంలో చేయనందుకు పెన్షనర్లు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం పెన్షనర్ల బకాయిలు సత్వరం చెల్లింపులు జరిగేలా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. జనవరి4 న జరిగే పెన్షనర్ల సదస్సులో రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జాతీయ నాయకులు, రాష్ట్ర భాధ్యులు పాల్గొంటున్నారని, ఈ సదస్సు లో పెన్షనర్ల సమస్యలు చర్చిస్తామని ఎస్జిపిఏటి జిల్లా అధ్యక్షులు పరిశపుల్లయ్య తెలిపారు. పెన్షనర్ల సదస్సు అనంతరం ఎస్జిపిఏటి 2026 డైరి ఆవిష్కరణ తో పాటు సీనియర్ పెన్షనర్లకు సన్మానం చేస్తామని పరిశపుల్లయ్య చెప్పారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రాయలరవికుమార్, ఆర్థిక కార్యదర్శి గుర్రాల శ్రీనివాసరావు, సంయుక్త అధ్యక్షులు కనపర్తి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు పెదమళ్ళ సత్యనారాయణ,జల్లావెంకటేశ్వర్లు, బోజెడ్లకృష్ణ కుమారి, తాడిఅంజలి,బెల్లం రాధాకృష్ణ మూర్తి, పివిఆర్కెవి ప్రసాదరావు, జిమధుకర్ రెడ్డి, కనపర్తి నాగప్రసాద్, చాపలమడుగు సుధాకర్ యంవెంకటరామనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

మాట ఇస్తే మడమ తిప్పని దాసరి కుటుంబం

వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు

విశాలాంధ్ర- సత్తుపల్లి: మాట ఇస్తే మడమ తిప్పని కుటుంబం దాసరి చిట్టి నాయన కుటుంబమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఈ నెల 17వ తారీకు జరిగిన స్థానిక సంస్థల సంస్థల ఎన్నికల్లో గంగారం గ్రామ పంచాయితీ లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థిని గెలిపిస్తే గ్రామంలో తన సొంత నగదుతో ఇంటిగ్రేటెడ్ పంచాయతీ భవనాన్ని నిర్మిస్తానని కాంగ్రెస్ నాయకుడు దాసరి చిట్టి నాయన కుమారుడు దాసరి మధుమోహన్ రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా ఆదివారం ఇంటిగ్రేటెడ్ పంచాయతీ భవనాన్ని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు చేత శంకుస్థాపన చేయించారు. అనంతరం జరిగిన సభలో మంత్రి తుమ్మల నాగేశ్వరావు మాట్లాడుతూ దాసరి వీరారెడ్డి దగ్గర నుంచి చిట్టి నాయన మధుమోహన్ రెడ్డి వరకుఈ గ్రామానికి పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని కొనియాడారు. అందరూ సంపాదిస్తారు కానీ తాము సంపాదించిన దాంట్లో పేద ప్రజలకు సేవ చేయాలనే వారు కొందరే ఉంటారని అటువంటి వారిలో దాసరి వీరారెడ్డి కుమారుడు దాసరి చిట్టి నాయన, మనుమడు దాసరి మధుమోహన్ రెడ్డి ముందుంటారని వారి సేవలను కొనియాడారు. దాసరి మధు మోహన్ రెడ్డి తన కష్టార్జితం లో నుంచి గ్రామ ప్రజల అవసరం నిమిత్తం సుమారు 75 లక్షల అంచనా వ్యయంతో ఇంటిగ్రేటెడ్ గ్రామపంచాయతీ భవనాన్ని నిర్మించేందుకు ముందుకు రావడం గొప్ప విషయమని మంత్రి తుమ్మల కొనియాడారు. గతంలో కూడా దాసరి మధుమోహన్ రెడ్డి కుటుంబం ఈ గ్రామంలో అన్ని కులాల వారికి కమ్యూనిటీ భవనాల నిర్మించి వారి ఉదారతను చాటుకున్నారని మధుమోహన్ రెడ్డి కుటుంబం సేవలను కొనియాడారు. గంగారం, రామ గోవిందాపురం గ్రామపంచాయతీల అభివృద్ధికి తన వంతు సహకరిస్తానని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు.

సత్తుపల్లి నియోజకవర్గం రాష్ట్రంలోనే అత్యంత ప్రాధాన్యత కలిగిన ప్రాంతంగా పేరు ఉందని జలగం వెంగళరావు తర్వాత ఈ ప్రాంతాన్ని అంత అభివృద్ధి చేసే అదృష్టాన్ని ఆ దేవుడి ఆశీస్సులతోపాటు సత్తుపల్లి నియోజకవర్గ ప్రజలు ఇచ్చారన్నారు. నిబద్ధత కలిగిన రాజకీయాల ద్వారానే ఎక్కువ కాలం రాజకీయంగా మనుగడ సాధించవచ్చు అన్నారు. ఎమ్మెల్యే మట్ట రాగమయి దయానంద్ మాట్లాడుతూ దాసరి మధుమోహన్ రెడ్డి కుటుంబం తమ గెలుపులో కూడా ఎంతో సహకరించారని, గంగారం గ్రామపంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి కాకర్ల రేవతి విజయం సాధించడంలో దాసరి కుటుంబం పాత్ర ఎనలేనిదని కొనియాడారు. ఎన్నికల హామీల్లో భాగంగాఎన్నికలు జరిగిన పది రోజుల్లోనే చెప్పిన విధంగా పంచాయతీ భవనం నిర్మాణానికి శంకుస్థాపన చేశారన్నారు. ముందుగా ప్రకాష్ నగర్ లో 50 లక్షల అంచనా వ్యయంతో సిసి రోడ్లు డ్రైనేజీల నిర్మాణానికి మంత్రి తుమ్మల శంకుస్థాపన చేశారు. మొత్తంగా కోటి 25 లక్షల సొంత నిధులతో దాసరి మధుమోహన్ రెడ్డి కుటుంబం గ్రామాభివృద్ధికి తోడ్పడటం హర్షణీయమని గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్. కల్లూరు ఏసిపి వసుంధర యాదవ్. రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్, గంగారం గ్రామ సర్పంచి కాకర్ల రేవతి,రామ గోవిందాపురం సర్పంచి మందపాటి మౌనిక రెడ్డి, దాసరి చిట్టి నాయన, బెజవాడ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ చట్టానికి తూట్లు..

పేదల జీవితాలతో చెలగాటం కాంగ్రెస్ నేతలు



విశాలాంధ్ర - ఖమ్మం : ఉపాధి హామీ చటానికి తూట్లు పొడిచి పేదల జీవితాలతో కేంద్ర ప్రభుత్వం చాలగటం ఆడుతోందని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. వైరా మండల పరిధిలో పెద్దగోపతి, స్నానాల లక్ష్మీపురం గ్రామాల్లో ఆర్ జి పి ఆర్ ఎస్ ఇంచార్జీ సుభాష్ యాకత్ర, పీసీసీ మెంబర్, జోనల్ కోఆర్డినేటర్ మహ్మద్ జావేద్, పిసిసి మెంబర్ వడ్డే నారాయణ ల ఆధ్వర్యంలో ఉపాధి హామీ పథకం గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందరరేగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం అనేది ఒక చట్టబద్ధమైన పథకముని ప్రజలు పని కావాలని ప్రభుత్వాన్ని కోరితే ప్రభుత్వం పని కల్పించాలి లేదా పరిహారం చెల్లించాల్సి ఉంటుందన్నారు. కానీ ఇప్పుడు బీజేపీ ప్రభుత్వం దీనికి విరుద్ధంగా వ్యవహరిస్తూ ప్రజల ప్రజల హక్కును ప్రభుత్వ దయాదాక్షణ దాక్షిణ్యంగా మార్చిందని అన్నారు. గతంలో పజ్రలు ప్రతి ఏటా 100 రోజుల వరకు పనిని డిమాండ్ చేయవచ్చు .ఇప్పు డు: పభ్రుత్వం మీ పంచాయతీని గుర్తించి, బడ్జెట్ కేటాయిస్తేనే పజ్రలకు పని లభిస్తుందని అన్నారు. గతంలో ఏ గ్రామీణ ప్రాంతంలోనైనా పజ్రలు పని కోరవచ్చు ఇప్పు డు, కేంద్రపభ్రుత్వం వీబీ గ్రాంజి కింద ఏ పంచాయతీని అయితే నోటిఫైచేస్తుందో, అక్కడ మాతమ్రే పని దొరుకుతుంది అని అన్నారు. మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టి పేదలకు పని హక్కు కల్పించి ఒక ధైర్యాన్నిస్తే ప్రస్తుత బీజేపీ ప్రభుత్వం ఆ పథకం పేరు మార్చి గాంధీ పేరు తీసేసి వేదన హక్కును కాల రాసిందని వివరించారు. గతంలోఏడాదిపొడవునా పని కల్పించే వారు. ఇప్పు డు వ్యవసాయ రద్దీసమయంలో 60 రోజుల పాటు పనిని నిషేధించారనీ అన్నారు. దీనివల్ల పజ్రలు తక్కు వ వేతనానికి, కనీస వేతనం కంటేతక్కు వ ధరకేవ్యవసాయ కూలీలుగా వెళ్లాల్సి న పరిస్థితి ఏర్పడుతుంది అని అన్నారు.

గతంలో కేంద్రమే వేతనాలు చెల్లించేదని ఆలస్యమైతేపరిహారం కూడా ఇచ్చేదని అన్నారు. ఇప్పు డు: కేంద్రం 60% మాత్రమే ఇస్తుందనీ రాష్ట్రాలు 40% భరించాలనీ రాష్ట్రాల వద్ద నిధులు లేకపోతే వేతనాల్లో జాప్యం పెరిగి ప్రజలు ఇబ్బందులు పడే పరిస్థితులు ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు. ఫలితంగా వీబీ గ్రామ్జీ వల్ల నిరుద్యోగం పెరుగుతుందని, కనీస వేతనం లేకుండా ప్రజలు శ్రమ దోపిడీకి గురయ్యే అవకాశం ఉందని అన్నారు. పట్టణానికి వలసలు పెరిగి స్థానిక జీవనోపాధి దెబ్బతినే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక పనులు నిర?యించే అధికారాన్ని గ్రామపంచాయతీలు కోల్పోతాయని అన్నారు.

సిపిఐ శతజయంతి ఉత్సవాలను జయప్రదం చేయండి

జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్

విశాలాంధ్ర ప్రతినిధి - మంచిర్యాల జిల్లా/రామకృష్ణాపూర్ : భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) వంద ఏళ్ల ప్రస్థానాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న శతజయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించి, జయప్రదం చేయాలని మంచిర్యాల సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ కార్యకర్తలకు, ప్రజలకు పిలుపునిచ్చారు. సోమవారం రామకృష్ణాపూర్ లోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన పట్టణ కౌన్సిల్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.

1925 డిసెంబర్ 26న కాన్పూర్‌లో ఆవిర్భవించిన సీపీఐ నేటికీ ప్రజల పక్షాన నిలబడి పోరాడుతోంది. ఈ శతజయంతి ఉత్సవాల ముగింపు సభను జనవరి 18న ఖమ్మంలో లక్షలాది మందితో భారీ బహిరంగ సభగా నిర్వహించబోతున్నాం. ఈ చారిత్రాత్మక సభకు 40 దేశాల నుండి అంతర్జాతీయ ప్రతినిధులు హాజరవుతున్నారని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో ప్రచార జాతరలు నిర్వహించబడతాయి. రామకృష్ణాపూర్ లో వేలాది మందితో జిల్లా స్థాయి బహిరంగ సభ నిర్వహణ. రామకృష్ణాపూర్ లో జరిగే ఈ సభకు పార్టీ శ్రేణులు, ప్రజా సంఘాలు, కార్మికులు, సానుభూతిపరులు అందరూ హార్దిక, ఆర్థిక సహకారం అందించి జయప్రదం చేయాలని కోరారు.

కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. పేదలకు అందాల్సిన సంక్షేమ పథకాలు అట్టడుగు వర్గాలకు చేరే వరకు కమ్యూనిస్టు పార్టీ తన సమరశీల పోరాటాలను కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నుండి ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం వరకు కమ్యూనిస్టులు చేసిన ప్రాణత్యాగాలను ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు.

ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి మిట్టపల్లి శ్రీనివాస్, రాష్ట్ర సమితి సభ్యులు ఇప్పకాయల లింగయ్య, జిల్లా సమితి సభ్యులు మామిడి గోపి, వనం సత్యనారాయణ, నక్క వెంకటస్వామి, మిట్టపల్లి పౌలు, కాదండీ సాంబయ్య, ఎగుడ మొండి, మెరుగు రాజేశం, ఇరవేణి రవి, మారపెల్లి రవి, బత్తుల మొగిలి తదితరులు పాల్గొన్నారు.

మతి భ్రమించి మాట్లాడుతున్న బి ఆర్ ఎస్ నాయకులు

విశాలాంధ్ర ఖమ్మం : సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ లింగాల కమల్ రాజులు రాజకీయంగా ఎదగలేక, కాంగ్రెస్ పార్టీ పై చిల్లర ఆరోపణలు చేస్తున్నారని, జిల్లాలో 565 గ్రామపంచాయితీలు ఉంటే 370 గ్రామ పంచాయతీలలో కాంగ్రెస్ పార్టీ విజయకేతనం ఎగురవేసింధని, పంచాయితీ ఎన్నికలలో ప్రజలు చెదరించిన వారి బుద్ధి మారలేదని విమర్శించారు. చట్టం ముందు అందరూ సమానులేనని, కాంగ్రెస్ పార్టీ అధినాయకత్వం గానీ,నాయకులు గాని భౌతిక దాడులను ప్రోత్సహించదని అన్నారు, ప్రజా పాలనలో 6 గారంటీలు సక్రమంగా అమలు పరుస్తూ బడుగు బలహీన , అన్ని వర్గాల ప్రజలకు కాంగ్రెస్ పార్టీ చేరువ కావడం చూసి రాజకీయంగా ఓర్వలేకనే కాంగ్రెస్ పార్టీపై ఆరోపణలు చేయడం సరైనది కాదని హితవు పలికారు, కాంగ్రెస్ పార్టీ పార్టీపై ఇలాంటి చౌకబారు ఆరోపణలు చేస్తే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ హెచ్చరించారు. అదేవిధంగా తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు శాంతి కాముముకులని, నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిపించిన ప్రజలు ఆయన పట్ల ఉన్న ప్రేమను స్థానిక ఎన్నికల్లో చూపించారని అన్నారు.

కోతుల నివారణకు కార్యాచరణ

గ్రామంలో కోతులను తరిమికొట్టేందుకు చింపాంజీ వేషధారణ
వినూత్నంగా ఆలోచించిన బోనకల్ సర్పంచ్ బానోతు జ్యోతి, ఉప సర్పంచ్ బానోతు కొండ

విశాలాంధ్ర,బోనకల్ : మండల కేంద్రంలోని విపరీతమైన కోతుల బెడదను పారదోలెందుకు వినూత్నంగా ఆలోచించిన బోనకల్ సర్పంచ్ బానోతు జ్యోతి, ఉప సర్పంచ్ బానోతు కొండ గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామ ప్రజల సహకారంతో గ్రామపంచాయతీ మల్టీపర్పస్ వర్కర్ చే చింపాంజీ వేషధారణను వేయించి గ్రామంలో కోతుల బెడద నుంచి ప్రజలను రక్షించాలని సోమవారం గ్రామంలో కోతులను అరికట్టేందుకు కోతుల గుంపును తరిమికొట్టేందుకు గ్రామం అంత వెంబడించారు. ఈ సందరరేగా సర్పంచ్ బానోతు జ్యోతి, ఉప సర్పంచ్ బానోతు కొండ మాట్లాడుతూ... గ్రామంలో మీ వీధుల్లో కోతులను పారదోలెందుకు గ్రామపంచాయతీ వర్కర్స్ వచ్చినప్పుడు ప్రజలంతా వారికి సహకరించాలని, కోతులు ఉన్నచోట చింపాంజీ వేషంతో వస్తున్న మా పంచాయతీ వర్కర్స్ ను ఉపయోగించి కోతుల బెడద నుంచి ఈ గ్రామాన్ని కాపాడేందుకు ప్రజలంతా సహకరించాలని, ప్రజలంతా సురక్షితంగా ఉండాలని ఉద్దేశంతో, గ్రామంలో ప్రధానమైన సమస్య కోతుల బెడద నుంచి ప్రజలకు విముక్తి కలిగించాలనే ఆలోచనతోనే ఈ నిర?యం తీసుకున్నట్లు వారు అన్నారు. దీనికి ప్రజల సహకారం ఎంతో అవసరమని కావున ప్రజలు కూడా తప్పకుండా గ్రామ పంచాయతీ వారికి సహకరించాలని వారు కోరారు.

బహిరంగ సభకు తరలి రండి..

సిపిఐ నగర కార్యదర్శి జానిమియా

విశాలాంధ్ర - ఖమ్మం : భారత కమ్యూనిస్టు పార్టీ శతాబ్ది ఉత్సవాల ముగింపు సందర్భంగా జనవరి 18న జరగనున్న బహిరంగ సభకు పెద్ద ఎత్తున తరలి రావాలని సిపిఐ నగర కార్యదర్శి ఎస్ కె జానిమియా విజ్ఞప్తి చేశారు. బహిరంగ సభ ప్రచార కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక జెడ్పి సెంటర్ పాటు పలు కూడళ్లలో ప్రచారం నిర్వహించారు. ప్రజలకు కరపత్రాలను పంచుతూ బహిరంగ సభ ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందరరేగా జానిమియా మాట్లాడుతూ వందేళ్ల సుదీరి కాలంలో సిపిఐ ప్రజల పక్షాన అనేక పోరాటాలు చేసి విజయాలు సాధించిందన్నారు. నాటి పోరాటాలను మననం చేసుకుని భవిష్యత్తు పోరాటాలకు కార్యోన్ముఖులను చేసేందుకు జనవరి 18న చారిత్రిక సభను నిర్వహిస్తున్నట్లు జానిమియా తెలిపారు. చరిత్రలో నిలిచిపోయేవిధంగా బహిరంగ సభ జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సమితి సభ్యులు మహ్మద్ సలాం, జిల్లా కార్యవర్గ సభ్యులు పగడాల మల్లేష్, మేకల శ్రీనివాసరావు, యానాలి సాంబశివరెడ్డి, ఏఐటియుసి నాయకులు గాదె లక్ష్మి నారాయణ, ఎస్ కె సైదా, జ్వాలా నర్సింహారావు, కె. సతీష్రెడ్డి, ఈ.వెంకటేశ్వర్లు, శ్రీను, గోపి, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

గంజాయికేసులో నిందుతుడికి 20 ఏండ్ల జైలు శిక్ష

విశాలాంధ్ర -ఖమ్మం లీగల్ : గంజాయి కేసులో నిందుతుడికి 20 ఏండ్ల జైలు శిక్ష.....2లక్షల జరిమానా విధిస్తూ.. మొదటి అదనపు జిల్లా మరియు సెషన్స్ కోర్టు న్యాయమూర్తి కె. ఉమాదేవి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం... 2020 ఏడాది అక్టోబర్ 8 న కొణిజర్ల పోలీసులు ఆధ్వర్యంలో తనికెళ్ళ గ్రామ శివారులో వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానస్పదంగా కనిపించిన ఇన్నోవా కారు ను తనిఖీ చేయగా 19లక్షల విలువ గల 130 కేజీల గంజాయిని గుర్తించారు. నిందుతుడుని అదుపులో తీసుకునే విచారించగా అక్రమార్జన కోసం చింతూరు నుండి జాహిరాబాద్ కు గంజాయి సరఫరా చేస్తునట్లు విచారణ వెల్లడైంది. నిందితుడు సంగారెడ్డి జిల్లా మనియార్ గ్రామానికి చెందిన కేతావత్ ప్రవీణ్ కుమార్ (25)గా గుర్తించి కొణిజర్ల పోలీస్ స్టేషన్ లో %చీణూూ%, 1985 చట్టం కింద కేసు నమోదు చేసిన పోలీసులు సమగ్ర దర్యాప్తు అనంతరం కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశారు. నిందితుడిపై మోపిన అభియోగం రుజువు కావటంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కు సహకరించిన అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ,జె. శరత్ కుమార్ రెడ్డి, క కానిస్టేబుల్ రామారావు,కానిస్టేబుల్ మల్లికార్జున రావు, కోర్టు లైజనింగ్ కె.శ్రీకాంత, హోంగార్డ్ ఎండీ.ఆయూబ్ లు సహకరించారు.

నేటి నుండి ఫర్టిలైజర్ బుకింగ్ యాప్

పసునూరి వినయ్ కుమార్ మండల వ్యవసాయ అధికారి

విశాలాంధ్ర-బోనకల్: ప్రస్తుత యాసంగి సీజన్లో యూరియా కొనుగోలు చేయుటకు వ్యవసాయ శాఖ ఫర్టిలైజర్ బుకింగ్ యాప్ అమలులోకి తీసుకువచ్చింది. గత వాన కాలంలో యూరియా కోసం రైతులు ఇబ్బందులు పడిన విషయాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ యాప్ ను అమలులోకి తీసుకురావడం జరిగింది . రైతులు ఈ యాప్ ద్వారా జిల్లాలో అందుబాటులో ఉన్న యూరియాను వారి యొక్క పంటను బట్టి వారికున్న విస్తీరా?న్ని బట్టి జిల్లాలో ఏ డీలర్ అయినా ఏ సొసైటీలో అయినా అందుబాటులో ఉన్న యూరియాను బుక్ చేసుకోవడం ఒకసారి బుక్ చేసుకున్న తర్వాత 24 గంటల లోపు ఆ రైతు బుక్ చేసుకున్న డీలర్ దగ్గరికి వెళ్లి కొనుగోలు చేయవచ్చు .ఏదైనా పరిస్థితులలో 24 గంటల లోపు యూరియాను తీసుకోనట్లయితే ఆ యొక్క బుకింగ్ రద్దు అవుతుంది మళ్లీ రైతులు బుక్ చేసుకోవాల్సి ఉంటుంది . ఇందులో పట్టాదారులు, పట్టా పుస్తకాలు లేని వాళ్ళు మరియు కౌలు రైతులు యూరియాను బుక్ చేసుకునే వెసులుబాటు ఉంది. కౌలు దారులు అయితే వాళ్ళు ఎవరి దగ్గర అయితే కౌలుకు తీసుకున్నారు వారి యొక్క పట్టాదారు పాస్ బుక్ నెంబరు ద్వారా బుక్ చేసుకోవచ్చు.అయితే ఆ పట్టాదారు ఓటీపీ చెప్పాల్సి ఉంటుంది . ఈ యొక్క యాప్ ను రైతులకు అలవాటు చేయటానికి మరియు అవగాహన కల్పించడానికి ప్రతి ఔట్లెట్ దగ్గర వ్యవసాయ శాఖ ద్వారా ఒక వ్యక్తిని నియమించడం జరుగుతుంది లేదా సంబంధిత ఏఈ ఓ రైతులకు సహాయం చేయడం జరుగుతుంది .కాబట్టి రైతులందరూ కూడా ఈ యొక్క యాప్ ను వినియోగించుకొని యూరియాను కొనుగోలు చేయవచ్చు అన్నారు.

జనవరి 18న జరిగే సిపిఐ భారీ బహిరంగ సభను జయప్రదం చేయండి

సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల

విశాలాంధ్ర-బోనకల్ : భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) 100 సంవత్సరాలు పూర్తి చేసు కోబోతున్న సందరరేగా ఖమ్మం లో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభకు పార్టీ శ్రేణులు మొత్తం కదిలి వచ్చి జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. కలకోటలో ఎంగల వెంకటమ్మ అధ్యక్షతన జరిగిన సిపిఐ బోనకల్లు మండల సమితి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ త్యాగాలతో పునీతమైన చరిత్ర కలిగిన పార్టీ సిపిఐ అన్నారు. ఖమ్మం జిల్లాలో తొలి తరం కమ్యూనిస్టు నాయకులు బోనకల్ మండలంలోని ప్రారంభమైందన్నారు. ఈ మండలానికి చెందిన రావెళ్ల జానకి రామయ్య, పారుపల్లి రామయ్య లు వరంగల్ లో జరిగిన తొలి పార్టీ క్లాసులకు హాజరై ఎర్రజెండాను ఈ ప్రాంతానికి తీసుకువచ్చారన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో ఈ ప్రాంతం కీలక పాత్రను పోషించిందన్నారు. ఎందరో అమరవీరుల ప్రాణ త్యాగాలతో ఈ పార్టీని నిలబెట్టారన్న చరిత్రను ప్రస్తుత యువతకు తెలియచెప్పాలన్నారు. పార్టీ 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందరరేగా ఖమ్మంలో జరిగే భారీ బహిరంగ సభకు దేశం నలుమూలల నుండి కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు అభిమానులు రానున్నారని వారికి ఆతిథ్యం పలికే మన జిల్లా నుండి అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొనేలా కార్యకర్తలు చూడాల్సిన బాధ్యత ఉందన్నారు. ప్రతి కార్యకర్త వారింట్లో జరిగే పండుగలా భావించి బంధుమిత్రులను బహిరంగ సభకు ఆహ్వానించాలన్నారు. లిఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తోట రామాంజనేయులు, బెజవాడ రవిబాబు, బోనకల్ మండల కార్యదర్శి యంగల ఆనందరావు , సహాయ కార్యదర్శి బురి నాగేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు మాతంగి శ్రీనివాసరావు, ఏలూరి రమేష్, పారుపల్లి నరసింహారావు ,ఏలూరి పూర్ణచంద్రరావు, ఆళ్లపాడు, కలకోట, మోటమర్రి, గ్రామ శాఖ కార్యదర్శులు బెజవాడ నరేష్, వెంగళ రమేష్, వంగాల కృష్ణ మండల నాయకులు వల్లెబోయిన వీరభద్రం, కొంగర భాస్కరరావు, యువజన నాయకులు వంగాల గోపి, వంగాల అంజి, మహిళా నాయకురాళ్ళు కలకోట మాజీ ఎంపీటీసీ మాతంగి సామ్రాజ్యం, మంద వెంకట్ రావమ్మ, యంగల కృష్ణవేణి, కొంగర శిరీష, మాతంగి ప్రమీలలి తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్ ఫోన్‌ను అప్పగించిన ఎస్ఐ బైరు గోపి

విశాలాంధ్ర -కారేపల్లి : సంవత్సరం క్రితం కారేపల్లిలో పోగొట్టుకున్న సెల్ ఫోన్ ను కారేపల్లి ఎస్ ఐ బైరు గోపి రికవరీ చేసి పోగొట్టుకున్న బాధిత మహిళకు సోమవారం అప్పగించారు. ఇల్లందుకు చెందిన షేక్ సమీనా కౌసర్ అనే మహిళ కారేపల్లిలో ఏడాది క్రితం తన సెల్ ఫోన్ ను పోగొట్టుకుంది.మహిళ ఇచ్చిన ఫిర్యాదుతో విచారణ జరిపి ఫోన్ ను రికవరీ చేసి అప్పగించినట్లు ఎస్ ఐ తెలిపారు.